

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

అసమర్థ బ్రేకింగ్ వ్యవస్థతో ‘వందేభారత్’ 463 కి.మీ. ప్రయాణం

ముసాయిదా జాబితాలో పేర్లులేని వారు ఫారం–6 ద్వారా దరఖాస్తు

ఛత్తీస్‌గఢ్ నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉపసంహరణ 07

సంపుటి 09, సంచిక: 345 | సోమవారం | 16-11-2026 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00

మొదటి వారంలో పార్లమెంట్

శీతాకాల సమావేశాలు!

మళ్లీ తెరపైకి డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లు

- ప్రభుత్వానికి అత్యంత శాసనపరమైన ప్రాధాన్యతలుగా మారిన బిల్లు
- ఆమోదింప చేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నాలు



న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఇంకా నిరవధికంగా వాయిదా వేయకపోవడంపై ఒకవైపు ఉత్కంఠ కొనసాగుతుండగా మరోవైపు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబరు మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశాలు కపిస్తున్నాయి. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణపూరితంగా మారుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌తో ముడిపడిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ల బిల్లు ప్రభుత్వానికి అతిపెద్ద శాసనపరమైన ప్రాధాన్యతగా మారింది. ఈ క్రమంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు చాలా వాడివేడిగా జరగనున్నాయి. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుండి గరిష్టంగా 850కి పెంచాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును తరువాయి 8లో

తుమ్మిడిహెట్టి నిర్మాణంపై

మహారాష్ట్రను ఒప్పించండి

- సాస్కీ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5వేల కోట్లు మంజూరు చేయండి
- ప్రధాని నరేంద్ర మోదీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- న్యూఢిల్లీలోని ప్రధాని అధికారిక నివాసంలో భేటీ
- ‘ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026’కు రావాలని ఆహ్వానం



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో /హైదరాబాద్

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, అంతర్రాష్ట్ర వివాదాల పరిష్కారానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రాణహిత నదిపై తుమ్మిడి హెట్టి ప్రాజెక్టును 152 మీటర్లపై నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రాజెక్టుల పనులు వేగవంతం చేశామని, భూ నిర్వాసితులకు పరిహారం వేగంగా అందజేస్తున్నామని ప్రధానమంత్రికి సిఎం తెలియజేశారు. ప్రధాని మోదీతో సిఎం రేవంత్ రెడ్డి న్యూఢిల్లీలోని ప్రధాని అధికారిక నివాసంలో ఆదివారం సమావేశం అయ్యారు. సమావేశంలో కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ, తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును +152 మీటర్ల వద్ద నిర్మించేందుకు ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అయిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రధాన మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. మహారాష్ట్రలో ముంపునకు అవసరమైన పరిహారం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ సాగు నీటి అవసరాల దృష్ట్యా తుమ్మిడి హెట్టికి మహారాష్ట్రను ఒప్పించాలని ప్రధానిని సిఎం రేవంత్ రెడ్డి కోరారు. తుమ్మిడిహెట్టి తరువాయి 8లో

అవసరమైన పరిహారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

తెలంగాణ సాగు నీటి ప్రాజెక్టులకూ సహకరించండి



సిరీస్ భారత్ వశం

కివీస్‌తో ఐదో వన్డేలో విజయం

న్యూజిలాండ్ పర్యటనలో టీమ్ఇండియా ఇప్పటికే చి20 సిరీస్‌ను కైవసం చేసుకోగా.. ఇప్పుడు ఐదు వన్డేల సిరీస్‌ను కూడా దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఐదో వన్డేలో భారత్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి రెండు వన్డేల్లో భారత్ గెలవగా, మూడో వన్డే వర్షంతో రద్దయింది. నాలుగో మ్యాచ్‌లో కివీస్ గెలిచింది.

నాటుసారా తయారీపై

ఉక్కుపాదం

బెల్లం, పంచదారకు ప్రత్యామ్నాయంగా ఆన్‌లైన్‌లో ముడిపదార్థాల సరఫరా

పత్తి, మిరప చేలల్లో ద్రావకాల నిల్వలు!

రెండు రోజుల్లో 42 గ్రామాల్లో తనిఖీలు..

64 కేసులు నమోదు

36 మంది అరెస్టు.. మరో 40 మందిపై బైండోవర్

9,450 లీటర్ల నాటుసారా ద్రావకం ధ్వంసం



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

నాటుసారా తయారీదారులు ఎన్ని కొత్త ఎత్తులు వేసినా ఎక్సైజ్ శాఖ వారిని వదిలిపెట్టడం లేదు. నాటుసారా తయారీకి వినియోగించే నల్ల బెల్లం సరఫరాను అడ్డుకోవడంతో పంచదారను ప్రత్యామ్నాయంగా ఎంచుకున్న తయారీదారులు.. ఎక్సైజ్ నిఘా పెరగడంతో ఆన్‌లైన్ మార్గాన్ని ఆశ్రయించారు. కేకులు, ఇతర ఆహార పదార్థాల తయారీలో వినియోగించే పంచదార తరహా తరువాయి 8లో

రిజర్వాయర్లలో

సరిపడా నిల్వలు

వచ్చే వానాకాలం వరకు తాగునీటికి ఇబ్బంది లేదు

యాసంగిలో వరి సాగు చేయొద్దని రైతులకు మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి 12

విదేశీ ఉద్యోగాల ఆశ చూపి

రూ.1.28 కోట్లు వసూలు

ఫెయిర్ స్ట్రీట్‌పై కేసు

67 మంది తెలంగాణ యువతకు శిక్షణ.. ఒక్కరికే విదేశీ ఉద్యోగం

జర్మనీ పంపిస్తామని నమ్మించి నిధులు తీసుకున్నారంటూ ‘టామ్‌కామ్’ ఫిర్యాదు 03



వ్యవసాయ నల్లచట్టాలు తెచ్చేందుకు

మోదీ ప్రభుత్వం మళ్లీ కుట్ర

- సాగును విస్మరించి కార్పొరేట్లకు ఊడిగం
- నిజమైన దేశభక్తులం కమ్యూనిస్టులం.. మతతత్వ శక్తుల కుట్రలను సాగనివ్వం
- నల్లగొండలో జరిగిన ఎఐకెఎస్ బహిరంగ సభలో మాజీ ఎంపి బృందాకారాత్ ఉద్ఘాటన

ప్రజాపక్షం/నల్లగొండ

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గతంలో రైతాంగం తీవ్రంగా వ్యతిరేకించి పోరాటాలతో వెనక్కి తగ్గేలా చేసిన మూడు నల్ల వ్యవసాయ చట్టాలను మరో రూపంలో దొడ్డిదారిన తీసుకొచ్చే ప్రయత్నాలను తిప్పికొట్టాలని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు,మాజీ ఎంపి బృందాకారాత్ పిలుపునిచ్చారు. వ్యవసాయ రంగాన్ని, రైతుల ప్రయోజనాలను విస్మరిస్తూ కార్పొరేట్ సంస్థలకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తోందని విమర్శించారు. దేశంలో రైతులు భూమిలేని వ్యవసాయ కూలీలుగా మారుతున్న దుస్థితి నెలకొందని,రైతుల సమస్యల పరిష్కారానికి స్వామినాథన్ కమిషన్ సిఫారసులను ఎందుకు అమలు చేయడం లేదని పాలకులను ప్రశ్నించారు.ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాల మైదానంలో అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) 36వ జాతీయ మహాసభల సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రైతాంగ హక్కుల పరిరక్షణ కోసం దేశ వ్యాప్తంగా మరింత బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. దిమాగ్ నక్సలైట్లు కాదు.. దేశం కోసం, దేశ ప్రజల హక్కుల కోసం పోరాడే అసలైన దేశభక్తులం కమ్యూనిస్టులం అని బృందాకరత్ పేర్కొన్నారు. కమ్యూనిస్టులను దేశద్రోహులుగా, నక్సలైట్లుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బృందాకారాత్ విమర్శించారు. వాస్తవానికి దేశం కోసం, దేశ ప్రజల కోసం, శ్రమజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న అసలైన దేశభక్తులం కమ్యూనిస్టులమని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై పోరాడే శక్తులను తరువాయి 8లో



బొగ్గు బ్లాకులన్నీ

సింగరేణికే కేటాయించాలి

- తెలంగాణలో కొత్త ప్రాజెక్టులు రాకపోతే కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదం
- రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోంది
- కోయగూడెం-3, శ్రావణపల్లి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం : ఎఐటియుసి

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్

తెలంగాణ ప్రాంతంలో కొత్తగా గుర్తించిన అన్ని బొగ్గు బ్లాకులను ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికే కేటాయించాలని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. కోయగూడెం3, శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని హెచ్చరించారు. అవసరమైతే సింగరేణి వ్యాప్తంగా కార్మికులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ తరువాయి 12లో

రాజ్యాంగ సంస్థలకు పటిష్ఠమైన

రక్షణ కవచాలు అవసరం

సీనియర్ ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్ 03

తాగునీటి అవసరాలు తీర్చడం

అత్యంత కీలకం

ఎల్ నినో ప్రభావంతో గోదావరిలో తగ్గుతున్న నీటి ప్రవాహాలు

- వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు
- దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటి నిల్వ సామర్థ్యం పెంపు పనులు వేగవంతం చేయాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం
- దుమ్ముగూడెం ఆనకట్ట పనులు పరిశీలన



ప్రజాపక్షం/మణుగూరు

వేసవిలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఆదివారం భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం అమ్మ గారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ తరువాయి 12లో

మహిళా సంఘాలకు సహకారం

పేదలుండకూడదని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు

- మహిళలు ఆర్థికంగా ఎదిగి వ్యాపారవేత్తలుగా మారాలి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచన
- హనుమకొండ జిల్లాలో చేయూత పింఛన్ల పంపిణీ



ప్రజాపక్షం/హనుమకొండ

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వ్యాపారవేత్తలుగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం, మహిళా సమాఖ్య(వీవో) భవనాలను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లతో కలిసి మంత్రి సీతక్క ప్రారంభించారు. చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
16-11-2026
www.prajapaksham.in

సాహిత్యానికి మాధ్యమాల చేయూత

మానవ సమాజ పరిణామంలో మాధ్యమాలు, సాహిత్యం రెండూ అత్యంత కీలకమైన పాత్రను పోషించాయి. సాహిత్యం అనేది మానవ అనుభవాలు, భావోద్వేగాలు, ఆలోచనలు, సామాజిక పరిస్థితులు, సాంస్కృతిక విలువలకు అక్షరరూపం ఇచ్చే సృజనాత్మక ప్రక్రియ. మాధ్యమాలు ఈ సాహిత్యాన్ని ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తికి, ఒక తరం నుంచి మరొక తరానికి, ఒక ప్రాంతం నుంచి ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసే సమాచార సాధనాలు. ఈ రెండింటి మధ్య సంబంధం విడదీయలేనిది. కాలానుగుణంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పులు సాహిత్య సృష్టి, ప్రచురణ, పంపిణీ, పఠనం, విశ్లేషణ వంటి అన్ని అంశాలపై ప్రభావం చూపించాయి. మౌఖిక సంప్రదాయాల నుంచి లిఖిత రూపానికి, ముద్రణా యంత్రం నుంచి రేడియో, టెలివిజన్, సినిమా వరకు, అక్కడి నుంచి ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల వరకు సాగిన ప్రయాణం సాహిత్య స్వరూపాన్నే మార్చివేసింది. అందువల్ల మాధ్యమాలు సాహిత్యాన్ని ప్రజలకు చేరవేసే సాధనాలు మాత్రమే కాకుండా, సాహిత్య స్వభావాన్ని నిర్ణయించే శక్తులుగా కూడా పరిణమించాయి.

ప్రారంభ మానవ సమాజంలో సాహిత్యం ప్రధానంగా మౌఖిక రూపంలోనే ఉండేది. అప్పటి ప్రజలు తమ అనుభవాలను, చరిత్రను, వీరగాథలను, పురాణ కథలను పాటలు, పద్యాలు, కథల రూపంలో ఒకరి నుంచి మరొకరికి అందించేవారు. ముఖ్యంగా జానపద గేయాలు, వీరగాథలు, ఇతిహాసాలు మౌఖిక సాహిత్యానికి ప్రధాన ఉదాహరణలు. మౌఖిక సాహిత్యంపై పరిశోధనలు చేసిన మిల్మన్ ప్యారీ, ఆల్బర్ట్ లార్డ్ వంటి పండితులు ప్రాచీన ఇతిహాసాల నిర్మాణంలో మౌఖిక సంప్రదాయాల ప్రాధాన్యతను వివరించారు. వారి పరిశోధనల ప్రకారం, మౌఖిక కవులు ముందుగా ఏర్పడిన పదబంధాలు, ఛందస్సులు, కథన పద్ధతులను ఉపయోగించి గాథలను సందర్భానుసారంగా ప్రదర్శించేవారు. ఈ విధంగా సాహిత్యం వ్యక్తిగత సృజనతో పాటు సామూహిక జ్ఞాపక శక్తికి కూడా ప్రతీకగా నిలిచింది. కాలక్రమేణా చిత్రలిపి, సంకేతలిపి, రాతి శాసనాలు, తాళపత్రాలు, పాపిరస్ వంటి లిఖిత మాధ్యమాలు అభివృద్ధి చెందాయి. రోసెట్టా శిల వంటి చారిత్రక ఆధారాలు ప్రాచీన లిపుల అధ్యయనానికి మార్గం చూపించాయి. లిఖిత పద్ధతులు అందుబాటులోకి రావడంతో సాహిత్యాన్ని శాశ్వతంగా భద్రపరచడం సాధ్యమైంది. ఫలితంగా మౌఖిక సంప్రదాయాలపై ఆధారపడిన సాహిత్యం లిఖిత రూపంలో విస్తరించింది.

సాహిత్య చరిత్రలో ముద్రణా యంత్రం ఆవిష్కరణ ఒక గొప్ప మలుపు. పదిహేనవ శతాబ్దంలో జోహాన్స్ గూటెన్బర్గ్ అభివృద్ధి చేసిన అక్షరాల ముద్రణా సాంకేతికత పుస్తకాల తయారీలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. అంతకుముందు పుస్తకాలను చేతితో రాయాల్సి రావడంతో వాటి సంఖ్య పరిమితంగా ఉండేది. ముద్రణా యంత్రం అందుబాటులోకి వచ్చిన తరువాత ఒకే గ్రంథాన్ని పెద్ద సంఖ్యలో తక్కువ సమయంలో ముద్రించడం సాధ్యమైంది. దీంతో పుస్తకాలు సామాన్య ప్రజల కు కూడా అందుబాటులోకి వచ్చాయి. విద్య, విజ్ఞానం, సాహిత్యం, తత్వశాస్త్రం, రాజకీయ భావజాలం విస్తృతంగా వ్యాప్తి చెందాయి. పత్రికలు, వారపత్రికలు, మాసపత్రికలు అభివృద్ధి చెందడంతో రచయితలకు కొత్త పాఠక వర్గాలు ఏర్పడ్డాయి. తెలుగు సాహిత్యంలో కూడా ముద్రణా సాంకేతికత గొప్ప మార్పులకు కారణమైంది. పుస్తకాలు, పత్రికలు, నవలలు, కథలు, కవిత్వం ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయి. సామాజిక సంస్కరణలు, జాతీయోద్యమ భావాలు, ఆధునిక సాహిత్య ధోరణులు ప్రజలకు చేరువయ్యాయి. ఈ విధంగా ముద్రణా మాధ్యమం సాహిత్యాన్ని కొద్దిమందికి పరిమితమైన కళారూపం నుంచి ప్రజాస్వామిక సాంస్కృతిక ప్రక్రియగా మార్చింది. ఇక, ఇరవయ్యవ శతాబ్దంలో రేడియో, టెలివిజన్, సినిమా వంటి సామూహిక మాధ్యమాలు అభివృద్ధి చెందడంతో సాహిత్య వ్యాప్తికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయి. రేడియో ద్వారా కథలు, నాటికలు, కవితా పఠనాలు, సాహిత్య చర్చలు ప్రజలకు చేరాయి. చదవలేని వారికి కూడా సాహిత్యాన్ని వినే అవకాశం లభించింది. టెలివిజన్ దృశ్య, శ్రవణ మాధ్యమాలను సమన్వయం చేసి కథనానికి కొత్త రూపాన్ని అందించింది. సినిమా సాహిత్య రచనలను దృశ్యరూపంలోకి మార్చి విస్తృత ప్రేక్షకలోకానికి పరిచయం చేసింది. నవలలు, కథలు, నాటకాలు సినిమాలుగా, టెలివిజన్ ధారావాహికలుగా రూపాంతరం చెందాయి. ఈ ప్రక్రియను 'బహుమాధ్యమ అనుసరణ'గా పేర్కొనవచ్చు. ఒకే కథను పుస్తకం, సినిమా, టెలివిజన్, రేడియో వంటి వివిధ మాధ్యమాల ద్వారా విభిన్న అనుభూతులతో అందించడం సాధ్యమైంది. దీనివల్ల సాహిత్యానికి అంతర్జాతీయ స్థాయిలో కూడా విస్తృతమైన గుర్తింపు లభించింది.

> **కెనడియన్ మీడియా సిద్ధాంతవేత్త మార్షల్ మెక్లూహన్ ప్రతిపాదించిన 'మాధ్యమమే సందేశం' (ది మీడియం ఈజ్ ది మెసేజ్) అనే భావన మాధ్యమాల అధ్యయనంలో అత్యంత ప్రసిద్ధమైనది. ఒక సందేశంలోని విషయానికే కాకుండా, ఆ సందేశాన్ని అందించే మాధ్యమానికి కూడా సమానమైన ప్రాధాన్యత ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఉదాహరణకు, ఒకే కథను పుస్తకంలో చదివినప్పుడు పాఠకుడు తన ఊహాశక్తితో పాత్రలను, సంఘటనలను నిర్మించుకుంటాడు. అదే కథను సినిమాలో చూసినప్పుడు దర్శకుడి దృశ్యకల్పన, సంగీతం, నటన ద్వారా కథను అనుభవిస్తాడు. రేడియోలో విన్నప్పుడు స్వరం, శబ్దాలు, సంభాషణలు ప్రధానమవుతాయి. అంటే కథ ఒకటే అయినప్పటికీ మాధ్యమం మారినప్పుడు దాని స్వీకరణ, అర్థం, ప్రభావం మారుతాయి. అందువల్ల మాధ్యమం కేవలం సమాచారాన్ని చేరవేసే సాధనం మాత్రమే కాదు; అది మన ఆలోచనా విధానాన్ని, అనుభూతిని, సామాజిక అవగాహనను కూడా ప్రభావితం చేస్తుంది.**

బ్రిటిష్ సాంస్కృతిక అధ్యయనాల ప్రముఖ సిద్ధాంతవేత్త స్టువర్ట్ హాల్ ప్రతిపాదించిన 'ఎన్‌కోడింగ్/ డికోడింగ్ మోడల్' మాధ్యమ సందేశాల అర్థాన్ని విశ్లేషించడానికి ఉపయోగపడుతుంది. ఈ సిద్ధాంతం ప్రకారం రచయితలు, నిర్మాతలు లేదా మీడియా సంస్థలు తమ సందేశాల్లో కొన్ని భావజాలాలను, విలువలను, సామాజిక దృక్పథాలను సంకేతీకరిస్తారు. అయితే ప్రేక్షకులు లేదా పాఠకులు ఆ సందేశాలను అందరూ ఒకే విధంగా అర్థం చేసుకోరు. వారి సామాజిక నేపథ్యం, విద్య, సంస్కృతి, రాజకీయ అభిప్రాయాలు, వ్యక్తిగత అనుభవాల ఆధారంగా సందేశాలను విశ్లేషిస్తారు. ప్రేక్షకుల స్పందనను ఆధిపత్య పఠనం (డామినెంట్ రీడింగ్) అంటే, రచయిత లేదా నిర్మాత ఉద్దేశించిన అర్థాన్ని ప్రేక్షకులు అంగీకరించడం, చర్చాత్మక పఠనం (నెగోషియేటెడ్ రీడింగ్) అంటే, సందేశంలోని కొన్ని అంశాలను అంగీకరిస్తూనే మరికొన్ని అంశాలపై భిన్నాభిప్రాయాలను కలిగి ఉండటం, విపక్ష పఠనం (అపొజిషనల్ రీడింగ్), అంటే, రచయిత ఉద్దేశించిన భావజాలాన్ని పూర్తిగా ప్రశ్నిస్తూ, ప్రత్యామ్నాయ అర్థాన్ని నిర్మించుకోవడం అనే మూడు రకాలుగా హాల్ వివరిస్తాడు. ఈ సిద్ధాంతం ప్రకారం సాహిత్య పాఠకుడు నిష్క్రియాత్మక స్వీకర్త కాదు. అతడు లేదా ఆమె సాహిత్యానికి కొత్త అర్థాలను అందించే క్రియాశీల భాగస్వామి.

జర్మన్ మీడియా సిద్ధాంతవేత్త ఫ్రెడ్రిక్ కిట్లర్ సాహిత్యాన్ని ఒక శాశ్వతమైన, మాధ్యమాలకు అతీతమైన కళారూపంగా చూడలేదు. ఆయన దృష్టిలో సాహిత్యం కూడా నిర్దిష్ట చారిత్రక కాలాల్లో అభివృద్ధి చెందిన మీడియా సాంకేతికతలతో ముడిపడి ఉంటుంది. లిఖిత భాష, ముద్రణా యంత్రం, ఫొటోగ్రఫీ, శబ్ద రికార్డింగ్, సినిమా, కంప్యూటర్ వంటి సాంకేతిక పరిజ్ఞానాలు మనం సమాచారాన్ని నమోదు చేసే, భద్రపరిచే, ప్రసారం చేసే విధానాలను మార్చాయి. ఈ మార్పులు సాహిత్య రూపాలను కూడా ప్రభావితం చేశాయి. కాబట్టి సాహిత్య చరిత్రను అర్థం చేసుకోవాలంటే దాని వెనుక ఉన్న మాధ్యమ




సాంకేతికతల చరిత్రను కూడా అధ్యయనం చేయాలి. ఇక, 21వ శతాబ్దంలో ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు సాహిత్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. సాహిత్య సృష్టి, ప్రచురణ, పఠనం, విమర్శ అన్నీ డిజిటల్ వేదికలకు విస్తరించాయి. ట్విట్టర్ (ప్రస్తుతం 'ఎక్స్'), బ్లాగులు, డిజిటల్ డేటాబేస్‌లు వంటి వేదికలు సాహిత్యానికి కొత్త రూపాలను పరిచయం చేశాయి. తక్కువ పదాల్లో భావాన్ని వ్యక్తపరిచే మైక్రోబ్లాగింగ్, ఫ్లాష్ ఫిక్షన్, వీడియో కవిత్వం, హైపర్‌టెక్స్ట్ కథనాలు వంటి ప్రక్రియలు ప్రాచుర్యం పొందాయి. ట్విటర్‌లో పరిమిత అక్షరాల్లో కథలు, కవితలు రాసే విధానాన్ని 'ట్విటరేచర్' అని పిలుస్తారు. ఫ్లాష్ ఫిక్షన్‌లో చాలా తక్కువ పదాల్లో ఒక పూర్తి కథన అనుభూతిని అందిస్తారు. వీడియో కవిత్వంలో కవిత్వాన్ని దృశ్యాలు, సంగీతం, శబ్దాలతో కలిపి అందిస్తారు. హైపర్‌టెక్స్ట్ కథనాల్లో పాఠకుడు వివిధ లింకులను అనుసరిస్తూ కథలోని విభిన్న మార్గాలను ఎంచుకోవచ్చు. ఈ కొత్త ప్రక్రియలు రచయితలకు ప్రయోగాత్మక స్వేచ్ఛను కల్పించాయి. పాఠకులు కూడా కేవలం చదివేవారిగా కాకుండా కథన నిర్మాణంలో భాగస్వాములయ్యే అవకాశాన్ని పొందారు. డిజిటల్ మాధ్యమాల వల్ల ప్రచురణ రంగంలో ఉన్న అనేక పరిమితులు తగ్గిపోయాయి. గతంలో రచయితలు తమ రచనలను ప్రచురించడానికి ప్రచురణ సంస్థలపై ఆధారపడాల్సి వచ్చేది. ప్రస్తుతం బ్లాగులు, ఇ–పుస్తకాలు, స్వీయ ప్రచురణ వేదికలు, సామాజిక మాధ్యమాల ద్వారా రచయితలు నేరుగా పాఠకులను చేరుకోవచ్చు. 'బుక్‌టాక్', 'ఇన్‌స్టాగ్రామ్' వంటి వేదికలు పుస్తక పరిచయాలు, సమీక్షలు, పఠన అనుభవాలు, రచయితలతో సంభాషణలకు వేదికలుగా మారాయి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠకులు ఒకే పుస్తకం చుట్టూ అభిమాన సంఘాలను ఏర్పరచుకుంటున్నారు. దీని వల్ల కొత్త రచయితలకు గుర్తింపు లభించడంతో పాటు ప్రాంతీయ భాషల సాహిత్యానికి కూడా అంతర్జాతీయ పాఠకులను చేరుకునే అవకాశం ఏర్పడింది. డిజిటల్ మాధ్యమాలు సాహిత్యానికి అవకాశాలను కల్పించినప్పటికీ కొన్ని సవాళ్లను కూడా సృష్టించాయి. సామాజిక మాధ్యమాల్లో లైకులు, షేర్లు, వ్యూస్, కామెంట్లు వంటి గణాంకాలు ఒక రచన ప్రజాదరణను నిర్ణయించే ప్రమాణాలుగా మారుతున్నాయి. అల్గారిథమ్‌లు ఎక్కువ మంది దృష్టిని ఆకర్షించే కంటెంట్‌కు ప్రాధాన్యత ఇస్తాయి. ఫలితంగా సంక్షిప్తమైన, సంచలనాత్మకమైన, తక్షణ వినోదాన్ని అందించే రచనలు వేగంగా వ్యాప్తి చెందుతాయి. మరోవైపు లోతైన ఆలోచన, విస్తృతమైన కథన నిర్మాణం, సంక్లిష్టమైన భావవ్యక్తీకరణ కలిగిన సాహిత్య రచనలకు తగినంత ఆదరణ లభించకపోవచ్చని విమర్శకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా సాహిత్యం కూడా మార్కెట్ ధోరణులకు అనుగుణంగా మారే ప్రమాదం ఉంది. పాఠకుల అభిరుచుల కంటే వాణిజ్య ప్రయోజనాలు, ప్రజాదరణ గణాంకాలు ప్రాధాన్యత పొందితే సాహిత్యంలోని ప్రయోగాత్మకత, స్వతంత్ర ఆలోచన, కళాత్మక విలువలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఏదిఏమైనా, మాధ్యమాలు, సాహిత్యం మధ్య సంబంధం నిరంతరం పరిణామం చెందుతున్న ఒక చారిత్రక, సామాజిక, సాంస్కృతిక ప్రక్రియగా పేర్కొనవచ్చు. మౌఖిక సంప్రదాయాల నుంచి లిఖిత రూపానికి, ముద్రణా విప్లవం నుంచి సామూహిక మాధ్యమాలకు, అక్కడి నుంచి డిజిటల్ ప్రపంచానికి సాగిన ప్రయాణం సాహిత్య స్వరూపాన్ని విస్తృతంగా మార్చింది. అయితే, సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా సాహిత్యానికి ప్రాణం దాని మానవీయ అనుభూతులు, సృజనాత్మకత, సామాజిక స్పృహ, ఆలోచనా లోతుల్లోనే ఉంటుంది. మాధ్యమాలు మారవచ్చు, రచనా పద్ధతులు మారవచ్చు, పాఠకుల అభిరుచులు మారవచ్చు. కానీ మానవ జీవితాన్ని అర్థం చేసుకోవడం, అనుభవాలను పంచుకోవడం, సమాజాన్ని ప్రశ్నించడం, కొత్త ఆలోచనలకు దారితీయడం అనే సాహిత్య ప్రధాన లక్ష్యాలు ఎప్పటికీ కొనసాగుతాయి. కాబట్టి మాధ్యమాల సాంకేతిక అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూనే సాహిత్యంలోని కళాత్మకతను, మానవీయ విలువలను, విమర్శనాత్మక ఆలోచనను కాపాడుకోవడం నేటి రచయితలు, పాఠకులు, పరిశోధకుల బాధ్యత.

– బిఎల్

చదవాల్సిన పుస్తకం

మనసు–మెదడు మధ్య అద్భుతమైన సంభాషణ


మనిషి ఆలోచనలకు, భావోద్వేగాలకు, సంకల్పానికి అసలు శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? మనసు అనేది మెదడులో జరిగే రసాయనిక చర్యల ఫలితమేనా? లేక మెదడును ప్రభావితం చేయగల స్వతంత్ర శక్తి మనసుకు ఉందా? ఈ ప్రశ్నలకు శాస్త్రం, తత్వశాస్త్రం, వైద్యం కలిసే కూడలి లో సమాధానం వెతికే అరుదైన గ్రంథం డాక్టర్ జెఫ్రీ ఎం. ష్వాట్జ్, షారన్ బెగ్లీ రచించిన 'ది మైండ్ అండ్ ది బ్రెయిన్: న్యూరోప్లాస్టిసిటీ అండ్ ది పవర్ ఆఫ్ మెంటల్ ఫోర్స్'. రెండు దశాబ్దాల క్రితం వెలువడిన ఈ పుస్తకం అప్పటి నాడీ విజ్ఞాన చర్చలకు ఒక కొత్త కోణాన్ని అందించింది. మెదడు ఒక స్థిరమైన అవయవం కాదని, మన అనుభవాలు, ఆలోచనలు, అలవాట్లు, దృష్టి, సంకల్పం ఆధారంగా దాని నాడీ సంబంధాలు మారగలవని చెప్పే 'న్యూరోప్లాస్టిసిటీ' భావనను రచయితలు కేంద్రంగా చేసుకున్నారు. అయితే వారి వాదన అంతటితో ఆగదు. మనిషి తన దృష్టిని, ఆలోచనలను ఉద్దేశపూర్వకంగా మళ్లించడం ద్వారా మెదడులోని నాడీ మార్గాలను కూడా ప్రభావితం చేయగలదన్నది పుస్తకంలోని ప్రధాన ఆలోచన. ఈ సిద్ధాంతానికి బలమైన ఆధారంగా రచయితలు తమ వైద్య అనుభవాలను ముందుకు తెస్తారు. ముఖ్యంగా అబ్సెసివ్ కంపల్సివ్ డిజార్డర్ (ఒసిడి)తో బాధపడుతున్న రోగుల చికిత్సలో మందులపై మాత్రమే ఆధారపడకుండా, అవగాహన, దృష్టి మళ్లింపు, ప్రవర్తనా మార్పులను ఉపయోగించిన విధానాన్ని వివరిస్తారు. బాధితుడి మెదడు పంపే అనవసరమైన, భయపెట్టే సందేశాలను వెంటనే నిజాలుగా స్వీకరించకుండా వాటిని గుర్తించడం, వాటికి కొత్త పేరు పెట్టడం, వాటి నుంచి దృష్టిని మరల్చడం, ఉపయోగకరమైన చర్యపై ఏకాగ్రతను కేంద్రీకరించడం వంటి నాలుగు దశల విధానాన్ని వారు వివరిస్తారు. ఇక్కడే పుస్తకం సాధారణ వైద్య గ్రంథం నుంచి ఆసక్తికరమైన ఆలోచనా గ్రంథంగా మారుతుంది. ఒక ఆలోచన వచ్చిందంటే దానికి మనం తప్పనిసరిగా లొంగిపోవాల్సిన అవసరం లేదని రచయితలు చెబుతారు. మెదడు ఒక సందేశాన్ని పంపవచ్చు. కానీ దానిని అంగీకరించాలా, తిరస్కరించాలా, దృష్టిని మరొక దిశకు మళ్లించాలా అన్న నిర్ణయంలో మనిషి సంకల్పానికి పాత్ర ఉందని వివరిస్తారు. ఇది మానసిక సమస్యలతో బాధపడేవారికి మాత్రమే కాదు, తన ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ ఆలోచింపజేసే అంశం. ఈ పుస్తకంలోని మరో విశేషం దాని అంతర్విభాగ దృష్టి. నాడీ విజ్ఞానాన్ని బౌద్ధ ధ్యాన సంప్రదాయాలతో అనుసంధానించడంతో పాటు, భౌతిక శాస్త్రవేత్త హెన్రీ స్టాప్ ఆలోచనలను ఉపయోగించి మనసుమెదడు సంబంధాన్ని వివరించేందుకు ప్రయత్నించారు. చైతన్యం భౌతిక మెదడుపై ప్రభావం చూపగల దన్న భావనను ఈ చర్చ మరింత విస్తరిస్తుంది. అయితే ఇక్కడే పుస్తకానికి సంబంధించిన ప్రధాన విమర్శ కూడా మొదలవుతుంది. క్వాంటం భౌతిక శాస్త్రాన్ని మనసుమెదడు పరస్పర చర్యకు వివరణగా ఉపయోగించే ప్రయత్నం ఆసక్తికరమైనదే అయినప్పటికీ, దానిని శాస్త్రీయంగా పూర్తిగా నిర్ధారితమైన సిద్ధాంతంగా పరిగణించలేం. ముఖ్యంగా కఠినమైన భౌతికవాద దృక్పథాన్ని అనుసరించే శాస్త్రవేత్తలకు ఈ వాదనలు ఊహాత్మకంగానే కనిపించవచ్చు. అందువల్ల పుస్తకంలోని ప్రతి తాత్విక నిర్ధారణను స్థిరపడిన శాస్త్రీయ వాస్తవంగా చదవడం కంటే, ఒక ప్రభావవంతమైన శాస్త్రీయతాత్విక ప్రతిపాదనగా చూడటం సముచితం. అయినప్పటికీ ఈ గ్రంథం ప్రాధాన్యం తగ్గదు. మెదడు మార్పులకు లోనయ్యే సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం ద్వారా పక్షవాతం తర్వాత పునరావాసం, కొన్ని అభ్యసన సమస్యలు, ఇతర నాడీ సంబంధిత రుగ్మతల చికిత్సలో భవిష్యత్తు అవకాశాలపై పుస్తకం కొత్త ఆలోచనలను రేకెత్తిస్తుంది. ముఖ్యంగా మందులే పరిష్కారం అన్న పరిమిత దృక్పథాన్ని దాటి, ఆలోచన, శ్రద్ధ, సంకల్పం, ప్రవర్తనలకు కూడా చికిత్సలో స్థానం ఉందని గుర్తుచేస్తుంది. మొత్తానికి, మన మెదడు మన జీవితాన్ని ప్రభావితం చేయడమే కాదు, మన జీవన అనుభవాలు, ఉద్దేశపూర్వక మానసిక ప్రయత్నాలు కూడా మెదడును మార్చగలవనే సందేశాన్ని 'ది మైండ్ అండ్ ది బ్రెయిన్' పాఠకుడికి ఇస్తుంది. శాస్త్రం ఇంకా సమాధానాల కోసం అన్వేషిస్తున్నప్పటికీ, మనసుమెదడు సంబంధాన్ని సాధారణ పాఠకుడి ముందుకు తీసుకురావడంలో ఈ పుస్తకం విజయవంతమైంది. ఇందులోని కొన్ని సిద్ధాంతాలు వివాదాస్పదమైనవిగా కనిపిస్తాయి. కానీ, మనిషి సంకల్పానికి, చైతన్యానికి, మార్పు సామర్థ్యానికి ఇది ఇచ్చే ప్రాధాన్యం పుస్తకాన్ని ఇప్పటికీ చదవదగినదిగా నిలబెడుతుంది.



– మేడారపు శ్రీదేవి

ఈ వారం కవితలు

పాటకు లాల్ సలాం !



పాటకు లాల్ సలాం
జనం పాటకు లాల్ సలాం
పాటకు లాల్ సలాం
పోరు పాటకు లాల్ సలాం

ప్రగతి శీల ఉద్యమమై
ప్రభవించే పాటకు
వామపక్ష భావజాలమై
ప్రజ్వరిల్లు పాటకు
గొంతెత్తి చెబుతున్నా
లాల్ సలాం
గుండె విప్పి చెబుతున్నా
లాల్ సలాం
లాల్ సలాం.....లాల్ సలాం
లాల్ సలాం..... లాల్ సలాం

చెరసాలల గోడలపై
ఉరికొయ్యల వాడలపై
ఉదయించే పాటకు లాల్ సలాం
ఉద్యమాల ఊయల లూపి
వీరుల త్యాగాలను తెలిపిన
విప్లవాల లాలిపాటకు లాల్ సలాం

అణువు అణువున అగ్గిరేపిన
కంటి కంటిలో
జ్వాల రేపిన
డప్పు పాటకు.... గజ్జె పాటకు
గుప్పు గుప్పుమను నిప్పు పాటకు
రక్త తిలకమై చేస్తున్నా లాల్ సలాం
లాల్ సలాం..... లాల్ సలాం
లాల్ సలాం..... లాల్ సలాం

శ్రమ జీవుల కేతనమై
జనగణరణ కీర్తనమై
రవళించు పాటకు లాల్ సలాం
అంధకారమైన బతుకులో
రేపటి దీపాలను నిలిపిన
వేగుచుక్క పాటకు లాల్ సలాం

అడుగు అడుగున గుండె నెత్తురులు
తర్పణ చేస్తూ సాగిన పాటకు
బతుకు పాటకు.. మెతుకు పాటకు
పలుకు పలుకులో రగులు పాటకు
శిరస్సు వంచి చేస్తున్నా
లాల్ సలాం
లాల్ సలాం..... లాల్ సలాం
లాల్ సలాం ..... లాల్ సలాం

బాజ్జీ

ఓటు గల్లంతు

ఓటు గల్లంతు భలే గమ్మత్తు
ఏమిటి ఈ సంస్కారం
దీనికి లేదా పరిష్కారం
ఓటర్ల జాబితాలో తిరస్కారం
ప్రజాస్వామ్యమా నీకో నమస్కారం


ఓటు హక్కు
మనదేశ పౌరులకు దిక్కు
దీనిని మార్చొద్దు మొక్కు
ఓటు ఎవరికీ కాదు లక్కు
భారతీయులకు రాజ్యాంగం
కల్పించిన హక్కు

ఓటు హక్కును తొలగించడం
మీ కెంత గుండె ధైర్యం
మీకు ఓటు వేసే వారికి చోటు
మీకు ఓటు వేయరనుకునే వారికి
మీరు కలిగిస్తారు చేటు
ప్రతిపక్షం లేకుండా
ఏకచ్ఛత్రాధిపత్యం కోసం తండ్లాట
అధిక స్థానాలు కైవసం
చేసుకోవడానికి దేవులాట

పోలింగ్ భూతులలో కొట్లాట
రిగ్గింగ్ ర్యాగింగ్
దొంగ ఓట్ల పోలింగ్
నీతి నిజాయితీ న్యాయం ధర్మం
సమాజ సేవే పరమావధి
ఓటు హక్కు సాధించడం మన విధి

డాక్టర్. ఎస్.విజయ భాస్కర్

ఆకట్టుకునే రచనలు..



'ఇక చాలు' అనుకునే పరిస్థితి పాఠకులకు కలగడం రెండు సందర్భాల్లో సాధ్యమవుతుంది. మొదటిది ఒక రచన మరీ నాసిరకంగా లేదా ఏ మాత్రం ఆకట్టుకోలేని విధంగా ఉన్నప్పుడు. రెండోది, ఒక అద్భుతమైన రచన చదివిన ప్పుడు. ఈ రెండో భావం కలిగిందంటే జయశంకర్ ప్రసాద్ రాసిన 'కామయానీ' వంటి నాటక పుస్తకాన్ని చదివారని అనుకోవచ్చు. ఇది ఒక సంతృప్తి బిందువు. ఏదైనా గొప్ప రచన చదువుతున్నప్పుడు, వింటున్నప్పుడు, లేదా చూస్తున్నప్పుడు ఒక దశలో మనసు పూర్తిగా నిండిపోతుంది. ఇక కొత్తది లోపలికి రావాలనిపించదు. మరేదీ అంతగా నచ్చదు. బహుశా అదే సంతృప్తి బిందువు. జయశంకర్ 'కామాయనీ'తో పాటు ఆయన నాటకాలన్నిటికీ దాదాపు ఇలాంటి లక్షణమే ఉంది. 'నా రచనలు చవకబారు వినోదం కోసం కాదు, రసజ్ఞులైన పాఠకుల కోసం' అన్న ఆయన భావం, వాటిని చదువుతు న్నప్పుడు అవగతమవుతుంది. డాక్టర్ శ్యామ్ సింగ్ శశి రాసిన 'అగ్నిసాగర్' కూడా అలాంటిదే. ప్రసాద్ 'కామయనీ' లోని మనువునే ఆధారంగా చేసుకున్నా, ఆయన దృష్టి పూర్తి గా భిన్నం. 'కామయనీ'లో ఆధ్యాత్మిక, మానసిక తత్వం ప్రధానమైతే, 'అగ్నిసాగర్'లో సామాజిక యథార్థం, శోషణ రహిత సమాజం, ఆదివాసీ సంస్కృతి ప్రతిధ్వనిస్తాయి. ఒకే పాత్రను రెండు దృష్టికోణాలు ఎంత భిన్నంగా చూపించగలవో వాటిని చదివితే అర్థమవుతుంది. ధర్మవీర్ భారతి రాసిన 'అంధాయుగ్' కూడా పాఠకుడిని సంతృప్తి బిందువు కు చేర్చే రచనే. ఇలాంటి ఆకట్టుకునే రచనలు చదివిన తర్వాత, ఇతర రచన లు అంతగా ఆకర్షించవు. కొత్తగా ఏదైనా చదవాలనే ఆత్రం కలగలేదు. కొన్ని రచనలు మనం చదవం. అవే మన లోకి ప్రవేశించి, మనం తర్వాత చదివే ప్రతిదాన్నీ చూసే కళ్లను మార్చేస్తాయి.

సత్యాన్వేషణలో ఆలోచన... జీవితాన్వేషణలో అనుభవం

ప్లేటో రచించిన 'రిపబ్లిక్', అరిస్టాటిల్ రచించిన 'నికోమాకియన్ ఎథిక్స్' చదవకపోయినంత మాత్రాన ఒక కవి లేదా రచయితను అసంపూర్ణ మేధావిగా పరిగణించలేం. అయితే, హోమర్ లేదా షేక్స్‌పియర్ రచనలతో పరిచయం లేని తత్వవేత్త మానవ అస్తిత్వంలోని సంక్లిష్టతలను పూర్తిగా అర్థం చేసుకోవడంలో కొన్ని పరిమితులను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ వ్యత్యాసం సాహిత్యానికి, తత్వశాస్త్రానికి మధ్య ఉన్న ప్రాథమిక భేదాన్ని స్పష్టం చేస్తుంది. తత్వశాస్త్రం భావనలు, నిర్వచనాలు, తార్కిక వాదనల ద్వారా సత్యాన్ని అన్వేషిస్తే, సాహిత్యం మానవ జీవితంలోని అనుభవాలు, సంఘర్షణలు, భావోద్వేగాల ద్వారా సత్యాన్ని ఆవిష్కరిస్తుంది. తత్వశాస్త్రం ప్రపంచాన్ని విశ్లేషిస్తే, సాహిత్యం ఆ ప్రపంచంలో మనల్ని జీవింపజేస్తుంది. తద్వారా మనిషిగా ఉండటంలోని అంతరార్థాన్ని మరింత లోతుగా గ్రహించే అవకాశం కల్పిస్తుంది. సాహిత్యానికి ముడిసరుకు మానవ జీవితమే. నిత్యజీవితంలోని సాధారణ సంఘటనలు, మానవ సంబంధాల్లోని సాన్నిహిత్యం, కోరికలకు బాధ్యతలకు మధ్య తలెత్తే సంఘర్షణలు, వ్యక్తిగత జీవితాన్ని ప్రభావితం చేసే సామాజిక వైరుధ్యాలు వంటివన్నీ సాహిత్యానికి ఇతివృత్తాలవుతాయి. ప్రేమ, బాధ, ఆశయం, అన్యాయం, భయం, ఆశ, నష్టం వంటి అనుభవాలు సాహిత్య సృజనకు ప్రేరణనిస్తాయి. మానవ జీవితం ఎప్పుడూ క్రమబద్ధమైన సూత్రాలకు అనుగుణంగా సాగదు. అందులో అసంగతతలు, పరిష్కారం కాని సంఘర్షణలు, నైతిక సందిగ్ధతలు, ఊహించని మలుపులు సహజం. సాహిత్యం ఈ వైరుధ్యాలను తొలగించడానికి ప్రయత్నించదు; వాటికి ఒక రూపాన్ని కల్పించి, వాటిలోని సంక్లిష్టతను అర్థం చేసుకునేలా చేస్తుంది. ఒక వ్యక్తి ఒక సందర్భంలో ధైర్యంగా, మరో సందర్భంలో భయంతో ప్రవర్తించవచ్చు. ఒకే మనిషిలో కరుణతో పాటు క్రూరత్వం, హేతుబద్ధతతో పాటు అహేతుకత కూడా సహజీవనం చేయవచ్చు. ఇవి కేవలం మానవ స్వభావంలోని లోపాలు కావు; మనిషిని అర్థం చేసుకోవడానికి అవసరమైన కీలకమైన సంకేతాలు. దీనికి భిన్నంగా, తత్వశాస్త్రం వ్యక్తిగత అనుభవాల ప్రత్యేకతలను అధిగమించి సాధారణ సూత్రాలు, సార్వత్రిక ప్రతిపాదనల వైపు ప్రయాణిస్తుంది. భావనలను నిర్వచించడం, వర్గీకరించడం, వాటి మధ్య సంబంధాలను విశ్లేషించడం, తార్కికంగా సమర్థించగలిగిన అంశాలను ఆధారరహితమైన వాదనల నుంచి వేరు చేయడం దాని ప్రధాన లక్షణాలు. ఈ విధానం ఆలోచనకు స్పష్టతను, విశ్లేషణకు క్రమబద్ధతను అందిస్తుంది. అయితే, జీవించిన అనుభవంలోని ప్రతి అంశాన్నీ ఒక సాధారణ సూత్రంలోకి ఇమిడ్చడం సాధ్యం కాదు. వ్యక్తిగత జ్ఞాపకాల భావోద్వేగ తీవ్రత, సంబంధాల్లోని ప్రత్యేకత, పరిష్కారం కాని నైతిక సందిగ్ధత

తెలంగాణ క్రీడా చరిత్రలో..

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మైలురాయి

క్రీడల నిర్వహణకు
రూ.203.13కోట్ల రాష్ట్ర బడ్జెట్
శాశ్వత మౌలిక వసతుల కల్పనే
లక్ష్యం : మంత్రి వాకిటి శ్రీహరి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : తెలంగాణను జాతీయ క్రీడా పటంలో మరింత ఉన్నత స్థానంలో నిలిపేందుకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 వేదిక కానున్నాయని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక క్రీడా సంబరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్ల భారీ బడ్జెట్ కేటాయించిందని, ఈ నిధులతో పోటీల నిర్వహణతో పాటు స్టేడియాల్లో శాశ్వత మౌలిక వసతులు కల్పించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ క్రీడా చరిత్రలో ఈ పోటీలు ఒక మైలురాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ వేదికగా డిసెంబర్ 11 నుంచి 22వరకు జరగనున్న ఎనిమిదో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. క్రీడల నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.21కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్లు కేటాయించిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసారి పోటీల్లో 27 క్రీడాంశాలు ఉండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ కర్రసామును కూడా చేర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 7వేల మందికి పైగా క్రీడాకారులు, సుమారు 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది పాల్గొననున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు 'మత్తు వదలండి.. మైదానాలు చేరండి' నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని, యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించడమే లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

రాజ్యాంగ సంస్థలకు పటిష్టమైన

రక్షణ కవచాలు అవసరం

ప్రొఫెసర్ సిద్ధార్థ్ వరదరాజన్



ప్రజాపక్షం, న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : దేశంలో ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తి, పౌర హక్కులను కాపాడుకోవాలంటే ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, మీడియా వంటి రాజ్యాంగ సంస్థలకు పటిష్టమైన రక్షణ కవచాలు అవసరమని 'ది వైర్' వ్యవస్థాపక సంపాదకులు ప్రొఫెసర్ సిద్ధార్థ్ వరదరాజన్ అన్నారు. ఎన్నికల వ్యవస్థ నుంచి సమాఖ్య వ్యవస్థ వరకు రాజ్యాంగ సంస్థల పరిరక్షణే ప్రస్తుత ప్రధాన కర్తవ్యమన్నారు.
ఎన్నికల సంఘం స్వతంత్రత, మీడియా స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ నిష్పాక్షికత, పౌర హక్కులు, రాష్ట్రాల సమాన హోదా పరిరక్షణ కోసం ప్రజలు, ప్రజాసంఘాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే ఆచార్య జయశంకర్ ఆశయాలకు నిజమైన నివాళి అని అన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక(టివివి) ఆదివారం హైదరాబాద్, బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం ప్రొఫెసర్ జయశంకర్ 15వ స్మారకోపన్యాసం జరిగింది. ఈ కార్యక్రమానికి టివివి రాష్ట్ర అధ్యక్షులు అంబటి నాగయ్య అధ్యక్షత వహించగా సిద్ధార్థ్ వరదరాజన్ ''ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం–సవాళ్ళు–భారతదేశ అనుభవాలు''పై స్మారకోపన్యాసం చేశారు.
న్యాయమూర్తుల నియామకాలు, పదోన్నతుల్లో పారదర్శకత లోపించడం, కొలీజియం సిఫారసులను ప్రభుత్వం నిలిపివేయడం న్యాయవ్యవస్థ స్వతంత్రతపై ప్రభావం చూపుతోందన్నారు. న్యాయమూర్తుల ఎంపిక, పదోన్నతుల ప్రక్రియలో ప్రభుత్వ జోక్యానికి అవకాశం లేకుండా బహిరంగ, పారదర్శక విధానం అవసరమని అభిప్రాయపడ్డారు. భావప్రకటనా స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కు, శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కులు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారాలని అన్నారు. 2014 తరువాత తెలంగాణ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకున్న పరిణామాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యను వ్యాపారంగా మార్చే శక్తులు, కాంట్రాక్టర్లు, రాజకీయ ప్రయోజనాల ఒత్తిళ్లకు ప్రభుత్వం లొంగకూడదని అభిప్రాయపడ్డారు.
'నియోజకవర్గాల పునర్విభజన' దక్షిణ భారతానికి ముప్పు:జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, పుదుచ్చేరి వంటి దక్షిణ భారత ప్రాంతాల రాజకీయ ప్రాతినిధ్యం, అధికార సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని సిద్ధార్థ్ వరదరాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. పునర్విభజన విషయంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణ భారత రాష్ట్రాలు తమ రాజకీయ విభేదాలను పక్కనపెట్టి రాష్ట్రాల సమాన ప్రాతినిధ్యం, సమాఖ్య స్ఫూర్తి పరిరక్షణ కోసం ఒక స్పష్టమైన వైఖరి తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.
జర్నలిస్టులపై కేసులు... ప్రభుత్వ విధానాలను విమర్శించే జర్నలిస్టులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం, పోలీసు వ్యవస్థ ద్వారా వేధించడం, యుఏపిఎ,ఎన్‌ఎస్‌ఏ వంటి చట్టాల దుర్వినియోగం ఆందోళనకరమని సిద్ధార్థ్ వరదరాజన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టివివి ప్రధాన కార్యదర్శి తిప్పర్తి యాదయ్య స్వాగతోపన్యాసం చేయగా, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ ఎం. కోదండరాం, సీనియర్ జర్నలిస్టు ఉమ, టివివి మాజీ అధ్యక్షుడు గురిజాల రవీందర్ పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాల ఆశ చూపి

రూ.1.28కోట్లు వసూలు

ఫెయిర్ స్ట్రీట్‌పై కేసు
67 మంది తెలంగాణ యువతకు శిక్షణ..
ఒక్కరికే విదేశీ ఉద్యోగం
జర్మనీ పంపిస్తామని నమ్మించి నిధులు తీసుకున్నారంటూ 'టామ్‌కామ్' ఫిర్యాదు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్ : నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్న ప్రభుత్వ సంకల్పానికి, ప్రభుత్వంతోనే ఒప్పందం చేసుకున్న సంస్థ తీరుతో గండిపడింది. జర్మనీలో ఉద్యోగాలపై ఆశలు పెట్టుకుని భాషా శిక్షణ పూర్తి చేసుకున్న 67మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కరికి మాత్రమే ఉద్యోగం కల్పించి, రూ.1.28 కోట్ల నిధులు తీసుకున్న సంస్థ హామీలు నెరవేర్చలేదన్న ఆరోపణలు నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఉపాధి కల్పించాల్సిన ప్రయత్నమే యువతకు నిరాశ మిగిల్చిందన్న ఆవేదన వ్యక్తమవుతోంది. తెలంగాణ యువతకు జర్మనీతో పాటు ఇతర దేశాల్లో ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్ అవకాశాలు కల్పిస్తామంటూ ఒప్పందం చేసుకుని రూ.1.28 కోట్లు తీసుకున్న సంస్థ హామీలు నెరవేర్చలేదని ఆరోపిస్తూ హైదరాబాద్ సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు అందింది.
తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా 67 మంది అభ్యర్థుల నుంచి సేకరించిన నిధుల్లో రూ.1,28,19,000లను ఫెయిర్ స్ట్రీట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు చెల్లించగా, ఇప్పటివరకు ఒక్క అభ్యర్థికి మాత్రమే విదేశీ ఉద్యోగం కల్పించారని టామ్‌కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి ఫిర్యాదు చేశారు.
ఫిర్యాదు ప్రకారం.. విదేశీ ఉద్యోగాల కోసం తెలంగాణ యువతకు నైపుణ్య శిక్షణ, జర్మన్ భాషా బోధనతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో 2024 సెప్టెంబర్ 13న టామ్‌కామ్, ఫెయిర్‌స్ట్రీట్ సంస్థ మధ్య ఒప్పందం కుదిరింది. అభ్యర్థుల ఎంపిక, శిక్షణ, విదేశీ సంస్థల్లో ఇంటర్వ్యూల ఏర్పాటు, వీసా ప్రక్రియ, విదేశాలకు పంపించడం, అక్కడ అవసరమైన సహాయం అందించడం వంటి బాధ్యతలను ఫెయిర్‌స్ట్రీట్ తీసుకుంది. ఈ ఒప్పందం కింద మూడు విడతల్లో 67 మంది జర్మన్ భాషా శిక్షణ పూర్తి చేసుకోగా, వారిలో 42 మంది బి1 స్థాయి ధ్రువీకరణ పొందారు. అయినప్పటికీ ఒక్కరికే విదేశీ ఉద్యోగం కల్పించారని, మరో 11 మంది అభ్యర్థుల భాషా ధ్రువీకరణ గడువు కూడా ముగిసే పరిస్థితి ఏర్పడిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఫెయిర్‌స్ట్రీట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు సంస్థ ప్రతినిధులు సుధాన్షు మిశ్రా, సౌరవ్ కుమార్ పాండేలపై చర్యలు తీసుకోవాలని టామ్‌కామ్ కోరింది.

ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా...

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి
మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/రంగారెడ్డి : యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగడంతో పాటు, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్రమను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. కార్యక్రమంకు ముందు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి(సిపిఒ)పి సౌమ్య ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఎన్ఎస్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి పారిశ్రామిక రంగంలోకి అడుగుపెడుతున్న యువకులు విశాల్, సాగర్‌లను అభినందించారు.ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా,తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో పరిశ్రమను స్థాపించడం అభినందనీయమన్నారు.
తాము పారిశ్రామికవేత్తలుగా ఎదగడంతో పాటు, మరికొందరికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు రావడం ఇతర యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు. విశాల్, సాగర్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి,రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలనుకునే యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి తక్కెళ్లపల్లి రవీంద్రరావు, సిపిఓ సౌమ్య,జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జపాన్ పెట్టుబడులతో...

తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలు

జపాన్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ ఇగాయ్ యుకాతో ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి భేటీ



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : రాష్ట్రంలో జపాన్ పెట్టుబడులతో తెలంగాణ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే అవకాశాలు ఉన్నాయని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో జపాన్ పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆ దేశ సహకారం, రాష్ట్ర యువతకు జపాన్‌లో ఉద్యోగావకాశాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న జపాన్ డిప్యూటీ కాన్సుల్ జనరల్ ఇగాయ్ యుకాతో ఆయన భేటీ అయి తెలంగాణ–జపాన్ మధ్య ఆర్థిక, సాంకేతిక, విద్యా, ఉపాధి రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణలో ప్రస్తుత రాజకీయ, ఆర్థిక పరిస్థితులు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎంపి వివరించారు.
2025 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జపాన్‌లోని కిటాక్యూషు, హిరోషిమా నగరాల్లో పర్యటించిన సందర్భంగా ప్రతిపాదించిన 86 ఎకరాల విస్తీర్ణంలో హైదరాబాద్‌లో ఎకో టౌన్షిప్ అభివృద్ధి, పర్యావరణహిత అభివృద్ధికి సంబంధించి కుదిరిన గ్రీన్ కొలాబరేషన్ ఒప్పందంపై చర్చించారు. జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ ఏజెన్సీ (జైకా) ద్వారా హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించే అవకాశాలను కూడా ప్రస్తావించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి హిరోషిమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీతో విద్యా, నైపుణ్యాభివృద్ధి భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరువురు చర్చించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ (టామ్ కామ్) ద్వారా రాష్ట్ర యువతకు జపాన్‌లో ఉద్యోగావకాశాలు కల్పించే అంశానికి ప్రాధాన్యమిచ్చారు. జపాన్‌లో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన స్పెసిఫైడ్ స్కిల్ వర్కర్ (ఎస్ఎస్డబ్ల్యూ) వీసా, టెక్నికల్ ఇంటర్న్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ (టిఐటిపి), ఇతర వృత్తిపర మైన వీసాలు, నైపుణ్య పరీక్షలు, జపనీస్ భాషా అర్హతలైన జెఎల్‌పిటిబేసిక్, జేఎల్‌పీటీ ఎన్4 వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశమని ఎంపి కిరణ్ కుమార్ రెడ్డి తెలిపారు.

రక్షణ రంగంలో అగ్రగామిగా తెలంగాణ

ఎన్‌డిఇ–2026 జాతీయ
సదస్సులో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ పరిశ్రమలకు తెలంగాణను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా రూపకల్పన, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధన వంటి కీలక విభాగాలను కూడా బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఈ రంగాల్లో స్థానిక పరిశ్రమలకు అంతర్జాతీయ అవకాశాలు కల్పిస్తూ, 'మేడ్ ఇన్ తెలంగాణ'కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఆదివారం హైటెక్స్‌లో ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ అండ్ ఎనేబ్లింగ్ టెక్నాలజీస్ (ఎన్‌డిఇ–2026)' జాతీయ సదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విమానాలు, హెలికాప్టర్లు, రక్షణ పరికరాల నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడంలో నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ (ఎన్‌డిఇ) నిపుణుల పాత్ర కీలకమన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నాణ్యతా పరీక్షల విధానాల్లోనూ ఆధునిక మార్పులు రావాలని సూచించారు. కృత్రిమ మేధ, డిజిటల్ ట్విన్స్, అధునాతన తనిఖీ పద్ధతుల వినియోగం పెరగాల్సిన అవసరం ఉందన్నారు.
భవిష్యత్తులో ఎన్‌డిఇ నిపుణులకు భారీగా డిమాండ్ ఏర్పడనుందని, అందుకు అనుగుణంగా తెలంగాణ యువతను నైపుణ్యవంతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఎన్‌డిఇ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలన్న ఐఎస్ఎన్‌టి ప్రతిపాదనపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఇందుకు సంబంధించిన పూర్తి ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ఈ రంగంలో పరిశ్రమలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎస్ఎన్‌టి అధ్యక్షుడు డాక్టర్ జైతీష్ ఆర్. జోషి, ఎన్‌డిఇ–2026 చైర్మన్ సూర్య ప్రకాశ్ గజ్జల, కన్వీనర్ మోహన్ పి.నాయర్, మిధాని సిఎండి డాక్టర్ ఎన్.వి.ఎస్ నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు
జులై డిఎ వెంటనే చెల్లించాలి

ఎం. నాగేశ్వరరావు


ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగులకు 2026 జూలై నుంచి పెరగాల్సిన కరువు భత్యం (డిఎ)ను వెంటనే చెల్లించాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జనవరి జూన్ 2026 మధ్య పెరిగిన ధరల సూచీ ఆధారంగా జూలై నుంచి ఉద్యోగులకు మంజూరు చేయాల్సిన డిఎను ఇప్పటివరకు చెల్లించకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ట్రాన్స్‌కో ఉద్యోగులకు 2026 జూలై 1 నుంచి డిఎ పెంచి, బకాయిలను చెల్లించాలని అక్టోబర్ 31న ఎం.ఎస్. నంబర్ 2910 ద్వారా ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఆర్‌టిసి ఉద్యోగుల జూలై డిఎను బకాయిలతో సహా చెల్లించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని నాగేశ్వరరావు కోరారు.

పెట్టుబడులను ఆహ్వానించడం
దేశద్రోహమా? : ఎంపి మల్లు రవి

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : తెలంగాణ అభివృద్ధి కోసం విదేశీ పెట్టుబడులను ఆహ్వానిస్తూ, అంతర్జాతీయ ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం దేశద్రోహమెలా అవుతుందని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి బిజెపి నాయకులను ప్రశ్నించారు. భారత్ సమ్మిట్‌కు హాజరైన రాహుల్ గాంధీని దేశద్రోహిగా అభివర్ణించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్, గ్లోబల్ సమ్మిట్లను నిర్వహిస్తుంటే, రాజకీయ భయంతోనే బిజెపి నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. విదేశీయుల ఎదుట ధర్నాలు చేసి పెట్టుబడులను అడ్డుకోవడం ఏమిటో బిజెపి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

జస్టిస్ విఆర్.కృష్ణయ్యర్ సేవలు ఆదర్శనీయం

పేదవాడికి న్యాయం అందడమే
రాజ్యాంగ స్ఫూర్తి
న్యాయవ్యవస్థలో మానవతా దృక్పథం
అవసరం: జస్టిస్ నగేష్ భీమపాక



ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్ : పేదలు, బలహీనవర్గాలకు న్యాయం అందినప్పుడే రాజ్యాంగం కల్పించిన హక్కులకు సార్థకత చేకూరుతుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమపాక అన్నారు. పేదవాడికి న్యాయం అందించడాన్ని దేశసేవగా భావించాలని న్యాయవాదులకు సూచించారు. భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కఫ్) 85వ వ్యవస్థాపక దినోత్సవం, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, సంస్థ పూర్వ అధ్యక్షులు కీ.శే. జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ 111వ జయంతిని పురస్కరించుకుని ఇస్కఫ్ ఆధ్వర్యంలో ఆదివారం హిమాయత్‌సగర్‌లో 'భారత రాజ్యాంగం సవాళ్లు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముందుగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కృష్ణయ్యర్ చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ నగేష్ భీమపాక మాట్లాడుతూ జస్టిస్ వి.ఆర్.కృష్ణయ్యర్ న్యాయవ్యవస్థకు అందించిన సేవలు, ఆయన తీర్పులు నేటి తరానికి ఆదర్శమన్నారు. రాజ్యాంగంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం, భావప్రకటన స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, సమాన అవకాశాలు ప్రతి పౌరుడికి అందాలన్నదే న్యాయవ్యవస్థ ప్రధాన లక్ష్యమన్నారు. న్యాయం చివరి వ్యక్తి వరకు అందకపోతే చట్టాలకు అర్థం ఉండదనే భావనతో జస్టిస్ కృష్ణయ్యర్ పనిచేశారని కొనియాడారు. పేదలకు న్యాయ సహాయం అంటే నాసిరకం న్యాయం కాదన్న ఆయన మాటలను గుర్తు చేస్తూ, న్యాయవాదులు కొంత సమయాన్ని ఉచిత న్యాయసేవలకు కేటాయించాలని సూచించారు. పేదలు న్యాయం కోసం ఆస్తులు తాకట్టు పెట్టుకునే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక న్యాయం, ఆర్థిక అసమానతల నిర్మూలనలో న్యాయవ్యవస్థ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సమాచార కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగ మౌలిక స్వరూపానికి ఎదురవుతున్న అతిపెద్ద సవాల్ రాజ్యాంగ పీఠికను చదవకపోవడం, చదివినా దాని అంతరార్థాన్ని అర్థం చేసుకోకపోవడమేనన్నారు. పీఠికలోని ప్రతి పదం వెనుక గొప్ప తాత్విక ఆలోచన ఉందని, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం వంటి విలువలను సమాజం లోతుగా అర్థం చేసుకోవాలని సూచించారు. 'వి ది పీపుల్ ఆఫ్ ఇండియా' అనే పదబంధం గత, ప్రస్తుత, భవిష్యత్ తరాల ప్రజలందరినీ కలుపుకుంటుందని వివరించారు. రాజ్యాంగాన్ని కేవలం పుస్తకంగా చూడకుండా అందులోని విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టులు ఎప్పటికైనా అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. తాము ఇతర పార్టీల మాదిరిగా కుల, మత రాజకీయాలు చేయడంలేదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా దేశాన్ని, రాష్ట్రాన్ని పాలిస్తున్న పార్టీలు ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు తీసుకొచ్చాయని ప్రశ్నించారు. ఇస్కఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కడారు ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్) రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో అంతర్భాగమని, దానిని ఎవరూ తొలగించలేరని స్పష్టం చేశారు. పేదలు, అట్టడుగు వర్గాలు న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు జస్టిస్ పి.ఎన్. భగవతి, జస్టిస్ వి.ఆర్. కృష్ణయ్యర్ చేసిన కృషి చారిత్రాత్మకమన్నారు. కోర్టు ఫీజులు చెల్లించలేని, న్యాయవాదులను నియమించుకోలేని సామాన్యులు లేఖల ద్వారా తమ సమస్యలను కోర్టుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని పిఐఎల్ కల్పించిందని వివరించారు. పేదలకు బెయిల్ మంజూరు చేస్తూ భారీ నగదు పూచీకత్తు విధించడం వారి హక్కును నిరాకరించడమేనని జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. కార్యక్రమానికి ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.గోపాల్ అధ్యక్షత వహించారు.

సింగరేణి బకాయిలు చెల్లించాలి

ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షుడు వెంకటస్వామి



ప్రజాపక్షం/బెల్లంపల్లిః సింగరేణికి రావాల్సిన రూ.60 వేల కోట్ల బకాయిల చెల్లింపుపై హైకోర్టు సుమోటోగా స్పందించి ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని ఎఐటియుసి కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. ఆదివారం బెల్లంపల్లిలోని ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బకాయిలు రాక సింగరేణి ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.సాధనకు ఈ నెల 18, 19 తేదీల్లో అన్ని జిఎం కార్యాలయాల ఎదుట నిర్వహించే రిలే నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చిప్ప నరసయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, ఎఐటియుసి నాయకులు రత్నం ఐలయ్య, ఉప్పల్ శంకర్, మాచర్ల శంకర్, గాలిపెల్లి సతీష్, అన్వేష్ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



ప్రజాపక్షం/దండేపల్లిః బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. ఆదివారం దండేపల్లి మండలంలోని మేదరి పేట భారతి తీర్థ గార్డెన్స్‌లో కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, ఆసరా లేని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల మంజూరుతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు. ఎంపిడిఒ జాగర్లమూడి ప్రసాద్, సహకార సంఘం చైర్మన్ ముత్యాల శ్రీనివాస్, ఆర్జిపిఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, మండల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

లారీల కొరతతో నిలిచిన ధాన్యం



ప్రజాపక్షం/నిజాంపేట్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజాంపేట మండలం నస్కల్, నంద గోకుల్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు గడిచాయి. ఒకే లారీ లోడు పంపించడం జరిగిందని, ఇప్పటికీ కేంద్రాల్లో 100 నుండి 1500 బస్తాలు కొనుగోలు కేంద్రాల్లోనే ఉన్నాయని, బస్తాలు తరలించడానికి లారీలురాకపోవడం తో నిర్వాహకులు కొనుగోలు సైతం నిలిపివేసారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, దీంతో దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొందని, ఆరోపించారు. వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని కొనుగోలు సజావుగా నిర్వహించాలని వేడుకుంటున్నారు.


ధాన్యానికి గిట్టుబాటు ధరలేక రైతులు అయోమయం



ప్రజాపక్షం/లోకేశ్వరం ఃలోకేశ్వరం మండలంలోని ఆయా గ్రామాల రైతులతోపాటు మన్మదగ్రామంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వరి ధాన్యానికి గిట్టుబాటు ధర లేక రైతులు అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందని దళారులు గిట్టుబాటు ధర కల్పించడం లేదంటూ ధర తక్కువతో పాటు కటింగ్ చేయడం జరుగుతుందని ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా బోనస్ అందించి గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కుమ్మరి సతీష్,సురేష్ తెలిపారు.

అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



ప్రజాపక్షం/పెద్ద శంకరంపేట: పెద్ద శంకరంపేట మండలం కోలపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించుకున్న నూతన గృహాల గృహప్రవేశ వేడుకల్లో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొని, నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి నూతన గృహాలను సందర్శించారు. సొంతింటి కలను సాకారం చేసుకున్న కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియడం సంతోషకరమని పేర్కొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు..
రాష్ట్ర సర్కార్ పెద్దపీట

రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు, మెదక్ జిల్లాలో 11వేల మందికి నూతన పింఛన్లు

మంత్రి దామోదర రాజనర్సింహ



ప్రజాపక్షం/టేక్మాల్ : ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని అయన స్పష్టం చేశారు. ఆదివారం మెదక్ జిల్లా మండలం బొడ్మట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ ల మంజూరు ఉత్తర్వులను మంత్రి పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయగా, ఒక్క మెదక్ జిల్లాలోనే 11 వేల పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు కలిపి 1,400 పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ప్రతి నియోజక వర్గానికి ఏటా 3,800 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు 1,400 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 400 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. కొత్తగా మంజూరైన పింఛన్లలో రేగోడు అల్లాదుర్గ్,మండలాల్లో వితంతువులు,965 ఒంటరి మహిళలు166 , దివ్యాంగులు 195 గీత కార్మికులు 60 మంది ఉన్నారని తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎందరో మహిళలకు పింఛన్ ఆత్మగౌరవంతో జీవించే భరోసానిచ్చిందని వివరించారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జడ్పి సిఇఒ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాస రావు, మెదక్ ఇంచార్జ్ ఆర్‌డిఒ రామకృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోళ్ల విష్ణు వర్ధన్ రెడ్డి, అల్లాదుర్గ్, రేగోడు, టేగోడు మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూములు రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలి

బాచన్‌పల్లిలో రీసర్వే పరిశీలన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ఃభూముల రీసర్వే ప్రక్రియను పకడ్బంధీగా పార దర్శకంగా నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఆదివారం భీమ్‌గల్ మండలం బాచన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ రాజా గౌడ్‌తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో చేపడుతున్న రీసర్వే పనుల పురోగతిపై అడిగి తెలుసుకుని రీసర్వేలో భాగంగా భూముల సరిహద్దులను క్షేత్రస్థాయిలో పరిశీలించటం, భూవిస్తీర్ణాన్ని కొలవడం, సంబంధిత భూరికార్డులతో వివరాలను సరిపోల్చటం తదితర ప్రక్రియలను కలెక్టర్ పరిశీలించారు. రీసర్వే కోసం వినియోగిస్తున్న రోవర్ మిషన్లను మరిన్ని జిల్లాకు తెప్పిస్తున్నామని, వీటిని వినియోగిస్తూ అదనపు బృందాలను ఏర్పాటు చేసి సకాలంలో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగంచేసుకోవాలని, ఉత్తమ పని తీరు కనబర్చే సర్వేయర్లకు ప్రతినెల ప్రోత్సాహక బహుమతిగా నగదు పారితోషికాలు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎడి అశోక్, తహసీల్దార్ కిరణ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులున్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ రూరల్ఃవిద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని బిసి గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ శ్రీధర్ సూచించారు. ఆదివారం ఆసిఫాబాద్ మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన ఇటీవల జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. క్రీడలు మానసిక ఉల్లాసంతోపాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్లు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



'బిర్సా' ఆశయాల స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణం

అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ఃభగవాన్ బిర్సా ముండా జీవితం, పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని వికసిత్ భారత్ నిర్మాణం దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ పిలుపునిచ్చారు. ఆదివారం స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానం ద్వారా సందేశం అందించారు. ఆదివాసీల ఆత్మగౌరవానికి సముచిత గుర్తింపు కల్పించేందుకే బిర్సా ముండా జయంతిని జనజాతీయ గౌరవ దివస్‌గా నిర్వహిస్తున్నామని ప్రధానమంత్రి తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణలో ఆయన పోరాటం చిరస్మరణీయమని, ఆదివాసీల సంక్షేమం కోసం కేంద్ర ప్రభు త్వం అనేక పథకాలను అమ లు చేస్తోందని వివరించారు. అనంతరం పలువురు ఆదివాసీలతో మాట్లాడి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు జీవితాంతం కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే మహనీయుల జీవిత చరిత్రలు, త్యాగాలను తెలుసుకొని దేశ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. అంతకు ముందు ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్మన్ మెంగ్రే ఆకాష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్లే అనిల్ యాదవ్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమరశంఖం : ఓమయ్య

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : సంపదను సృష్టించే కార్మిక వర్గాన్ని పక్కన పెట్టి కార్పొరేట్ కంపెనీల సంక్షేమం కోసం పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటుకు ఏఐటియుసి జాతీయ మహాసభలు ఈనెల 22 నుంచి 26 వరకు బెంగళూరులో జరుగుతున్నాయని, వాటిని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్‌లోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 106 సంవత్సరాలుగా కార్మికులు పోరాడి సాధించిన 44 చట్టాల్లో 29 చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్‌లుగా నరేంద్ర మోడీ ప్రభుత్వం మార్చడాన్ని వ్యతిరేకిస్తూ ఈ మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సంపదను సృష్టించ కార్మిక వర్గాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ కంపెనీల సంక్షేమం కోసం పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై తిరుగుబాటుకు ఈ మహాసభలు దిశా నిర్దేశం చేస్తాయన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై 29 రాష్ట్రాల నాయకత్వం, ప్రపంచ కార్మిక సంస్థ ప్రతినిధులతో చర్చిస్తామన్నారు.



ప్రధాన డిమాండ్లు

దేశవ్యాప్తంగా కార్మికుల కనీస వేతనం రూ. 42 వేలు నిర్ణయించాలి,కనీస పెన్షన్ రూ. 9 వేలు అమలు చేయాలి,కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేయాలి,స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కార్మిక చట్టాలు అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లపై మహాసభలో చర్చిస్తామన్నారు,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నెల్ల, జిల్లా నాయకులు గోవర్ధన్, అనిల్, ఫెరోస్, భాగ్యలక్ష్మి, కవిత, అంజయ్య, రమేష్, రంజిత్ పాల్గొన్నారు.

సర్పంచ్‌లు ఉండగా ఇందిరమ్మ కమిటీలు దండగ!



ప్రజాపక్షం/ఆర్మూర్ ఃగ్రామప్రజలచే ప్రత్యక్షంగా ఎన్నుకోబడిన సర్పంచ్‌లు గ్రామాల్లో ఉన్నప్పుడు ప్రత్యేకంగా ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతున్నాయి. గ్రామానికి ప్రథమ పౌరుడిగా ప్రజల మద్దతుతో ఎన్నికైన సర్పంచ్‌కు గ్రామంలోని ప్రజల సమస్యలు, పేదల పరిస్థితులు, అర్హులైన లబ్ధిదారుల వివరాలపై పూర్తి అవగాహన ఉంటుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన సర్పంచ్‌లను పక్కనపెట్టి కమిటీలతో లబ్ధిదారుల ఎంపిక చేపడితే ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలగటమే కాకుండా నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుందనే సందేహాలు కూడా తలెత్తుతున్నాయి. సర్పంచ్‌లకు సముచిత గౌరవం కల్పించాలని అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచ్‌ల పాత్రకు గుర్తింపు ఎప్పుడు? అర్హులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది ? అన్నది వేచి చూడాలి.

సిపిఐ పునర్నిర్మాణానికి కార్యకర్తలు కృషి చేయాలి

ప్రజాపక్షం/ఉట్నూర్: గ్రామ శాఖలు, మండల కమిటీలను బలోపేతం చేసి నూతన జిల్లా కమిటీ నిర్మాణానికి కార్యకర్తలు కృషి చేయాలని సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్ విలాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉట్నూర్‌లో ఎస్.కె.ఫయాజ్ అధ్యక్షతన ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్ మండలాల ముఖ్య కార్యకర్తలు సమావేశం జరిగింది. డిసెంబర్ 26లోగా 2027 సభ్యత్వ నమోదు పూర్తి చేయాలన్నారు.అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిర్రా దేవేందర్, చిలక దేవిదాస్, మాడవి నగేష్, జడే నాందేవ్ పాల్గొన్నారు.



ఐక్యంగా ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాటాలు

రాష్ట్ర కన్వీనర్ తోపునూరు చక్రపాణి




ప్రజాపక్షం/ఆదిలాబాద్: ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్లు, ఆయాలు ఐక్యంగా ఉంటూ సమస్యలు పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఏఐటీయూసీ అనుబంద తెలంగాణ రాష్ట్ర ప్రీ ప్రైమరీ స్కూల్ టీచర్లు, ఆయాలు యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తోపునూరు చక్రపాణి పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రే ఐశ్వర్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ప్రీ ప్రైమరీ టీచర్లు, ఆయాలకు నెలకు కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అదనపు పని భారాన్ని తగ్గించాలని కోరారు. నియామకపు ఆర్డర్ కాపీలు అందని వారికి తక్షణమే ఆర్డర్ కాపీలు జారీ చేయాలని, ప్రతి ఒక్కరికీ పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా వేతనాలను నేరుగా ప్రీ ప్రైమరీ టీచర్లు, ఆయాల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్న 12.30 గంటల వరకు పనివేలలకు గౌరవ వేతనం 8000 ప్రకటించాలరని, సాయంత్రం 4.15 గంటల వరకు పనిచేస్తున్నామని అన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు కల్లేపల్లి గంగయ్య, స హాయ కార్యదర్శి అడ్వకేట్ తెలంగ్ అజయ్ కుమార్ కోశాధికారి ప్రియాంక, టీచర్లు, ఆయలు పాల్గొన్నారు.

నీటి కోసం తొవ్వారు.. మరమ్మతులు మరిచారు!

ప్రమాదాలకు నిలయంగా మారిన వీధులు

ప్రజాపక్షం/ఖానాపూర్ ఃప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన మిషన్ భగీరథ, అమృత్ 2.0 పనులు ఖానాపూర్ పట్టణంలోని పలు కా లనీవాసులకు కొత్త కష్టాలను తెచ్చిపెట్టాయి. నీటి పైపులైన్ల కోసం రహదారులను తవ్వి ప నులు పూర్తి చేసిన అధికారులు, తిరిగి వాటికి మరమ్మతులు చేయడం మరిచిపోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అం తర్గత వీధులు సైతం దెబ్బతిని, వాహనదారులు, పాదచారులకు ప్రమాదకరంగా మారా యి.విద్యానగర్, శాంతినగర్, పద్మావతినగర్, శ్రీరామ్‌నగర్, సుభాష్‌నగర్, ఇంద్రానగర్ తదితర కాలనీల్లో నీటి పైపులైన్ల కోసం సీసీ రోడ్లను అడ్డంగా తవ్వి పనులు చేపట్టారు. పైపుల ఏర్పాటు పూర్తయిన తర్వాత రహదారులను పూర్వస్థితికి తీసుకురావాల్సి ఉన్నప్పటికీ, పలు చోట్ల తవ్విన గోతులను అలాగే వదిలేయడంతో రోడ్లు ఛిద్రమయ్యాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి పడిపోతుండగా, ఆటోలు, కార్లు వెళ్లేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రహదారుల దుస్థితి నిత్యం రాకపోకలు సాగించే ప్రజలకు శాపంగా మారింది. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వారిని తీసుకెళ్లే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సి వస్తోంది. ఉద్యోగులు విధులకు వెళ్లేందుకు,మహిళలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు బయటకు రావాలన్నా అవస్థలు తప్పడం లేదు. అత్యవసర సమయాల్లో వాహనాలు కాలనీల్లోకి చేరడం కూడా కష్టంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోందని కాలనీవాసులు చెబుతున్నారు. దెబ్బతిన్న రోడ్లపై వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతున్నాయని, కొన్ని ప్రాంతాల్లో పగిలిన పైపుల నుంచి మిషన్ భగీరథ నీరు బయటకు పొంగి రహదారులపై ప్రవహించడంతో కాలనీల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని వాపోతున్నారు. ఒకవైపు రోడ్ల గోతులు, మరోవైపు నీటి లీకేజీలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రాణనష్టం సంభవించకముందే అధికారులు స్పందించి కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



నీటి పొదుపు మాటలకే పరిమితం!

వృథాగా పోతున్న నీరు



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించాలని ప్రభుత్వం పదేపదే సూచిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణకు నోచుకోవడం లేదు.దిలావర్‌పూర్ గ్రామంలోని పశువుల తొట్టి వద్ద నీరు వృథాగా పోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి పశువుల తొట్టి వద్ద గ్రామంలోని మినీ వాటర్ ట్యాంకుల వద్ద నీటి వృథాను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి: కలెక్టర్ గరిమా అగ్రవాల్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల: బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 16న సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. పిల్లల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమీషన్ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ఈనెల 16వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో సాధారణ ప్రజావాణితోపాటు ప్రత్యేకంగా బాలల ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ బాలల ప్రజావాణిలో బాలలకు సంబంధించిన విద్య, ఆరోగ్యం, పోషకాహారం, బాలల హక్కుల పరిరక్షణ, బాలల భద్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, అనాథ, సంరక్షణ అవసరమైన బాలల సమస్యలు, బాలల అభివృద్ధి తదితర అంశాలపై ఫిర్యాదులు, వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు. అలాగే బాలలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. బాలల సంక్షేమం కోసం పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాలలహక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వ్యక్తులు కూడా తమ పరిధిలోని బాలల సమస్యలను ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. బాలలకు మెరుగైన భవిష్యత్‌ను అందించడంతోపాటు వారి హక్కులను కాపాడి సమస్యలకు పరిష్కారం చూపడమే బాలల ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.

రైతు కొనుగోలు కేంద్రాల్లోనే పంటను విక్రయించాలి



ప్రజాపక్షం/గన్నేరువరం: రైతులు తాము పండించిన పంటను తీసుకొచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఎట్టిపరిస్థితుల్లో దళారులను నమ్మి మోసపోవద్దని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మాతంగి శిరీష అనిల్ అన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలమేరకు హకా ఆధ్వర్యంలో గన్నేరువరం, పారువెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచ్ యాళ్ల లక్ష్మీ తో కలిసి చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం వరి ధాన్యంకు మద్ధతు ధర రూ.2461 ఉందని, సన్న రకానికి రూ.2461 అదనంగా 500 ప్రభుత్వం బోనస్ వస్తుందని రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యంను విక్రయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నేరువరం మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కటకం తిరుపతి, సర్పంచ్ రంగనవేణి లచ్చిరస్సు, అలువాల కోటి, కొమ్మెర రవీందర్ రెడ్డి, మాదాపూర్ సర్పంచ్ మాదరి శ్రీనివాస్, నందికొండ అంజిరెడ్డి, రంగనవేణి సతీష్, దుర్మట్ల శ్రీనివాస్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, లింగంపల్లి ప్రశాంత్, దేశరాజు అనిల్, పాకాల పర్శరాములు, మైసంపల్లి తిరుపతి, చాకలివానిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కూన చంద్రశేఖర్, వెదిర విజేందర్, రాపోలు నవీన్, అనిల్, బుర్ర మల్లేశం గౌడ్, ముడికే అజయ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలకు నిప్పు.. మట్టిలో మసి అవుతున్న భూసారం!



ప్రజాపక్షం/ముత్తారం : వరి కోతలు పూర్తయిన వెంటనే పొలాల్లో మిగిలిన కొయ్యకాళ్లను కాల్చవద్దని వ్యవసాయ అధికారులు ఎంతగా మొత్తుకుంటున్నా రైతుల్లో మార్పు రావడం లేదు.అధికారుల సూచనలను పెడచెవిన పెడుతూ యథేచ్ఛగా వరి పొలాలకు నిప్పు పెడుతున్నారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న ఏ గ్రామంలో చూసినప్పటికీ పంట కోతలు పూర్తి కాగానే తదుపరి పంటకు భూమిని సిద్ధం చేసుకునే క్రమంలో రైతులు సులభమైన మార్గంగా కొయ్యకాళ్లను తగలబెడుతున్నారు. ఇలా చేయడం వల్ల నేలలో ఉండే సూక్ష్మ జీవులు నశించి,భూసారం పూర్తిగా దెబ్బతింటుందని మండల వ్యవసాయ అధికారి అనూష, వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు పలుమార్లు అవగాహన కల్పించారు.అయినప్పటికీ కొందరు రైతులు అధికారుల మాటలను లెక్కచేయకుండా పొలాలకు నిప్పు పెడుతుండటం గమనార్హం. ఈ మంటల వల్ల భూమి సారం కోల్పోవడమే కాకుండా,పర్యావరణ కాలుష్యం పెరిగి పక్క పొలాలకు కూడా ప్రమాదం పొంచి ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అన్నదాతలు స్పందించి కొయ్యకాళ్లను కాల్చడం మానుకోవాలని,వాటిని భూమిలోనే కలియదున్ని సేంద్రియ ఎరువుగా మార్చుకోవాలని వ్యవసాయ శాఖ కోరుతోంది.

తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్న బిజెపి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : బిజెపి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అడ్డుపడుతున్నారని తెలంగాణకు వచ్చే పెట్టుబడులను కంపెనీలను యువతకు ఉద్యోగ అవకాశాలు రాకుండా చేస్తున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు ఆరోపించారు. ఆదివారం సిరిసిల్ల పట్టణ కేంద్రంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శనివారం చేపట్టిన నిరసనను ఖండిస్తూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. విదేశీ ప్రతినిధులకు కేంద్ర ప్రభుత్వం చివరి నిమిషంలో వీసాల అనుమతి నిరాకరించిందని మండిపడ్డారు. బిజెపి నేతలు నియంతలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించే గొంతులను చూసి భయపడుతున్నారని విమర్శించారు. వారిని తెలంగాణ ప్రజానీకం క్షమించబోరని అన్నారు. రాహుల్ గాంధీ హోదాపై వివరణ రాహుల్ గాంధీ కేవలం కాంగ్రెస్ నేత మాత్రమే కాదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలరాజు, నరసయ్య, రాగుల జగన్, షెక్ రియాజ్, దేవయ్య, రమాదేవి, గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, రాములు, కంసాల మల్లేశం, పత్తిపాక లక్ష్మీ రాజ్యం, బైరి ప్రభాకర్, రమేశ్ పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు

జగిత్యాల జిల్లాలో 13,913 మందికి నూతన చేయూత సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు
మిగిలిన అర్హుల దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు
మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రజాపక్షం/జగిత్యాల: ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.జగిత్యాల జిల్లాలో వివిధ కేటగిరీలకు చెందిన 13,913 మంది లబ్ధిదారులకు నూతన చేయూత సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.ఆదివారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కొత్త పింఛన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి మంత్రి లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూతెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల్లో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నామని వివరించారు. అదనంగా అర్హులైన వారికి మరో 2,000 ఇళ్లు మంజూరు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.జిల్లాలో నూతన పింఛన్ల కోసం సుమారు 18,955 దరఖాస్తులు అందగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశీలించి 13,913 మందిని అర్హులుగా గుర్తించి పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రతకు పెద్దపీట వేస్తూ కొత్తగా పింఛన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు.ఒంటరి మహిళలు,భర్తను కోల్పోయిన మహిళలు,దివ్యాంగులు,గీత కార్మికులు, చేనేత కార్మికులకు ఈ పింఛన్లు ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో కొత్తగా పింఛన్లు పొందుతున్న 13,913 మంది లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం అందించే వాటా పరిమితంగా ఉండగా, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితర వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వమే పింఛన్ మొత్తాన్ని భరిస్తోందని వివరించారు. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో ప్రస్తుతం వివిధ కేటగిరీలకు చెందిన సుమారు 2.13 లక్షల మంది లబ్ధిదారులకు ప్రతి నెలా సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించిందని,మండల స్థాయి,జిల్లా స్థాయి అధికారుల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించి అర్హులను గుర్తించినట్లు వివరించారు.ఇంకా అర్హత ఉండి దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, దరఖాస్తులు సమర్పించినప్పటికీ పరిశీలనలో మిగిలిపోయిన వారు ప్రత్యేక కౌంటర్లలో తమ వివరాలు సమర్పించాలని సూచించారు. అందిన దరఖాస్తులను మరోసారి పరిశీలించి, వారం నుంచి రెండు వారాల్లోగా అర్హతలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, డీఆర్‌డీఏ అధికారులు,వివిధ శాఖల అధికారులు,సర్పంచ్ లు, కౌన్సిలర్ లు,నూతన పింఛన్ల లబ్ధిదారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు



ప్రజాపక్షం/సిద్దిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వంమని ,కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా మీసం నాగరాజు యాదవ్ హెల్త్ మినిస్టర్ దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. సిద్దిపేటలో త్వరలో జరిగే సిఎం సభలో కాంగ్రెస్ ప్రభుత్వం మరికొన్ని కొత్త పథకాన్ని ప్రవేశపెడుతారన్నారు. ఈ కార్యక్రమంలో కిషన్, రామకృష్ణ, రాజు, గణేష్, అశోక్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
అభివృద్ధి పనులపై సమీక్ష, క్షేత్రస్థాయిలో పరిశీలించిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజా పక్షం/వేములవాడ : వేములవాడ (శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది (శ్రీనివాస్ ఆదేశించారు. వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీపీడీఏ) ఆధ్వర్యంలో (శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులపై భీమేశ్వర స్వామి ఆలయ గెస్ట్ హౌస్ లో శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది (శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఆర్ అండ్ బీ సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారుతో కలిసి .. సమీక్ష సమావేశం నిర్వహించి.. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై ఆరా తీశారు. అనంతరం రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బీ సీఈ, ఆర్కిటెక్ట్, ధార్మిక సలహాదారు, స్థపతులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది (శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి.. పూర్తి చేస్తూ ముందుకు వెళ్లాలని ఆదేశించారు. పనులకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను మరింత పెంచాలని సూచించారు. ప్రణాళిక ప్రకారం అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, స్థపతులు జయేంద్రన్, గణేష్, స్ట్రక్చర్ ఇంజనీర్ (శేధర్ రెడ్డి, తహసీల్దార్ జయంత్ తదితరులు ఉన్నారు.

కొండగట్టు అంజన్న నిజరూప దర్శనానికి
60 ఏళ్ల ఆనవాయితీగా చందనోత్సవం

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేతుల మీదుగా అంకురార్పణ





ప్రజాపక్షం/మల్యాల:జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ ప్రకారం స్వామివారి నిజరూప దర్శన మహోత్సవానికి ఆదివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించే చందనోత్సవ కార్యక్రమాన్ని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ అధికారులు, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా కొనసాగుతున్న ఈ మహత్తర సంప్రదాయాన్ని భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాటించాలని కోరారు. స్వామివారి మూల విరాట్టుకు అలంకరించిన చందనాన్ని తొలగించే కార్యక్రమం నవంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 29వ తేదీ వరకు భక్తులకు స్వామివారి నిజరూప దర్శన భాగ్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దాదాపు ఆరు దశాబ్దాల ఆనవాయితీగా వస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రతి ఒక్క భక్తుడు సద్వినియోగం చేసుకోవాలని, రాజీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, భక్తులు, ప్రజలందరూ ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కొండగట్టు అంజన్న స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. అంజనా రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు, ఇతర అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేని ఫ్లెక్సీలతో
మున్సిపల్ ఆదాయానికి గండి

సిపిఐ నేత పైడిపల్లి రాజు



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : కరీంనగర్ నగరంలో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా ప్రధాన కూడళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాల వద్ద విచ్చలవిడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతుందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాజు విమర్శించారు. నాయకులు, వ్యాపారవేత్తలు, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తూ నాయకులు విగ్రహాలు, ట్రాఫిక్ సిగ్నళ్లను సైతం కనిపించకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గాలివానల సమయంలో ప్రమాదాలు జరిగి పలువురు గాయాలపాలవుతున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం వల్ల మున్సిపల్ ఆదాయానికి లక్షల రూపాయల నష్టం వాటిల్లుతోందని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంటనే ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి అక్రమ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్: ఆరోగ్యమే మహా భాగ్యమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గీత విద్యాలయం పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జగిత్యాల శాసనసభ్యులు సంజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈరోజుల్లో ఆరోగ్యమే మహా భాగ్యం అని ఆరోగ్య పరీక్షల ద్వారా రోగ నిర్ధారణ అవుతుందని అన్నారు. రోగం వచ్చాక చికిత్స కన్నా రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి అవకాశం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం కల్పిస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు జుంబర్తి రాజ్ కుమార్, ప్రశాంత్ రావు టీపాస్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ రావు, రాజేష్ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, డా.రమేష్ , మోర హన్మండ్లు, తదితరులు ఉన్నారు.


సిద్దిపేటలో 19న సిఎం ర్యాలీ, బహిరంగ సభ



ప్రజాపక్షం/సిద్దిపేట : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 19న సిద్దిపేటలో జరిగే సభలో ప్రారంభించనున్నారని, ఈ పథకం మూలంగా ప్రతి కుటుంబానికి బీమా భరోసా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. 19న సీఎం రేవంత్ రెడ్డి హెలికాప్టర్ ద్వారా కలెక్టరేట్ కు చేరుకుంటారని, అక్కడినుండి కాన్వాయ్ ద్వారా బీజేర్ చౌరస్తాకు చేరుకొని, అక్కడినుండి కొత్త బస్టాండ్, పాత బస్టాండ్, విక్టరీ టాకీస్ చౌరస్తా, ముస్తాబాద్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి, ఇందిరా గాంధీ చౌరస్తా నుండి సభా ప్రాంగణం వరకు ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులతో నడుచుకుంటూ వస్తారని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అధికారులు సభా స్థలం వద్ద ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, శ్రేణులు సీఎం సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కంకణ బద్ధులై పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్లం యాదవ్, గంప మహేందర్, కలీముద్దీన్, రాజ్ బహుదూర్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి, చెంది శ్రీనివాస్, పంశీ, మహేందర్, అంజయ్య, ససితీష్, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

మనసంతా మా ఊరి సంత!

ప్రజాపక్షం / గంగాధర: ఒకప్పుడు ఊరికి వెళ్తే సంతే కళ. రైతులు పండించిన కూరగాయలు, చేతి వృత్తుల వారి సామాన్లు, పాడి, పశువులు అన్నీ ఒకే చోట కనిపించి వేసేవి. అలాంటి పల్లె సంస్కృతికి ప్రతీక అయిన సంతకు మళ్లీ పూర్వ వైభవం తీసుకొస్తున్నారు బూరుగుపల్లివాసులు. గంగాధర మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో జరుగుతున్న వారాంతపు సంత (అంగడి)కి విశేష ఆదరణ లభిస్తోంది. ప్రతి ఆదివారం నిర్వహించే ఈ సంత ఇప్పుడు మండలంలోనే రెండవ పెద్ద సంతగా మారింది. సంత అంటేనే రైతు, వినియోగదారునికి ప్రత్యక్ష వేదిక. దళారుల ప్రమేయం లేకుండా రైతు తన పంటను అమ్ముకునే అవకాశం, ప్రజలకు తాజా కూరగాయలు తక్కువ ధరకు లభించడం ఇక్కడి ప్రత్యేకత. బూరుగుపల్లి గ్రామానికి చుట్టుపక్కల ఎక్కువ పల్లెలు ఉండడంతో రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను విక్రయించి ఉపాధి పొందుతున్నారు. ఈ సంత విజయవంతం కావడంతో ఇప్పుడు కొత్తగా గురువారం కూడా ప్రత్యేకంగా పశువుల సంతను ఏర్పాటు చేశారు. ఆదివారం కూరగాయలు, నిత్యావసరాల సంత అయితే గురువారం పూర్తిగా పశువుల సంతగా నిర్వహిస్తున్నారు. ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెల కొనుగోలు, అమ్మకాలతో గురువారం సంత కూడా కిటకిటలాడుతుంది. చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా ఇతర మండలాల నుంచి కూడా రైతులు, వ్యాపారులు తరలివస్తున్నారు. అటు జిల్లాలోనే అతి పెద్ద సంతగా పేరున్న మండల కేంద్రమైన గంగాధరలో ప్రతి శనివారం నిర్వహించే వారంతపు సంతకు కూడా మంచి ఆదరణ ఉంది. అయితే బూరుగుపల్లిలో ఆదివారం గురువారం నిర్వహించే ఈ రెండు సంతల నిర్వహణ వెనుక సర్పంచ్ దూలం కళ్యాణ్ ఆలోచన, కృషి ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఒక ప్పుడు సంత అంటే కేవలం వారానికి ఒకసారి మాత్రమే కానీ రైతులకు మరింత మేలు చేయాలనే ఉద్దేశంతో వారంలో రెండుసార్లు సంత నిర్వహిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. దీంతో గ్రామ ఆర్థిక వ్యవస్థ బలపడుతోందని స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అన్నారు. సంతకు వచ్చే రైతులు తాము పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు నేరుగా విక్రయించడం వల్ల మంచి ధర లభిస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు కూడా తాజా సరుకులు తక్కువ ధరకే లభిస్తున్నాయి. పశువుల సంత ఏర్పాటుతో రైతులు తమ అవసరాలకు తగ్గ పశువులను కొనుగోలు చేసేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సంత వద్ద తాగునీరు, నీడ, పార్కింగ్ వంటి మౌళిక వసతులు కల్పించడం వల్ల సంతకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పేరుగుతోంది.





రాజిరెడ్డి, రైతు నందగిరి గ్రామం: బూరుగుపల్లి సంత వల్ల మాకు చాలా లాభం జరుగుతోంది. మేము పొలంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు నేరుగా సంతలో అమ్ముకుంటున్నాం. నేను ప్రతి ఆదివారం సంతకు కూరగాయల ఇక్కడైతే మోసం ఉండదు. తాజా సరుకును ప్రజలే నేరుగా వచ్చి కొంటారు. దళారులు లేరు, మంచి ధర వస్తోంది. గురువారం పశువుల సంత పెట్టడం వల్ల ఎద్దులు, ఆవులు, మేకలు, గొర్లను కొనడానికి దూరం వెళ్లాల్సిన పనిలేదు.

సంతకు వచ్చే ప్రజలకు అన్ని వసతులు కల్పిస్తున్నాం దూలం కళ్యాణ్, సర్పంచ్,బూరుగుపల్లి: మా బూరుగుపల్లి సంతకు మంచి ఆదరణ వస్తోంది. రైతులు పండించిన పంటను నేరుగా అమ్ముకోవాలని ప్రజలకు తక్కువ ధరకు తాజా కూరగాయలు అందాలని ఆదివారం సంతను బలోపేతం చేశాం. రైతుల కోరికమేరకు కొత్తగా గురువారం పశువుల సంత కూడా ప

నూతన ఎసిబి కార్యాలయం ప్రారంభం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నూతనంగా ఏర్పాటు చేసిన ఎసిబి కార్యాలయాన్ని ఎసిబి (అవినీతి నిరోధక శాఖ) డిఎస్పి రమేష్ ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎసిబి కార్యాలయం ఖమ్మంలోని వీడియోస్ కాలనీ నుండి పాత మున్సిపల్ కార్యాలయంలోకి నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పి రమేష్ మాట్లాడుతూ ఎసిబి పట్ల ప్రజలకు విస్తృత ప్రచారం కల్పిస్తున్నామని, ప్రభుత్వ కార్యాలయాల్లో అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెం. 1064కు అందించాలని సూచించారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని అవినీతి, అక్రమాలను అరికట్టడంలో ప్రజలు సహకరించాలని డిఎస్పి కోరారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్‌బాబా



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి ఖాదర్‌బాబా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయానికి విశిష్ట సేవలు అందిస్తూ నిరంతరం పుస్తక పఠనాన్ని కొనసాగిస్తున్న సీనియర్ సిటిజన్ పాఠకులను చైర్మన్ ఖాదర్‌బాబా ఘనంగా సన్మానించారు. అనంతరం పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు బుక్ రీడింగ్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు పుస్తకాల ప్రాధాన్యత, రచయితల ఆలోచనలు, విజ్ఞానాభివృద్ధిపై బుక్ టాక్ సెషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పుస్తక పఠనాన్ని తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్ 1 లైబ్రెరియన్ సి. మల్సూర్, గ్రేడ్ 3 లైబ్రెరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ టి. సంతోష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలతో విజ్ఞాన వికాసం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వీరబాబు



ప్రజాపక్షం/ భద్రాద్రికొత్తగూడెం : పుస్త పఠనంతో విజ్ఞాన వికాసం చేకూరుతుందని తద్వారా పోటీ పరీక్షల్లో విజయానికి పునాది అవుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పుసపులేటి వీరబాబు అన్నారు. గ్రంథాలయ 59వ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం గ్రంథాలయంలో పుస్తకప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషి జీవితంలో ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. పుస్తకాలు చదవడం వల్ల జ్ఞానం అవగాహన జ్ఞాపకశక్తి పెరుగుతాయని. మెదడుకు మంచి వ్యాయామం అని తెలిపారు. 'చిరిగిన చొక్కా అయినా వేసుకో మంచి పుస్తకాన్ని కొనుక్కో' అనే సూక్తిని గుర్తు చేస్తూ జిల్లా గ్రంథాలయంలో వేలాది రూపాయల పుస్తకాలను కొనుగోలు చేసి పాఠకులకు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యదర్శి కరుణకుమారి మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి, ఆలోచన జ్ఞాపకశక్తి పెంపొందించేందుకు పుస్తకాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. విద్యార్థులు తమ ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని పుస్తకాలు చదువుకుని విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ 2 గ్రంథపాలకులు ఎస్. లలితకుమారి, జి. మణిమృదుల, మధుబాబు, వాణి, గీత, ఉపాధ్యాయురాలు కోమల ప్రియాంక, సైదులు, విజయ్, పాఠకులు, పుస్తక అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా కాపు వన సమారాధన



ప్రజాపక్షం/ ఖమ్మం : కార్తీక మాసోత్సవాన్ని పురస్కరించుకుని కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన భోజన కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి కాపు సంఘ ప్రముఖులు హాజరయ్యారు. జోగు రామన్న, వి. హన్మంతరావు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వద్దిరాజు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో కాపులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కాపుల సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సంగీత, కళారూపాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కాపు కుల పెద్దలతో పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శీలంశెట్టి వీరభద్రం, పారా నాగేశ్వరరావు, ఆకుల గాంధీ, తోట రామారావు, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/అశ్వపల్లి: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి రూ. 5లక్షల ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు ఎంపిడిఒ శ్రీనివాస్ తెలిపారు. కుటుంబంలో సంపాదించే 18, 59 ఏళ్ల వయస్సున్న ఒక వ్యక్తిని బీమాకు ఎంపిక చేస్తారని, వయస్సు నిర్ధారణకు ఆధార్‌లోని పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకుంటారని వివరించారు. గ్రామస్థాయిలో ప్రత్యేక శిబిరాల ద్వారా ఆధార్, మొబైల్ నంబర్, కుటుంబ, నామినీ వివరాలు నమోదు చేస్తారని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నిబంధనల ప్రకారం నామినీకి రూ. 5లక్షల పరిహారం అందుతుందని పేర్కొన్నారు. అర్హులైన కుటుంబాలన్నీ నమోదు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పత్తి కుప్పకు నిప్ప



ప్రజాపక్షం/బోనకల్: మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తి నిల్వలకు నిప్పు టించడంతో సుమారు 10 క్వింటాళ్ల పత్తి కాలిపోయింది. గ్రామానికి చెందిన కౌలు రైతు తన్నీరు వెంకయ్యకు చెందిన 70 క్వింటాళ్ల పత్తి నిల్వలకు శనివారం మధ్యాహ్నం నిప్పంటించారు. మంటలను గమనించిన ఇంటి యాజమానురాలు చుట్టు పక్కల వారిని అప్రమత్తం చేయడంతో గ్రామ యువత, రైతులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేశారు. దీంతో మిగిలిన పత్తి నిల్వలు కాపాడగలిగారు. సంఘటన స్థలాన్ని స్థానిక పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తికి రిమాండ్

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మున్సిపాలిటీలోనే ఖాన్‌ఖాన్ పేటలో ఒక ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సిఐ సర్వయ్య, కల్లూరు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలు ప్రకారం... ఖాన్ ఖాన్ పేట శివారులో ఒక ఇంట్లో జొరబడి చోరీకి పాల్పడిన వ్యక్తిని కల్లూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అతని వద్ద నుండి రూ.1.20లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, నేరానికి ఉపయోగించిన నెంబర్ లేని బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ దొంగతనాన్ని ఛేదించిన పోలీస్ సిబ్బంది రంగారావు, శ్రీనివాసరావు, నరసింహారావు లను సిఐ, ఎస్ఐలు అభినందించారు.

ప్రజల గుమ్మాలకే సంక్షేమ పథకాలు

చేయూత మంజూరు పత్రాల పంపిణీలో మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని ప్రజల గడప వద్దకే చేర్చాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి కొత్తగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు మంత్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో భర్తలను కోల్పోయి ఏళ్ల తరబడి ఆసరా పింఛన్ల కోసం ఎదురు చూసిన మహిళలకు అప్పటి ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయలేదని, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూత పింఛన్లు అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో ఎవరిని అడిగినా ప్రజా ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తోందని చెబుతున్నారని పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా ప్రతి నిరుపేదల కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ పేదలకు ఇళ్ల నిర్మాణంపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి విడతలో 4.5లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లతో పాటు హైదారాబాద్ నగరంలో మరో లక్ష ఇళ్లు కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టిందని వివరించారు. దాదాపు రూ.45వేల కోట్ల వ్యయంతో పేదింటి ఆడ బిడ్డలకు సొంతింటి కలను నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత నిస్తూ తిరుమలాయపాలెం మండలంలో సుమారు రూ.26కోట్లతో 100 పడకల ఆసుపత్రిని, రూ.46కోట్లతో ఐటిఐ కళాశాలను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మండలంలో అభివృద్ధి మౌలిక వసతుల కల్పనలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు ఇళ్ల మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలను తొలగించి మార్పు చేసేందుకు సుమారు రూ.10కోట్ల నిధులతో విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు చేపట్టినట్లు వివరించారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఎక్కడా విఘాతం కలగకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ పిఐ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఒ ఎన్.శ్రీనివాస్, తిరుమలాయపాలెం ఎంపిడిఒ సిలార్‌సాహెబ్, తహసీల్దార్ లూథర్ విల్సన్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి, పాలేరు డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొప్పుల అశోక్, స్థానిక సర్పంచ్ దేవ భిక్షం, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధు, గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఒబి కార్మికుల నిరసన దీక్షకు

సత్తుపల్లి ఓబీ ఆపరేటర్ల మద్దతు

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే కోల్‌బెల్ట్ వ్యాప్తంగా ఆందోళనలు

అమర్లపూడి శరత్



ప్రజాపక్షం/సత్తుపల్లి : కొత్తగూడెం శోదా ఓబీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరసన దీక్షకు సత్తుపల్లి సింగరేణి ఓబీ ఆపరేటర్ల సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (టియుసిఐ) ఓబీ ఆపరేటర్ల కమిటీ సమావేశం వెంకట్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ కొత్తగూడెం రీజియన్ అధ్యక్షుడు అమర్లపూడి శరత్ మాట్లాడుతూ, కార్మికులకు 20 శాతం బోనస్, ఆదివారం విధులకు డబుల్ మస్టర్, నైట్ షిఫ్ట్ అలవెన్స్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పలుమార్లు యాజమాన్యం, సింగరేణి అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో కార్మికులు ఐదు రోజులుగా నిరసన దీక్ష చేపట్టారని తెలిపారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో టియుసిఐ ఆధ్వర్యంలో కోల్‌బెల్ట్ పరిధిలోని ఓబీ ప్రాజెక్టులన్నింటిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రవి, వెంకట్, కృష్ణ, బాజీ, మురళి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

మధిరకు హైటెక్ బస్టాండ్



ప్రజాపక్షం/మధిర: రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన 13 ప్రాంతాల్లో కొత్త బస్ టెర్మినళ్లను పూర్తిగా కార్పొరేట్ లుక్‌లో, హైటెక్ హంగులతో నిర్మించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిర బస్‌స్టేషన్‌తో పాటు కొత్తగూడెం బస్టాండ్‌ను హైటెక్ బస్టాండ్‌గా ఆధునీకరించేందుకు ఆర్టిసి సంస్థ సిద్ధమైంది ఈ వార్తతో మధిర ప్రజల్లో హర్షం వ్యక్తమవుతుంది. నూతనంగా నిర్మించే ఈ బస్‌స్టేషన్ల నుంచి బస్సు దిగగానే రైల్వేస్టేషన్లు, ఇతర రవాణా మార్గాలను సులభంగా చేరుకునేలా అనుసంధా నం ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు వేచి ఉండే సమయంలో ఆహ్లాదాన్ని పంచేందుకు ఫుడ్‌కోర్టులు, గేమింగ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లను అం దుబాటులోకి తెస్తున్నారు. ఈ నూతన హైటెక్ బస్టాండ్‌లో షాపులు, బిజినెస్ కాంప్లెక్స్‌ల కేటాయింపు కోసం ఆసక్తి ఉన్న వ్యాపారులు నేరుగా ఆర్టిసి యాజమాన్యాన్ని సంప్రదించవచ్చని సంస్థ ప్రకటించిం ది. హైటెక్ టెర్మినళ్లతో పాటు, రాష్ట్రంలో రోజుకు 5వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే 85 రద్దీ బస్ స్టేషన్లను ఆర్టిసి గుర్తించింది. వీటన్నింటినీ ఆధునిక సదుపాయాలతో మోడల్ బస్‌స్టేషన్లుగా తీర్చిదిద్దనున్నారు. ప్రయాణికులకు స్పష్టమైన సమాచారం అందించడం, స్టేషన్లలో నిరంతరం పర్యవేక్షణ, విచారణ విభాగాలను బలోపేతం చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

టిజివిఎస్ఎన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నరేష్



ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం: కాంగ్రెస్ పార్టీ అభయహస్తం మేనిఫెస్టోలో గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నరేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు శిక్షణ, జిఒ 428 తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అనంతరం రద్దయిన ఆ జిఒను పునరుద్ధరించి, గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియను తిరిగి ప్రారంభించాలని నిర్ణయించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం సరికాదన్నారు. గ్రామీణ వైద్యులకు చట్టబద్ధత కల్పించాలని, ఆర్ఎంపిలపై జరుగుతున్న వేధింపులు, అక్రమ కేసులు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. గ్రామీణ వైద్యుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాన్ని రూపొందించి, ప్రభుత్వంతో చర్చలు ప్రారంభించాలని, ప్రజలకు ప్రాథమిక వైద్యసేవలు అందిస్తున్న గ్రామీణ వైద్యులకు ఆరోగ్య వ్యవస్థ తగిన స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నవరపు నాగేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వీరభద్రం, జిల్లా అధ్యక్షుడు మర్రి నరేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చాపలమడుగు నాగేశ్వరరావు, జిల్లా న్యాయసలహాదారు కాకాటి కరుణాకర్, సాంస్కృతిక జిల్లా అధ్యక్షుడు తుప్పాతి శ్రీనివాస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మారుతి సంపత్, సురేష, మాతంగి రామ్‌కిరణ్, ప్రధాన కార్యదర్శి బుట్టం పంశీ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి: ఎఐటియుసి



ప్రజాపక్షం/సత్తుపల్లి: సీజన్ హమాలీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఎఐటియుసి ఖమ్మం జిల్లా డివ్యూటీ జనరల్ సెక్రటరీ నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని తుమ్మూరు, సదాశివునిపాలెం, కిష్టాపురం, గంగారం తదితర గ్రామాలలో ఎఐటియుసి నాయకులు పర్యటించి, హమాలీలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా నిమ్మటూరి రామకృష్ణ మాట్లాడుతూ పని సమయంలో ప్రమాదాలకు గురవుతున్న హమాలీల కుటుంబాలకు ప్రభుత్వ భరోసా కల్పించాలని కోరారు. అలాగే పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నారావు, రాము, శ్రీనివాసరావు, అప్పారావు, వెంకటేశ్వరరావు, నబి, పుల్లయ్య, నాగేశ్వరరావు, ప్రసాద్, ఏసుబాబు, తిరుమలరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం: గుగులోతు కృష్ణ



ప్రజాపక్షం/సత్తుపలి: లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో 29న జనగామ జిల్లా కేంద్రంలోని విజయ మినీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణ నాయక్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ధర్మసోత్ దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నందు నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం సదస్సు పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడం, పోడు భూములకు పట్టాలు, తండాల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, గోర్బోలి భాషకు రాజ్యాంగ గుర్తింపు కల్పించడం వంటి ప్రధాన డిమాండ్ల సాధన కోసం సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల అధ్యక్షుడు పండు నాయక్, సీనియర్ నాయకులు రోశయ్య నాయక్, బీరప్ప, ధరావత్ రవి నాయక్, నాగేంద్ర నాయక్, అర్జున్ నాయక్, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లరికల్ బదిలీలు నిలిపివేయాలి: ఎఐటియుసి




ప్రజాపక్షం/చుంచుపల్లి: సింగరేణి కొత్తగూడెం ఏరియా నుంచి సత్తుపల్లి ఏరియాకు క్లరికల్ సిబ్బంది బదిలీల ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని ఎఐటియుసి నాయకత్వం డిమాండ్ చేసింది. ఇప్పటికే కొత్తగూడెం ఏరియాలో క్లరికల్ సిబ్బంది కొరత తీవ్రంగా ఉండగా, ఉన్న కొద్దిమంది ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం వల్ల పరిపాలనా కార్యకలాపాలు మరింత కుంటుపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆదివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో కొత్తగూడెం ఏరియాకు చెందిన క్లరికల్ సిబ్బంది ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శులు జక్కుల గట్టయ్య, ఎస్.వి.రమణమూర్తిలను కలిసి తమ సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంగ వెంకట్ మాట్లాడుతూ కొత్తగూడెం ఏరియాలో ఇప్పటికే పరిమిత సంఖ్యలో ఉన్న క్లరికల్ సిబ్బందితోనే కార్యాలయాలు, పరిపాలనా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరొకొంతమంది ఉద్యోగులను సత్తుపల్లి ఏరియాకు బదిలీ చేయడం వల్ల మిగిలిన ఉద్యోగులపై అదనపు పనిభారం పడటమే కాకుండా, కార్యాలయాల నిర్వహణలోనూ ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. అంతేకాకుండా విద్యాసంవత్సరం మధ్యలో ఉద్యోగులను బదిలీ చేయడం వల్ల వారి పిల్లల చదువులకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. కొత్తగూడెం ఏరియాలో పనిచేస్తున్న క్లరికల్ సిబ్బందిని మరిన్ని బదిలీలు, డిప్యూటేషన్ల నుంచి రక్షించాలని, సిబ్బంది కొరతను పరిష్కరించకుండా ఉన్న ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు పంపించడం సరైన విధానం కాదని అన్నారు. యాజమాన్యం వెంటనే జోక్యం చేసుకుని ప్రతిపాదిత బదిలీలను నిలిపివేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే కార్మికుల పక్షాన ఎంతటి పోరాటానికైనా ఎఐటియుసి సిద్ధంగా ఉంటుందని వంగ వెంకట్ హెచ్చరించారు. ఈ సమస్యను ఎఐటియుసి అగ్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియాకు చెందిన క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ భూములపై కార్పొరేట్ కన్ను

వందలాది ఎకరాల భూములు లీజు

భారీ యంత్రాలతో చదును

గిరిజన చట్టాలకు తూట్లు




ప్రజాపక్షం/పాల్వంచ : ఆదివాసీ గిరిజన భూములపై కార్పొరేట్ శక్తుల కన్ను పడింది. గిరిజన చట్టాలకు తూట్లు పొడుస్తూ, తుంగలో తొక్కుతూ కారు చౌకగా పాతిక సంవత్సరాల పాటు లీజు అగ్రిమెంట్లు చేసుకొంటున్నారు. భారీ యంత్రాలతో భూమిని చదును చేస్తూ యథేచ్ఛగా బోర్లను వేస్తూ పామాయిల్ తోటలను సాగు చేస్తున్నారు. తమ డబ్బు, అంగబలంతో అమాయక గిరిజనుల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వారి భూములను తమ ఆధీనంలోకి తీసుకొంటున్నారని తెలుస్తోంది. మండల పరిధి ఉమ్మడి ఉల్వనూర్ పంచాయతీ రేగులగూడెం, తమ్మలగూడెం, మామిడిగూడెం, మల్లారం ప్రాంతాలలో తమ పంజా విసురుతున్నారు. పామాయిల్ పంటతో అధిక లాభాలు వస్తాయని చెపుతూ ధీర్ఘకాలికంగా 20 నుండి 25 సంవత్సరాల పాటుగా కౌలుకు తీసుకొంటున్నారు. గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ బాండ్ పేపర్‌లపై గిరిజన రైతులతో ఒప్పంద పత్రాలను రాయించుకొంటున్నారు. వందలాది ఎకరాలలో పామాయిల్ సాగుచేస్తున్నారు. రేగుల గూడెం, తుమ్మలగూడెం, మామిడిగూడెం తదితర గ్రామాలలో గిరిజనులు సాగు చేసుకొని జీవించటానికి ప్రభుత్వం ఆర్ఒఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేసింది. గిరిజన ప్రాంతాలలో 1/70 పరిధిలో భూముల్లో క్రయ విక్రయాలు గిరిజనుల మధ్యే జరగాలి. గిరిజనేతరులు కొనుగోలు చేయటం నిషిద్ధం. కానీ కొంతమంది గిరిజనేతరులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొంటున్నారు. గిరిజనుల భూములను కౌలుకు తీసుకొంటున్నారు. భారీ యంత్రాలతో భూములను చదును చేసి బోర్లను వేస్తున్నారు. ప్రభుత్వం గిరిజనుల భూముల రక్షణ కోసం 1970 సంవత్సరంలో 1/70 చట్టాన్ని తీసుకొచ్చింది. బడాబాబులకు చట్టాలు చుట్టమవుతున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఏజెన్సీ ప్రాంతమైన ఉల్వనూరు పరిసర ప్రాంతాలలో స్థానిక గిరిజన రైతుల తమ సాగు అవసరాల కోసం బోర్లను వేసుకొనేందుకు అటవీశాఖ అనుమతుల కోసం చెప్పులరిగేలా తిరిగినా అనుమతులు ఇవ్వటానికి నిరాకరిస్తున్నారని ఆరోపణలు. కానీ గిరిజ నేతరులైన బడాబాబులు లీజుకు తీసుకొన్న భూముల్లో వేస్తున్న బోర్లను చూసీ చూడనట్లుగా అటవీ శాఖ అధికారులు మౌనం వహించటం పలు అనుమానాలకు తావిస్తున్నది. దీనితో స్థానిక రైతులకు లేని సడలింపు గిరిజనేతరులకు ఎలా ఇస్తున్నారని ప్రశ్నలు వస్తున్నాయి.

ఇస్తారీతిన బోర్లు : ఆర్ఒఎఫ్ఆర్ భూముల్లో రైతులు సాగు కోసం ట్రాక్టర్లతో చదును చేస్తే నిమిషాలమీద చేరుకొని అడ్డుకొనే సంబంధితశాఖ అధికారులు బడాబాబులు వందల ఎకరాలలో జెసిబి, ప్రొక్లెయిన్ తదితర భారీ యంత్రాలతో చదును చేస్తున్నాకానీ అటువైపు కన్నెత్తి చూడరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదీకాక

తొలి ప్రధాని నెహ్రూ వారసత్వాన్ని...

అప్రతిష్ఠపాల్జేసే యత్నం ఫలించదు

బిజెపి-ఆర్ఎస్ఎస్‌లపై జైరాం రమేశ్ ధ్వజం



న్యూఢిల్లీ : భారతదేశపు మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్ఠపాలుజేసేందుకు, కించపరిచేందుకు బిజెపి–ఆర్ఎస్ఎస్‌లు ఒక 'వ్యవస్థీకృత వ్యూహాన్ని' అనుసరిస్తున్నాయని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఆరోపించారు. అయితే, వారి ప్రయత్నం ఏమాత్రం ఫలించదని, ఎందుకంటే 'నెహ్రూ అనే భావన, భారతదేశం అనే భావనలో అంతర్భాగం' అని జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'జవహర్‌లాల్ నెహ్రూ కేవలం ఒక గొప్ప ప్రధానమంత్రి మాత్రమే కాదు. ఆయన సున్నితమైన, గౌరవనీయమైన, ఒక గొప్ప మానవతావాది, మంచి మనిషి. ఇలాంటి వారు రాజకీయాల్లో దొరకడం చాలా కష్టం' అని శనివారం ఇక్కడ జరిగిన నెహ్రూ మెమోరియల్ యూత్ ఫెస్టివల్ 2026 ముగింపు సభలో ప్రసంగిస్తూ జైరాం రమేశ్ అన్నారు. నెహ్రూ చారిత్రక సేవలను తుడిచిపెట్టేందుకు ఒక పథకం ప్రకారం దుష్ప్రచారం జరుగుతోందని రమేశ్ నిప్పులు చెరిగారు. దీనిని తర్కం, వాస్తవాలతో ఎదుర్కోవాలని ఆయన ప్రజలను కోరారు. 'నెహ్రూ ఆర్కైవ్' (nehruarchive.in)ను ప్రస్తావిస్తూ, చారిత్రక పత్రాలను అధ్యయనం చేయడం, వాటిని ఆనాటి పరిస్థితులు, చారిత్రక నేపథ్యాల నేపథ్యంలో అర్థం చేసుకోవడం యొక్క ఆవశ్యకతను జైరాం రమేశ్ నొక్కిచెప్పారు. చరిత్ర రచనలోని కీలక అంశాలు, చారిత్రక ఆధారాల ప్రామాణికత, సందర్భోచిత అవగాహన, వాస్తవ ఆధారిత విశ్లేషణ వంటి వాటిపై దృష్టి సారించాలని కాంగ్రెస్ నేత రమేశ్ యువ పరిశోధకులను, విద్యార్థులను కోరారు. మహాత్మాగాంధీ తన మరణానికి కేవలం 19 రోజుల ముందు నెహ్రూకు 'బహుత్ వర్ష్ జియో ఔర్ హిందుకే జవహర్ బనే రహో' (మీరు చాలా సంవత్సరాలు జీవించి భారతదేశానికి ఆభరణంగా నిలిచిపోండి) అని లేఖ రాశారని ఆయన గుర్తు చేశారు. 'ఆయన (నెహ్రూ) 50ఏళ్ల పాటు హిందు కే జవహర్‌గా నిలిచారు' అని ప్రశంసించారు. జవహర్‌లాల్ నెహ్రూ లేకపోతే, రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు అయ్యేదికాదని, రాజ్యాంగం సాధ్యమయ్యేది కాదని తాను విశ్వాసంతో చెప్పగలసని గుర్తుచేశారు. ఈ విషయాన్ని స్వయంగా బిఆర్.అంబేద్కర్ అంగీకరించారని నెహ్రూ చెప్పారు. నెహ్రూ చేసిన సేవలను జైరాం ప్రస్తావిస్తూ, మన ఆర్థిక విధానానికి పునాది వేయడం, అలీనవిధానం మన విదేశాంగ విధానానికి ఆధారం కావడం, జవహర్‌లాల్ నెహ్రూ లేకుండా సాధ్యమయ్యేది కాదని పేర్కొన్నారు.'ఈ సేవలన్నింటిని తక్కువ చేసి చూస్తున్నారు. గత 12ఏళ్లుగా నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్టపాలు చేయడానికి, కించపరచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. 'మనం దీనిని కేవలం భావోద్వేగాలతో కాకుండా, జ్ఞానంతో, వాస్తవాలతో ఎదుర్కోవాలి' అని ఆయన జోడించారు.నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి పార్లమెంట్‌లోపల, వెలుపలా నెహ్రూ వారసత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయడం, కించపరచడం బిజెపి–ఆర్ఎస్ఎస్‌ల వ్యవస్థీకృత వ్యూహంగాకొనసాగుతోందని జైరాం రమేశ్ ధ్వజమెత్తారు. శనివారం జవహర్‌లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆయనకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ నెహ్రూను 'రత్నం'గా అభివర్ణించగా, పార్టీ అధినేత మల్లికార్జున్ ఖర్గే ఆయనను 'ఆధునిక భారతదేశానికి ప్రధాన రూపశిల్పి'అని పేర్కొన్నారు.

మావోయిస్టుల హింసాకాండతో

నష్టపోయిన ఆదివాసీలు

• ఓటు హక్కు కూడా లేకుండా చేశారు • స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతి కార్యక్రమంలో ప్రధాని మోదీ విమర్శ



న్యూఢిల్లీ : నక్సల్ హింస వల్ల గిరిజన సమాజాలు అత్యంత దారుణంగా నష్టపోయాయని, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో వారికి కనీసం ఓటు హక్కు కూడా లేకుండా చేశారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆదివారం పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు వీరిని వారి అదృష్టానికి వదిలేశాయని విమర్శించారు. గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని, మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన 'జనజాతియ గౌరవ్ దివస్' కార్యక్రమంలో వర్చువల్ పద్ధతిలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టులు బలవంతంగా పిల్లలను తీసుకెళ్లినప్పుడు, గిరిజన యువతులను అపహరించినప్పుడు గత ప్రభుత్వాలు మౌనంగా ఉండిపోయాయని అన్నారు. నక్సలైట్లు గిరిజన సమాజాలకు ఓటు హక్కును నిరాకరించారు, కానీ అప్పటి ప్రభుత్వాలు కేవలం మూగ ప్రేక్షకులుగా ఉండిపోయాయి అని మోదీ చెప్పారు. అయితే, మావోయిస్టు హింస అంతం కావడంతో పరిస్థితి మారిందని, హింస వల్ల బాల్యం దెబ్బతిన్న పిల్లలకు ఇప్పుడు విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. గత 12–13 ఏళ్లలో దాదాపు 50 కోట్ల మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారని, ఇది స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతదేశం సాధించిన అతిపెద్ద విజయాల్లో ఒకటి అని మోదీ చెప్పుకొచ్చారు. గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేని చోట అభివృద్ధిని వేగవంతం చేసేందుకు, కేంద్ర ప్రభుత్వం 'పిఎం–జన్మన్' పథకం 'ధర్తీ ఆబా జనజాతియ గ్రామ ఉత్కర్ష అభియాన్' కోసం లక్ష కోట్ల రూపాయలకు పైగా నిధులను కేటాయించిందని ప్రధాన మంత్రి తెలిపారు. పేదకుటుంబాలకు నాలుగు కోట్లకు పైగా పక్కా ఇళ్లను అందించడం, స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల తర్వాత కూడా విద్యుత్ లేని 18,000 గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడం, 'ఆయుష్మాన్ భారత్' పథకం కింద ప్రజలకు రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం ద్వారా ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యతనిచ్చిందని ఆయన చెప్పారు. ప్రభుత్వం 'ముద్రా' పథకం కింద ఎటువంటి పూచీకత్తు అవసరం లేని రుణాలను అందించిందని ఆయన పేర్కొన్నారు. 2021లో ప్రారంభమైన 'జనజాతియ గౌరవ్ దివస్' నేడు ఒక జాతీయ వేడుకగా మారిందని ఆయన పేర్కొన్నారు. బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకుని గత ఏడాది దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా కార్యక్రమాలు నిర్వహించామని, వీటిలో కోట్ల మంది ప్రజలు పాల్గొన్నారని మోదీ చెప్పారు. మహారాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరామ్, సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే గడ్చిరోలిలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ 181 సీట్లు అడుగుతోంది

ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్



లక్నో : వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) కలిసి పోటీచేయాలని నిర్ణయించుకున్నాయి. అయితే విపక్ష కూటమిలో సీట్ల పంపకాల వ్యవహారం వివాదాస్పదంగా మారే అవకాశం కనబడుతోంది. యుపి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏకంగా 181 అసెంబ్లీ స్థానాలను కోరుతున్నట్లు ఎస్‌పి అధినేత, మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ వెల్లడించారు. మొత్తం 403 స్థానాలున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో దాదాపు సగం సీట్లు కాంగ్రెస్ అడుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అన్ని సీట్లు అడుగుతున్నప్పటికీ అఖిలేశ్ మాత్రం సానుకూల వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌తో తమ సంబంధాలు బాగున్నాయని, బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమి కలిసే పోరాడుతుందని అఖిలేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో జరిగిన హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో అఖిలేశ్ యాదవ్ పాల్గొన్నారు. యుపి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్ని స్థానాలు కోరుతోందని అఖిలేశ్‌ను ప్రశ్నించగా.. ఆయన 181 సీట్లు అడుగుతోందని జవాబిచ్చారు. అఖిలేశ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ కూడా స్పందించింది. నవంబర్ 17న సమాజ్‌వాదీ పార్టీతో సీట్ల పంపకాలపై చర్చలు ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు కాంగ్రెస్ బలమైన శక్తిగా ఉండేది. కానీ క్రమంగా ఆ పార్టీ ప్రభావం తగ్గుతూ వచ్చింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసి కేవలం రెండు స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ 111 స్థానాలను గెలుచుకుంది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎస్‌పి, కాంగ్రెస్ కలిసి పోటీ చేయడంతో పరిస్థితి కొంత మారింది. ఎస్‌పి 37 స్థానాలు, కాంగ్రెస్ ఆరు స్థానాలు గెలుచుకున్నాయి. ఈ ఫలితాలతో రాష్ట్రంలో తమ బలం పెరిగిందని కాంగ్రెస్ భావిస్తోంది. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ప్రయత్నిస్తోంది.

అసమర్థ బ్రేకింగ్ వ్యవస్థతో

'వందేభారత్' 463 కి.మీ. ప్రయాణం

విచారణ ప్రారంభించిన సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్



న్యూఢిల్లీ : బ్రేకింగ్ వ్యవస్థ సమర్థవంతంగా లేకుండానే ఖాళీ వందే భారత్ రైలును 463 కిలోమీటర్లు ప్రయాణించేందుకు అనుమతివ్వడం చర్చనీయాంశమైంది. అక్టోబర్‌లో జార్ఖండ్– ఉత్తరప్రదేశ్ చోటు చేసుకున్న ఈ ఘటనతో ఇతర ప్యాసింజర్ రైళ్లకు కూడా ప్రమాదం పొంచి ఉండే పరిస్థితి ఉండంతో సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్ విచారణ ప్రారంభించింది. దాదాపు ఇలాంటి నిర్లక్ష్యం కారణంగానే ఈనెల 11న అసోంలో కోల్‌కతా–సైరంగ్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ఘటన జరిగింది. సమర్థవంతమైన బ్రేకింగ్ వ్యవస్థ లేకుండా రైలును నడపడం తీవ్రమైన భద్రతాపరమైన ఆందోళన, ఇది సిబ్బంది, ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తూ, రైల్వే కార్యకలాపాల భద్రతను ప్రభావితం చేస్తూ ఒక పెద్ద ప్రమాదానికి దారితీయవచ్చు అని రైల్వే జోన్ పేర్కొంది. జార్ఖండ్‌లోని హతియా నుండి ఉత్తర ప్రదేశ్‌లోని ఝాన్సీ వరకు ఒక ఫ్రైట్ లోకోమోటివ్ ద్వారా ఈ ఖాళీ చైర్ కార్ రేక్‌ను తరలించాల్సి ఉంది. ప్రయాణం పొడవునా రేక్‌ను లాగాల్సిన గూడ్స్ లోకోమోటివ్‌తో వందే భారత్ బ్రేకింగ్ వ్యవస్థను అనుసంధానించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అయితే, రైల్వే సిబ్బంది సరైన సమన్వయం చేయడంలో విఫలమవడమే కాకుండా, సమస్యను గుర్తించిన తర్వాత రైలు సిబ్బంది ఇచ్చిన హెచ్చరికలను కూడా పట్టించుకోలేదు. రాంచీ డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం)ను విచారణ ప్రారంభించమని ఆదేశిస్తూ జారీ చేసిన అధికారిక ఉత్తర్వులో, హతియా నుండి ఝాన్సీకి ఖాళీ వందే భారత్ రేక్‌ను తరలించడానికి అక్టోబర్ 24న సూచనలు జారీ చేసినట్లు ఎస్ఇఆర్ జోన్ పేర్కొంది. 'లోకో పైలట్ వాంగ్మూలం ప్రకారం, అమలులో ఉన్న సూచనలకు అనుగుణంగా, హతియా నుండి బయలుదేరిన తర్వాత హతియా–రాంచీ సెక్షన్‌లో బ్రేక్ ఫేల్, బ్రేక్ పవర్ పరీక్ష నిర్వహించబడింది అని నవంబర్ 7 నాటి ఉత్తర్వులో ఉంది. అయితే, పరీక్ష సమయంలో, రైలు బ్రేక్ పవర్ చాలా బలహీనంగా, అసమర్థంగా ఉందని లోకో పైలట్ కనుగొన్నారని అందులో పేర్కొన్నారు. రాంచీ స్టేషన్‌కు చేరుకున్న తర్వాత, లోకో పైలట్ బలహీనమైన బ్రేక్ పవర్‌పై రైల్వే సిబ్బందికి (సెక్షన్ కంట్రోలర్, ట్రాక్షన్ లోకో కంట్రోలర్) లిఖితపూర్వక ఫిర్యాదును సమర్పించారు. 'బలహీనమైన బ్రేక్ పవర్ ఉన్నట్లు నివేదించినప్పటికీ, రైలును అదే స్థితిలో ముందుకు వెళ్లడానికి అనుమతించారు' అని ఉత్తర్వులో ఉంది. ఉత్తరప్రదేశ్‌లోని చందౌలీ జిల్లాలో ఉన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ (డిడియు) స్టేషన్‌లోనే రైల్వే సిబ్బంది ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకున్నారు. తదనంతరం, డిడియులోని అధికారులు రైలును తనిఖీ చేయగా, అన్ని కోచ్‌లలోని బ్రేకింగ్ వ్యవస్థలను నిలిపివేసినట్లు (ఐసోలేట్ చేసినట్లు) గుర్తించారు. దీనివల్ల బ్రేకులు పనిచేయలేదు. ప్రాథమిక విచారణలో కోచ్ అండ్ వ్యాగన్ సిబ్బంది, సంబంధిత స్టేషన్లలోని సెక్షన్, ట్రాక్షన్ కంట్రోలర్లు, అలాగే హతియా నుండి డిడియు వరకు రైలును నడిపిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని తేలింది. బ్రేక్ పవర్ సరిగ్గా లేదని సమాచారం అందినప్పటికీ, సంబంధిత రైల్వే సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్ ముందు

తలొగ్గిన కేరళం సర్కార్

విద్యాసంస్థలు, కమిటీలలో ఆర్ఎస్ఎస్ సంబంధిత వ్యక్తులు పెరుగుతుండడమే నిదర్శనం : సిపిఐ ఎమ్మెల్యే రాజన్



కోజికోడ్ : కేరళంలోని యుడిఎఫ్ ప్రభుత్వంపై సిపిఐ విమర్శలు గుప్పించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ప్రభుత్వం, విద్యాశాఖ సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్ ముందు తలొగ్గాయని సీనియర్ సిపిఐ నాయకుడు, ఎమ్మెల్యే కె. రాజన్ ఆరోపించారు. కేరళంలోని విద్యా సంస్థలు, కమిటీలలో ఆర్ఎస్ఎస్‌తో సంబంధం ఉన్న వ్యక్తుల సంఖ్య పెరుగుతుండటమే దీనికి నిదర్శనమన్నారు. ఆదివారం రాజన్ కోజికోడ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల పాఠ్యప్రణాళికను నిర్ణయించే 'స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్' (ఎస్‌సిఇఆర్‌టి)లో ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడిని చేర్చడానికి ప్రతిపాదన ఉందని మాజీ రాష్ట్ర మంత్రి రాజన్ తెలిపారు. 'సాధారణ విద్యాశాఖ, ఆర్ఎస్ఎస్ సభ్యుడిని చేర్చుకోవడం ద్వారా ఎస్‌సిఇఆర్‌టి పాలక మండలిని పునర్వ్యవస్థీకరించాలని ఆలోచిస్తుండటం చాలా తీవ్రమైన విషయం అని ఆయన అన్నారు. విద్యా రంగంలో ఆర్ఎస్ఎస్ నాయకులకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తున్న సందర్భాల్లో ఇది ఒకటి మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. కేరళంలోని 'శిక్షక్ సదన్' పాలక మండలిలో సంఘ్ పరివార్‌కు చెందిన వ్యక్తిని చేర్చడాన్ని ఆయన మరో ఉదాహరణగా పేర్కొన్నారు. దీనిపై ప్రశ్నించినప్పుడు, కేంద్రం నుండి మరిన్ని నిధులు పొందే ఆశతోనే అలా చేశామని సాధారణ విద్యాశాఖ మంత్రి ఎన్. షంసుద్దీన్ చెప్పారని రాజన్ తెలిపారు. అయితే, ఇటీవల కాలంలో శిక్షక్ సదన్ నిర్వహణ కోసం కేంద్రం నుండి ఎటువంటి నిధులు అందలేదని, ఇది ఉపాధ్యాయుల విరాళాలతోనే నడుస్తోందని చెప్పారు. ఇటువంటి సంఘటనలు రాష్ట్ర విద్యా రంగాన్ని సంఘ్ పరివార్, ఆర్ఎస్ఎస్‌కు అప్పగిస్తున్నట్లు సూచిస్తున్నాయి అని పేర్కొంటూ, దీనిని ఏమాత్రం అనుమతించకూడదని రాజన్ స్పష్టం చేశారు.

ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారు

ఫారం-6 ద్వారా దరఖాస్తు

సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం



న్యూఢిల్లీ : గతంలో ఓటర్లుగా నమోదైనప్పటికీ ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారు, ఎటువంటి ప్రాసిక్యూషన్ భయంలేకుండా ఫారం–6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. కోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో, సదరు వివరణకు స్థానిక భాషల్లో కూడా విస్తృత ప్రచారం కల్పించాలని ప్రధాన ఎన్నికల అధికారులను కోరినట్లు ఎన్నికల సంఘం తెలియజేసింది. గత ఓటర్ల జాబితా(ల)లో ఓటర్లుగా నమోదు చేయబడి, 'సర్' సమయంలో ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు కనిపించని దరఖాస్తుదారులు ఫారం–6 దాఖలు చేయడం ద్వారా, గత ఓటర్ల జాబితా(ల)లో ఓటర్లుగా నమోదు చేయబడిన కారణంగా, ప్రజా ప్రాతినిధ్య చట్టం 19 లోని సెక్షన్ 31 కింద ప్రాసిక్యూషన్ చర్యను ఎదుర్కోవచ్చనే కొన్ని ఆందోళనలు వ్యక్తం అయ్యాయని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకురాబడింది. 'అటువంటి అపోహలను తొలగించేందుకు దరఖాస్తుదారు /ఓటరు 'ఎస్ఐఆర్'కు ముందు ఓటర్ల జాబితాలో నమోదై ఉండి , 'సర్' సమయంలో వారి పేరు ముసాయిదా ఓటర్ల జాబితాలో కనిపించలేదనే కారణంతో మాత్రమే ఫారం–6 దాఖలు చేసినందుకు ఎవరిపైనా విచారణ ప్రారంభించబడదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. అయితే, దరఖాస్తుదారు / ఓటరు అప్పటికే మరే ఇతర పార్లమెంటరీ లేదా అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదు కాకుండా ఉండి, చేసిన ప్రకటన చట్టానికి అనుగుణంగా ఉన్నట్లయితే మాత్రమే ఈ విచారణ వర్తించదు' అని అఫిడవిట్‌లో పేర్కొంది. ఎన్నికల జాబితాలో చేర్చబడని ఎఎస్‌డిడి (ఆబ్‌సెంట్, షిఫ్టెడ్, డెడ్, డుప్లికేట్) ఓటర్లను చేర్చాలన్న సుప్రీంకోర్టు సూచనను కూడా తాము పరిగణనలోనికి తీసుకున్నట్లు ఎన్నికల సంఘం సమర్పించింది. 'ఓటర్ల ప్రయోజనాల దృష్ట్యా ఎన్నికల కమిషన్ మరికొన్ని చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. 'ఎస్ఐఆర్' కొనసాగుతున్న రాష్ట్రాలు / కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు, ఎన్నికల సంఘం నవంబర్ 6, 2026 తేదీ గల కమ్యూనికేషన్ ద్వారా ఇతర విషయాలతో పాటు ఆదేశాలు జారీచేసింది' అని అది పేర్కొంది. ఓటర్లు తమ దరఖాస్తులను సమర్పించడానికి అనుమతించాలని సిఇఓలను కోరినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. వారి ప్రస్తుత నివాసానికి సంబంధించిన ఇఆర్ఓ లేదా ఎఇఆర్ఓ లేదా బిఎల్ఓకి సరిగ్గా పూరించిన ఎన్యూమరేషన్ ఫారం (అనుబంధం–ఏ) సమర్పించాలి. 'స్థానమార్పిడి చేసుకోని ఓటర్లు, సంతకం చేసిన గణనపత్రం (అనుబంధం –ఏ)తో పాటు, దానిని ఇంతకుముందు సమర్పించకపోవడానికి గల కారణం తెలిపే అనుబంధం –బి పత్రాన్ని సమర్పించవచ్చు. 'ఇసిఐనెట్‌లో 'ఇ' సంతకంతో కూడిన ఆన్‌లైన్ సంతకం సమర్పణ సౌకర్యం అందుబాటులో ఉంటుంది' అని ఎన్నికల కమిషన్ పేర్కొంది. నమోదులో పునరావృతిని నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, నిర్దేశించిన అర్హతా షరతులను నెరవేర్చిన పక్షంలో, తుది ఓటర్ల జాబితాలో తన పేరును చేర్చుకునే అవకాశాన్ని ఏ ఓటరు కూడా కోల్పోకుండా చేసేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను నిర్ధారించే తన రాజ్యాంగ విధికి కమిషన్ కట్టుబడి ఉంది. ఇందులో పాల్గొన్న వారి సంఖ్య అధికంగా ఉండటం, అలాగే, పూర్తి డేటా డిజిటలైజేషన్ చేయబడటం వల్ల సవాళ్లు ఎదురవుతున్నాయి. 'ఎప్పటికప్పుడు సమస్యలు తలెత్తుతూనే ఉన్నాయి. భవిష్యత్తులోనూ తలెత్తుతాయి. ఓటు వేయడానికి అర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతోపాటు, అదే సమయంలో ఈ జాబితాలోని అన్ని వ్యత్యాసాలను సరిదిద్దాల్సిన అవసరాన్ని కూడా కమిషన్ గుర్తిస్తూనే ఉంది' అని ఇసి తెలియజేసింది. ఓటర్ల జాబితాలో ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) చర్య చట్టబద్ధంగా అధికారం పొందిందని, సంబంధిత ఉత్తర్వులను కమిషన్‌లోని ముగ్గురు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని పేర్కొంటూ, ఎన్నికల సంఘం గతంలో సుప్రీంకోర్టులో తన చర్యను గట్టిగా సమర్థించుకుంది. ఫారం–సవరించబడిందన్న ఆరోపణలను తోసిపుచ్చుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఆయన తీసుకున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై స్పందిస్తూ, చట్టబద్ధమైన ఫారం–6లో ఎలాంటి మార్పులు చేయలేదని ఎన్నికల సంఘం పేర్కొంది.

బస్సు ప్రమాద బాధితులకు పరిహారం పెంచండి

• మృతుల కుటుంబాలకు జీవనోపాధి సహాయం కల్పించాలి

• ప్రధాని మోదీకి అసోం కాంగ్రెస్ నేత దేబబ్రత్ లేఖ



గువాహతి : అసోంలోని కజిరంగ పార్కు సమీపంలో మినీబస్సుట్రక్కు ప్రమాద బాధితులకు పరిహారాన్ని పెంచాలని, గాయపడిన వారికి ఉచిత చికిత్స అందించాలని అసోం కాంగ్రెస్ నాయకుడు దేబబ్రత సైకియా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని కోరారు. మృతులైన 26 మంది కుటుంబాలకు జీవనోపాధి సహాయం కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. కజిరంగ జాతీయ పార్కు సమీపంలో శుక్రవారం ఒక మినీబస్సు, కంటైనర్ ట్రక్కు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో మహిళలు, మైనర్లతో సహా కనీసం 26 మంది మరణించగా, మరో 20 మంది గాయపడిన విషయం తెలిసిందే. మృతుల్లో చాలా మంది కళాశాల విద్యార్థులే. కాగా, జాతీయ రహదారి715 దయనీయ పరిస్థితిపై కాంగ్రెస్ నేత దేబబ్రత్ ఆందోళన వ్యక్తం చేశారు. అవసరమైన రహదారి భద్రతా చర్యలను అధికారులు నిర్లక్ష్యం చేయడం కలవరపెడుతోందని ఆరోపించారు. రహదారి పరిస్థితి, డిజైన్, నిర్వహణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సమగ్ర పరిశీలన చేయాలని, అలాగే ఆ ప్రాంతంలో రహదారి భద్రత, ఆరోగ్య సంరక్షణ, మౌలిక సదుపాయాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని సైకియా డిమాండ్ చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆర్థిక సహాయం ప్రకటించినందుకు ప్రధానమంత్రిని అభినందిస్తూనే, ఈ విషాదం తీవ్రత దృష్ట్యా పరిహారం, పునరావాస చర్యలను పెంచాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. పరిపాలనాపరమైన జవాబుదారీతనాన్ని నిర్ధారించడంతో పాటు, ప్రమాదంలో ప్రమేయం ఉన్న డ్రైవర్ల ప్రవర్తనపై కూడా విచారణ జరపాలని కాంగ్రెస్ నాయకుడు తన లేఖలో పేర్కొన్నారు. ప్రమాద స్థలాన్ని మరుసటి రోజు సందర్శించిన ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ స్పందన పట్ల ఆయన నిరాశ వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడితో గతంలో కొన్ని ట్రాఫిక్ నిబంధనలను సడలించినట్లు శర్మ స్వయంగా అంగీకరించారని, అందువల్ల పరిపాలనా నిర్ణయాలపై స్వతంత్ర పరిశీలన అవసరమని సైకియా అన్నారు.

ఛత్తీస్‌గఢ్ నుంచి సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉపసంహరణ

కల్లోలిత మణిపూర్‌లో మోహరింపు

న్యూఢిల్లీ/రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ వ్యతిరేక కార్యకలాపాల రంగం నుండి 1,000 మందికి పైగా సిబ్బంది ఉన్న ఒక బెటాలియన్‌ను సిఆర్‌పిఎఫ్ ఉపసంహరించుకుంది. ఈ బెటాలియన్‌ను మణిపూర్‌కు పంపింది. మార్చిలో భారతదేశంలో నక్సలిజం అంతమైందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత, కేంద్ర సాయుధ పోలీసు దళం (సిఎపిఎఫ్) యూనిట్‌ను ఉపసంహరించుకోవడం ఇదే మొదటిసారి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు, అమర్‌నాథ్ యాత్ర, ఢిల్లీలోని నిరసనలు వంటి వివిధ అంతర్గత భద్రతా విధుల కోసం కంపెనీలను (బెటాలియన్‌లో భాగం) తాత్కాలికంగా ఉపసంహరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో, గతంలో మావోయిస్టుల ప్రాబల్య కేంద్రమైన సుక్మాలో ఈ బెటాలియన్ ఉండేదని అధికారులు పిటిఐకి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా, ఇది వామపక్ష తీవ్రవాద (ఎల్‌డబ్ల్యుఇ) కార్యకలాపాలు చేపట్టింది. ఆ తర్వాత మార్చి అనంతరం మైన్‌లను తొలగించడం, ఇంప్రొవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్‌లను (ఐఇడిలను) నిర్వీర్యం చేయడం వంటి పనులు చేసింది. కాగా, గత మూడేళ్లుగా జాతి హింస కొనసాగుతున్న మణిపూర్‌కు తరలించాలని, ఛత్తీస్‌గఢ్ నుండి ఒక జనరల్ డ్యూటీ బెటాలియన్‌ను ఉపసంహరించుకోవాలని సిఆర్‌పిఎఫ్ ప్రధాన కార్యాలయం ఆదేశించింది. రాష్ట్రంలో కొనసాగుతున్న హింసను అరికట్టడానికి మణిపూర్‌లో తమ ఉనికిని బలోపేతం చేయాలనే ఉద్దేశంతోన

ఫ్రాన్స్‌లో నిరసన ప్రదర్శన



పారిస్: జీవన వ్యయాల పెరుగుదల, విద్యారంగ నిధుల కొరత, ప్రభుత్వ సేవల్లో కోతలు వంటి సమస్యలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో వరుసగా వారాంతపు ఐదవ శనివారం కూడా అనేక నగరాల్లో నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. ఈ నిరసన ప్రదర్శనల్లో లక్షలమందికిపైగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనేకచోట్ల ప్రదర్శకులు మాస్కులు ధరించి పోలీసులపై పొగ బాంబులు విసిరారు. ఎప్పటిలాగానే దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణ, ప్రదర్శకుల అణచివేతకోసం 70,000 మంది పోలీసులను మోహరించింది. ఒక్క పారిస్ నగరంలోనే 24,000 మంది వీధుల్లోకి వచ్చిన నిరసన ప్రదర్శనల్లో పాల్గొన్నట్లు అంతర్గత మంత్రిత్వశాఖ అంచనావేసింది. గతంకంటే ప్రదర్శకుల సంఖ్య, తీవ్రత తగ్గిందని చెప్పుకుంది. పోలీసులు 219 మందిని అరెస్టు చేశారు. మోర్సెయిల్లే, గ్రెనోబెల్, లియోన్, బోర్డియాక్స్, మోంట్‌పెల్లియర్, టౌలస్, లిల్లే తదితర ప్రాంతాలలో స్వల్ప ఘర్షణలు చెలరేగాయి.

29న స్పెయిన్‌లో ఎన్నికలు



మాడ్రిడ్: యూరోపియన్ యూనియన్‌లో ఎంతో ప్రాధాన్యంగల దేశం స్పెయిన్‌లో నవంబరు 29వ తేదీన ముందస్తు ఎన్నికల సందర్భంగా వివిధ పార్టీల నాయకులు భారీ ప్రచార కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. నిర్ణీత ప్రకారం 2028 జులైలో ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ, వ్యతిరేక వాతావరణం మధ్య తనకు అనుకూలమైన తీర్పు వస్తుందన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి పెడ్రో సాంచెజ్ కూటమిలో ఉన్న మిత్రపక్షాలను కూడా తిరస్కరించి గతనెల ఐదో తేదీన చట్టసభను రద్దుచేశారు. గృహ నిర్మాణం, ఇంటి అద్దెల పెనుభారాలు, జీవన వ్యయాల పెరుగుదల సమస్యలతో ప్రజలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రదర్శనలు చేస్తుండగా కూటమి ప్రభుత్వంలో ఉన్న వామపక్షాలు కూడా ప్రజాగళంతో మమేకమయ్యాయి. వామపక్ష సుమర్‌పార్టీ ''బ్రాడర్ ఫ్రంట్'' పేరుతో ఒంటరిపోటీకి దిగింది.స్పెయిన్ దిగువసభలో ఉన్న 350 స్థానాల్లో 176 స్థానాలు గెలుచుకున్న పార్టీ లేదా కూటమికే అధికారం లభిస్తుంది.

డాన్‌బాస్ వదులుకోడానికి సిద్ధంగా లేం:జెలెన్‌స్కీ



కీవ్: యుద్ధం ముగించడానికి భూభాగాన్ని రష్యాకు వదులుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. నాటోలో చేరితే డాన్‌బాస్ నుండి ఉక్రేన్ వైదొలగుతుందా? అనే ప్రశ్నను అమెకిన్ ప్రతినిధుల నుండి మొదటిసారి వచ్చిందని పత్రికాగోష్ఠిలో చెప్పారు. డాన్‌బాస్ ప్రాంతాన్ని వదులుకోవడానికి తమ దేశం సిద్ధంగా లేదని పునరుద్ఘాటించారు. ఉక్రేన్ సైన్యం పునర్నిర్మాణానికి భారీ నిధులు సమకూర్చి భద్రతాపాక్ష్యా కేజీలు డాన్‌బాస్‌ను వదులుకునేవిషయాన్ని తాను ప్రజాభిప్రాయసేకరణకు పెడతానన్నారు. అబుధాబిలో నవంబరు 10–11 తేదీలలో అమెరికా చొరవతో జరిగిన యుద్ధ పరిష్కార త్రైపాక్షిక చర్చల (అమెరికా, రష్యా, ఉక్రేన్) కొనసాగింపుగా పుతిన్, జెలెన్‌స్కీలతో ట్రంప్ ప్రతినిధులు సంభాషణల సందర్భంగా జెలెన్‌స్కీకి ఈ ప్రతిపాదన చేశారు. ఉక్రేన్ ఎప్పటినుండో నాటో సభ్యత్వాన్ని కోరుకుంటుండగా, రష్యాను తక్కువగా అంచనావేసి తూర్పు దిశగా నాటోను విస్తరించాలని జరుగుతున్న ప్రయత్నాలను నెరవేరనివ్వబోమని పుతిన్ కూడా చాలాకాలంగా చెబుతున్నారు. ఈ దశలో ట్రంప్ తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ శాంతి యత్నాలు చేస్తున్నారు.

ఇజ్రాయెల్‌లో ఐక్యతాప్రభుత్వానికి యత్నం



టెల్‌అవీవ్: ఇజ్రాయెల్‌లో ఐక్యతా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఒక ప్రయత్నం ప్రారంభమైంది. ఈ మేరకు ఆదివారం రాత్రికి యషర్ పార్టీ నాయకుడు గాడి ఐసెన్‌కోట్, లికుడ్‌పార్టీ నాయకుడు నెతన్యాహూల తరపున ప్రతినిధులు చర్చల్లో పాల్గొంటారు. లభించిన నివేదిక ప్రకారం యషర్ పార్టీ తరపున యోవ్ హోరోవిట్జ్, ఎం.కె.చిలీ ట్రోపర్, నెతన్యాహూ తరపున ఒఫిక్ కాట్జ్, మైఖేల్ రాబెల్లో చర్చల్లో పాల్గొంటారని ఇజ్రాయెల్ పత్రిక తెలియజేసింది. నెతన్యాహూ దగ్గర సైనిక దళాల ప్రధానాధిపతిగా పనిచేసిన హోరోవిట్జ్ యషర్ నేత ఐసెన్‌కోట్‌కు మిత్రుడు. కొత్తగా ఎన్నికల్లో గెలిచిన ఎంకె.ఎలీషా మదన్‌ను కూడా చర్చల్లో చేర్చుకోవాలని లికుడ్‌పార్టీకి ఐసెన్‌కోట్ విజ్ఞప్తి చేశారు. అరబ్‌పార్టీలు ఐసెన్‌కోట్‌కు మద్దతు ఇస్తూ ఈ విషయాన్ని దేశాధ్యక్షుడికి కూడా ప్రతిపాదించాయి. కానీ సంప్రదాయవాదులతోనే ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఐసెన్‌కోట్ ప్రయత్నాలు చేస్తున్నారు.

కాప్–31లో వాతావరణ యాత్ర



అంటల్యా: టర్కీ నగరం అంటల్యాలో జరుగుతున్న కాప్– 31 ప్రపంచ వాతావరణ సదస్సు సందర్భంగా 10,000 మంది సంప్రదాయ ప్రజలు నిర్వహించిన వాతావరణ యాత్ర ఎంతో ఆకట్టుకుంది. అంటాల్యా ఎగ్జిబిషన్ సెంటర్ నుండి సముద్రతీరం వద్ద పెద్ద చౌరాస్తా వరకూ జరిగిన ప్రదర్శనలో కార్మిక సంఘాలు, టర్కీ వామపక్షాలు, ఇతర ప్రతిపక్షాలు, పాలస్తీనా మద్దతుదారులు, యుద్ధకుర్దిష్ అనుకూల వామపక్ష డిఇఎంపార్టీ కార్యకర్త, చట్టసభలో డిఇఎం పార్టీ సభ్యురాలు, ఆపార్టీ సహ–అధ్యక్షురాలు తులేహతీ మోగుల్లారి తదితరులు ప్రదర్శనలో పాల్గన్నారు. వీరితోపాటు గ్రీన్‌పీస్ 350 ఆర్గనైజేషన్, క్లైమేట్ యాక్షన్ నెట్‌వర్క్, ప్రధాన ఎన్‌జిఓ కార్యకర్తలు, ఫెమినిస్టు, అణువ్యతిరేక, యుద్ధవ్యతిరేక కార్యకర్తలు పాల్గొన్నారు.

పపంచవ్యాప్తంగా వాతావరణంలో తీవ్రమైన మార్పులు సంభవిస్తున్నప్పటికీ అగ్రదేశాలు సహా ప్రపంచ నేతలు ఎవ్వరూ సరిగ్గా పట్టించుకోవడంలేదని, వాతావరణ సంరక్షణకు తగిన నిధులు కేటాయించడంపై దృష్టి పెట్టడంలేదని విమర్శిస్తూ భారీ నిరసన ప్రదర్శన జరిగింది. నవంబరు తొమ్మిదోతేదీ నుండి 20వ తేదీ వరకూ 11 రోజులు ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ వాతావరణ సదస్సు లేదా యుఎన్‌ఎఫ్‌సిసిసి (ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లైమేట్ ఛేంజ్) సదస్సులో అమెరికా పాల్గొనడం లేదు. ఇంతకుముందు బ్రెజిల్‌లో జరిగిన సదస్సు సందర్భంగా కూడా భారీ నిరసన ప్రదర్శన జరిగింది.

ఇదిలా ఉండగా, కాప్–31 సదస్సులో, శిలాజ ఇంధనాల నుండి పరివర్తనకు వీలుగా ఆవిర్భవించిన 57 దేశాల శాంటా మార్టా నుండి కొలంబియా వైదొలగింది. ఐనప్పటికీ ప్రణాళికలు తయారవుతున్నాయి. తదుపరి సమావేశం 2027లో నిర్వహించాలని నిర్ణయించారు. ఆంటోనీ గుటెర్రెస్ వీడ్కోలు ప్రసంగం చేశారు. డిసెంబరునెలాఖరు నాటికి ఆయన ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి పదవి నుండి వైదొలగుతున్నారు. వాతావరణం గురించి వాస్తవాలు మాట్లాడాలని ఆయన పిలుపు ఇచ్చారు. కాగా, వాతావరణమార్పుల కార్యానిర్వాహక కార్యదర్శి సైమన్ స్టయిల్ మాట్లాడుతూ, వాతావరణ సదస్సులలో యువకులు ఎక్కువ పాల్గొనాలని పిలుపు ఇచ్చారు.

మనీలాలో 49వ ఏషియన్ సదస్సు ప్రారంభం



మనీలా: ఆగ్నేయ ఆసియా దేశాల సంఘం(ఆసియాన్)49వ శిఖరాగ్ర సదస్సు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఆదివారం ప్రారంభమైంది. ''మన భవిష్యత్తును కలిపి నడిపిద్దాం'' అనే నినాదంతో ఈ సారి సదస్సు నిర్వహిస్తున్నారు. మంగళవారం వరకూ మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సులో ప్రాంతీయ ఉద్రిక్తతలు, ప్రపంచ సమస్యలపై చర్చిస్తారు. చివరిరోజు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, విదేశాంగమంత్రి మార్కో రుబియో పాల్గొంటారు. బ్రూనై, కంబోడియా, ఇండోనేసియా, లావోస్, మలేసియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం, తూర్పు తైమూర్ దేశాధినేతలు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డసిల్వా, ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీగుటెర్రెస్ ఈ సదస్సులో పాల్గొంటున్నారు.

మధ్యంతర ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత ట్రంప్ ఆసియా పర్యటనకు విశేష ప్రాధాన్యత ఏర్పడింది. మనీలా సదస్సులో ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండో మార్కోస్ జూనియర్ ఈ సంఘం బాధ్యతలను సింగపూర్‌కు అప్పగించిన తర్వాత చివరిరోజు మధ్యాహ్నం ట్రంప్ అక్కడికి చేరుకుంటారు. దక్షిణ చైనా సముద్రంలో ఉద్రిక్తతల నేపథ్యంలో దేశాల నాయకులు సమన్వయంతో వ్యవహరించాలని ట్రంప్ చెప్పే అవకాశాలు ఉంటాయి. అదేవిధంగా మయన్మార్‌లో అంతర్యుద్ధాన్ని గురించి కూడా ట్రంప్ వ్యాఖ్యలు, విమర్శలు చేసే అవకాశాలు ఉంటాయి. చైనా తరపున ఆ దేశ ప్రధానమంత్రి లీ కియాంగ్ పాల్గొంటారు. ఐతే 18,19 తేదీలలో ఎపెక్స్ సదస్సు నిమిత్తం ట్రంప్ చైనా వెళుతున్నారు. 19న ముగ్గురు అగ్రనాయకులు(పుతిన్, ట్రంప్, జిన్‌పింగ్) చరిత్రాత్మక సమావేశం నిర్వహిస్తున్నారు. అదువల్ల లీ కియాంగ్ ముందుగానే మనీలా నుండిచైనా బయలుదేరి వెళతారు.

కాగాపాశ్చాత్యదేశాల నాయకులతో ఆసియాన్ నాయకులు చర్చలు జరుపుతారు. పశ్చిమాసియాలో సమస్యపై కూడా సంభాషణలు సదస్సులో జరుగుతాయి. దీర్ఘకాలంగా దక్షిణ చైనాలో ఘర్షణలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ దశలో సంయమనం పాటించాలని, శాంతియుతంగా సమస్యలు పరిష్కరించుకోవాలనే తీర్మానాలను ఆసియాన్ సదస్సు ఆశ్రయిస్తుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

మరణశిక్షకు వ్యతిరేకంగా భారత్ ఓటు

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా మరణశిక్షణపై నిషేధం అమలు చేయాలని కోరుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ (యుఎన్‌జిఏ) సమావేశంలో మెక్సికో ప్రవేశపెట్టిన ముసాయిదా తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ భారతదేశం ఓటు వేసింది. కాగాఈ ముసాయిదాకు అనుకూలంగా 133 దేశాలు ఓటు వేయగా, వ్యతిరేకిస్తూ 33 దేశాలు ఓటు వేశాయి. మరో 16 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉండిపోయాయి. భారత్‌తోపాటు బ్రహైన్, చైనా, ఈజిప్టు, ఇరాన్, ఇరాక్, జపాన్, కువైత్, మాల్దీవులు, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీఅరేబియా, అమెరికా తదితర దేశాలు ఈ తీర్మానాన్ని వ్యతిరేకించాయి. అదేపనిగా మరణశిక్షలు అమలు చేయడంపై ఈ తీర్మానం ఆందోళన వ్యక్తం చేసింది. అన్ని దేశాలు తమ తమ అంతర్గత పరిస్థితులకు అనుగుణంగా సొంత న్యాయపరమైన వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవాలని తీర్మానం కోరింది. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా తగిన జరిమానాల వ్యవస్థను అభివృద్ధి చేయాలని తీర్మానం కోరింది. దేశాలు మరణశిక్షలపై నిషేధాలు అమలు చేసుకోవాలని పిలుపు ఇచ్చింది. మరణశిక్షను పూర్తిగా రద్దుచేసే దృక్పథంతో ఈ విధానాలను అభివృద్ధి చేయాలని తీర్మానం కోరింది. దేశాలు మరణశిక్షలు తగ్గిస్తున్నప్పటికీ, 2025లో మరణశిక్షలు పెరిగాయి. మరణశిక్షలను రద్దుచేయడంలో ఉరిశిక్షలపై తాత్కాలిక నిషేధం విధించాలని తీర్మానం కోరింది.

26న కలెక్టరేట్ల వద్ద ధర్నా

ప్రజాపక్షం, న్యూస్ బ్యూరో/హైదరాబాద్: బికెఎమ్‌యు జాతీయ సమితి పిలుపు మేరకు ఈ నెల26న దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలకొండ కాంతయ్య తెలిపారు. వ్యవసాయ కార్మికులు గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, వివిజి రాంజీ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి రూ 2 లక్షల కోట్లను కేటాయించాలని, సంవత్సరానికి 200 రోజులు పని దినాలను కల్పించి, రోజుకు రూ 700ల వేతనం ఇవ్వాలని, పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధి హామీ కూలీలకు పెండింగ్ లేకుండా వారం వారం వేతనాలు ఇవ్వాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ పేదలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వృద్ధులకు రూ. 4వేల పెన్షన్, వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంవత్సరానికి రూ 12 వేలు ఇవ్వాలని, మహిళలకు రూ. 2500 ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఒప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుతో తెలంగాణలోని వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగు నీటి అవసరాలకు గ్రావిటీ ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని సిఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీకి తెలియజేశారు.

పిఆర్‌ఎల్‌ఐఎస్, ఎన్‌ఎస్‌ఎంపి లకు పర్యావరణ, ఇతర అనుమతులు ఇవ్వండి

డాక్టర్ ఎస్.జైపాల్ రెడ్డి పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పిఆర్‌ఎల్‌ఐఎస్), సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు (ఎస్‌ఎస్‌ఎంపి), డిండి ఎత్తిపోతల పథకం (డిఎల్‌ఐఎస్)లపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వ్యయం చేసినా పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో తాగు నీటి ప్రయోజనాలు అందదండలేదని ప్రధానికి సిఎం వివరించారు. పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చినందున ఏమాత్రం ఆలస్యం లేకుండా పర్యావరణ, ఇతర అనుమతులు ఇచ్చేలా చూడాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

నమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌ఘడ్ నుంచి ఎన్‌ఓసి జారీ అయ్యేలా చూడండి

నమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌ను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి (సిడబ్ల్యూసి) సమర్పించామని ప్రధానికి సిఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ప్రాజెక్టుతో ఛత్తీస్‌ఘడ్‌లో ముంపునకు గురయ్యే భూమి, గ్రామాల వివరాలను అంచనాకు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్), బ్యాక్ వాటర్ స్థాయి గుర్తింపుతో కూడిన సమగ్ర సర్వేకు రూ.9.88 కోట్లు చెల్లించిన విషయాన్ని ప్రధాని దృష్టికి సిఎం తీసుకెళ్లారు. ఛత్తీస్‌ఘడ్‌కు భూపరిహారం చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసి) త్వరగా జారీ అయ్యేలా చూడాలని ప్రధానికి సిఎం విజ్ఞప్తి చేశారు. ప్రధాన మంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఇంటిగ్రేటెడ్ సమ్మక్క సాగర్ ప్రాజెక్టుసీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకాకొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు మంజూరు చేయాలని ప్రధాని సిఎం రేవంత్ రెడ్డి కోరారు.

తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేయండి

మూలధన పెట్టుబడి కోసం రాష్ట్రాలకు ప్రత్యేక సహాయ పథకం (సాస్కీ) కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 70 నుంచి 90 శాతం మేరకు పూర్తయిన ప్రాజెక్టులకు ఈ నిధులు వినియోగించుకుంటామని సిఎం తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిధులు మంజూరు చేస్తే కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరించిన ఆయకట్టుకు సాగు నీరు సరఫరా చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఫలితంగా రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని సిఎంకు సిఎం వివరించారు.

శీతాకాల సమావేశాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదింపజేయడానికి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నాలు జరుపుతోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయనుంది. పార్లమెంట్ సమావేశాలపై కొన్ని వర్గాలు పిటిఐకి సమాచారం అందించాయి. దాని ప్రకారం... ఈ సమావేశాలకు డిసెంబర్ మొదటి వారమే సరైన సమయంగా కనిపిస్తోంది. ప్రభుత్వ అత్యున్నత స్థాయిలలో సాధ్యమయ్యే తేదీలపై చర్చలు జరిగాయి. అయితే, ఈ కీలకమైన చట్టానికి అవసరమైన సంఖ్యాబలాన్ని సాధించడం సవాలుగా మారవచ్చు. ఈ బిల్లుకు లోక్‌సభలో మూడింట రెండు వంతుల మెజారిటీ, అంటే ప్రస్తుత 543 మంది సభ్యుల సభలో 361 ఓట్లు అవసరం. మూడు ఖాళీలతో, ప్రస్తుతం సభలో 540 మంది సభ్యులు ఉన్నారు. అధికార ఎన్‌డిఎలో 320 మంది సభ్యులు ఉన్నారు. కనీస మెజారిటీని దాటడానికి వారికి ప్రతిపక్ష పార్టీల మద్దతు అవసరం. రాజకీయ సవాలు కేవలం సంఖ్యాబలానికే పరిమితం కాలేదు. సర్‌కు వ్యతిరేకంగా తమ ప్రచారాన్ని ముమ్మరం చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు, తమ నిరసనలను పార్లమెంటుకు తీసుకువెళ్లే అవకాశం ఉంది. ఇది మరో వాడివేడి సమావేశానికి దారితీయవచ్చు. సభ క్రమబద్ధంగా పనిచేస్తే తప్ప రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ, ఓటింగ్ సాధ్యం కాదని అధికార కూటమికి చెందిన ఒక ఎంపి అన్నారు. అయితే, సంఖ్యాబలపు అడ్డంకిని అధిగమిస్తామని ప్రభుత్వం ధీమాగా ఉంది. ఈ బిల్లు 15 నుంచి 18 ఓట్ల మెజారిటీతో ఆమోదం పొందుతుందని గురువారం ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, వర్షాకాల సమావేశాలను అధికారికంగా వాయిదా వేయకుండా కొనసాగించాలన్న ప్రభుత్వ నిర్ణయం, తదుపరి సమావేశాల సమయం, నిర్వహణపై ఊహాగానాలను మరింత పెంచింది. వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. 2008లో నమోదైన 87 రోజుల మునుపటి రికార్డును అధిగమిస్తూ, ఈ సమావేశాలు 94 రోజులుగా వాయిదా పడకుండా కొనసాగుతున్నాయి. ప్రస్తుత సమావేశాలను పొడిగించడానికి కనీసం రెండు రోజుల నోటీసు అవసరం కాగా, కొత్త సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి కనీసం 14 రోజుల నోటీసు అవసరం. నియోజకవర్గాల పునర్విభజన పరిణామాలపై, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో ఉన్న ఆందోళనలను పరిష్కరించేందుకు, రాష్ట్రాల వ్యాప్తంగా లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచే ఒక ఫార్ములాను ప్రభుత్వం అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా ప్రస్తుతం ఉన్న అంతర్‌రాష్ట్ర సీట్ల వాటాను కూడా ఈ ప్రతిపాదిత చట్టంలో కొనసాగించనున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. ఏప్రిల్ 17న జరిగిన పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో ఈ ప్రతిపాదిత చట్టానికి అవసర మైన సంఖ్యాబలం చేకూరలేదు. దీంతో శీతాకాల సమావేశాల్లో దీని భవితవ్యం ప్రభుత్వానికి ఒక కీలక రాజకీయ, శాసనపరమైన పరీక్షగా మారింది.



మళ్లీ కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

అణచివేయాలని చూస్తున్న పాలకుల ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు.

తెలంగాణ గడ్డపై నిజాం నిరంకుశ పాలన,రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా సాగిన వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ దేశంలో మత ఘర్షణలు సృష్టించి, ప్రజలను మతాల పేరుతో విభజించి పాలించాలని బిజెపి ప్రయత్నిస్తోందని బృందాకరత్ విమర్శించారు. ఇలాంటి విభజన రాజకీయాలు సాగవని, చారిత్రక వాస్తవాలను వక్రీకరించే బిజెపి ఆటలు ఇక సాగనివ్వబోమని నల్లగొండ గడ్డ నుంచి హెచ్చరించారు.

మోదీ పాలనలో రైతులకు తీరని ద్రోహం : జాతీయ కార్యదర్శి విజ్జూ కృష్ణన్

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ద్రోహం చేసిందని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కార్యదర్శి విజ్జూ కృష్ణన్ విమర్శించారు.రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కల్పిస్తామని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందన్నారు.గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా ఐదు లక్షలకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభ తీవ్రతకు నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గడ్డపై సాగిన వీరోచిత సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని విజ్జూ కృష్ణన్ పిలుపునిచ్చారు.

దేశవ్యాప్త రైతు ఉద్యమాలకు నల్లగొండ వేదిక కావాలి : ఆహ్వాన సంఘం అధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి

భవిష్యత్తులో దేశవ్యాప్త రైతు ఉద్యమాలకు నల్లగొండ వేదిక కావాలని ఎఐకెఎస్ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆకాంక్షించారు. రైతు వ్యతిరేక విధానాల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండలో నిర్వహిస్తున్న ఎఐకెఎస్ జాతీయ మహాసభలు దేశవ్యాప్తంగా రైతు ఉద్యమాలకు భవిష్యత్తు కార్యాచరణను నిర్దేశించేలా ఉండాలని అన్నారు. మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన అగ్రి షోలో 200 స్టాళ్ల ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని జూలకంటి రంగారెడ్డి తెలిపారు.

ఈ బహిరంగ సభలో ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే, రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ రావు, కార్యదర్శి తీగల సాగర్ వ్యవసాయం కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి వెంకట్,మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చేరుపల్లి సీతారాములు ప్రజా సంఘాల నాయకులు సాయిబాబా, మల్లు లక్ష్మి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి ఐలయ్య, పాలగుడు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

రైతు మహాప్రదర్శనతో దద్దరిల్లిన నల్లగొండ

జిల్లా కేంద్రం మరోమారు ఎర్రజెండాల రెపరెపలతో, రైతు నినాదాలతో ఎరుపెక్కింది. ఎన్నో ఉద్యమాలకు ఊపిరిపోసిన ఖిల్లా చరిత్రలో ఎన్నో ప్రజా పోరాటాలకు వేదికైన నల్లగొండ మరోసారి ఎర్రజెండాల రెపరెపలతో పులకించిపోయింది. అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా నల్లగొండ పట్టణంలో అదివారం నిర్వహించిన రైతుల మహాప్రదర్శన అట్టహాసంగా సాగింది. వేలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని తమ ఐక్యతను చాటుకున్నారు. రైతాంగ ఐక్యతను చాటుతూ సాగినతీ మహాప్రదర్శనలో సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ మహాప్రదర్శన మహాసభలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

పదార్థమైన డ్రై ఈస్ట్‌ను ఆన్‌లైన్‌లో తెప్పించి నాటుసారా తయారీకి ఉపయోగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. అంతేకాకుండా తయారీ కేంద్రాల్లో కాకుండా పత్తి, మిరప పంట పొలాల్లో ద్రావకాలను రహస్యంగా నిల్వ చేస్తూ కొద్దికొద్దిగా నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు కనుగొన్నారు.

కివీస్‌తో ఐదో వన్డేలో ఘనవిజయం

సిరీస్ భారత్ వశం

న్యూజిలాండ్ పర్యటనలో టీమిండియా మరో సిరీస్‌ను 3–1తో కైవసం చేసుకుంది. ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ గెలుచుకుంది. తొలి రెండు వన్డేల్లో భారత్ గెలవగా, మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. నాలుగో మ్యాచ్‌తో కివీస్ గెలిచిన విషయం తెలిసినదే. గత మ్యాచ్‌లో ఎదురైన ఘోర పరాభావం నుంచి టీమిండియా త్వరగానే తేరుకుంది. ఆదివారం మౌంట్మాంగనూయి వేదికగా జరిగిన లోస్కోరింగ్ గేమ్‌లో టీమిండియా 22 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 42.1 ఓవర్ల లో 209 పరుగులకు కుప్పకూలింది. అక్షర్ పటేల్ (55 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌లతో 46), ఇషాన్ కిషన్(58 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 46) టాప్ స్కోరర్లుగా నిలిచారు. న్యూజిలాండ్ బౌలర్ల లో జాకోబ్ డఫీ(3/60), మిచెల్ సాంట్నర్ (3/47) మూడేసి వికెట్లు తీయగా.. మాథ్యూ ఫిషర్(2/28) రెండు వికెట్లు పడగొట్టాడు. బ్లెయిర్ టిక్నర్, మైఖేల్ బ్రేస్వెల్ తలో వికెట్ తీసారు.

అనంతరం న్యూజిలాండ్ 48.1 ఓవర్లలో 187 పరుగులకు కుప్పకూలి ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. డీన్ ఫాక్స్క్రాఫ్ట్(42 బంతుల్లో 5 ఫోర్లతో 31), మిచెల్ సాంట్నర్(31 బంతుల్లో ఫోర్, 2 సిక్స్‌లతో 24), నిక్ కెల్లీ(45 బంతుల్లో 2 ఫోర్లతో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అర్ష్‌దీప్ సింగ్ (3/30) మూడు వికెట్లు తీయగా.. మహమ్మద్ సిరాజ్(2/50), అక్షర్ పటేల్(2/28) రెండేసి



వికెట్లు పడగొట్టారు. ఆకిబ్ నబీ(1/37), యశ్ ఠాకూర్, నమన్ ధీర్ తలో వికెట్ తీసారు.

చరిత్ర సృష్టించిన భారత్..

ఈ సిరీస్ విజయంతో టీమిండియా చరిత్ర సృష్టించింది. న్యూజిలాండ్ గడ్డపై తొలిసారి వరుసగా టి–20, వన్డే సిరీస్‌ను కైవసం చేసుకుంది. అంతే కాకుండా గత ఏడేళ్లుగా సొంతగడ్డపై ఒక్క వన్డే సిరీస్ కూడా ఓడిపోని న్యూజిలాండ్ విజయాల పరంపరకు బ్రేక్ వేసింది. గత 7 ఏళ్లలో ఆ జట్టు వరుసగా 11 సిరీస్‌లు గెలిచింది. వన్డే క్రికెట్ చరిత్రలోనే న్యూజిలాండ్ గడ్డపై అత్యల్ప స్కోర్ డిఫెండ్ చేసుకున్న జట్టుగానూ భారత్ చరిత్రకెక్కింది.

గెలిపించిన బౌలర్లు..

210 పరుగుల లక్ష్యంతో భారత్ ఈ మ్యాచ్ గెలవడం చాలా కష్టమని అంతా అనుకున్నారు. కానీ భారత బౌలర్లు అద్భుతమైన ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్ని అందించారు. పిచ్ నుంచి లభించిన సహకారాన్ని అందిపుచ్చుకొని నిప్పులు చెరిగారు. గత మ్యాచ్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిన టీమ్ సీఫెర్ట్(14), విల్ యంగ్‌ను అర్ష్‌దీప్ సింగ్, సిరాజ్‌లు పెవిలియన్ చేర్చగా.. నిక్ కెల్లీ, ఫిన్ అలెన్లను ఈ ఇద్దరూ అద్భుతమైన ఇన్‌స్వింగర్లతో క్లీన్ బౌల్ చేశారు. మైఖేల్ బ్రేస్వెల్(19)ను ఆకిబ్ నబీ ఔట్ చేయగా.. ఆచితూచి ఆడిన డానీ ఫాక్స్ క్రాఫ్ట్‌ను యశ్ ఠాకూర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ 119 పరుగులకే 6 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో మిచెల్ సాంట్నర్(24), క్రిస్టియన్ క్లార్క్(16) జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ నమన్ ధీర్ సాంట్నర్‌ను పెవిలియన్ చేర్చాడు. క్లార్క్‌ను అర్ష్‌దీప్‌సింగ్ ఔట్ చేయగా.. జాకోబ్ డఫీ, టిక్నర్‌ను అక్షర్ పటేల్ పెవిలియన్ చేర్చి భారత విజయ లాంఛనాన్ని లాంఛనంగా పూర్తి చేశాడు.

చరిత్ర సృష్టించిన లక్ష్య సేన్!

భారత యువ షట్లర్ లక్ష్య సేన్ చరిత్ర సృష్టించాడు. జపాన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్ 500 టోర్నీలో విజేతగా నిలిచాడు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన తొలి భారత షట్లర్‌గా రికార్డ్ సాధించాడు. ఆదివారం జరిగిన పురుషుల ఫైనల్లో లక్ష్య సేన్ 13–21, 21–18, 21–14 తేడాతో జపాన్ షట్లర్ కొకి వతనబైను ఓడించాడు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో లక్ష్య సేన్ తొలి గేమ్‌ను కోల్పోయాడు. ఆతిథ్య జపాన్ షట్లర్ సత్తా చాటడంతో లక్ష్య సేన్ తేలిపోయాడు. తర్వాత వరుసగా రెండు గేమ్స్ గెలిచి టైటిల్‌ను అందుకున్నాడు. రెండో గేమ్‌లో కొకి నుంచి ప్రతి ఘటన ఎదురైనా.. లక్ష్యసేన మాత్రం వెనకడుగు వేయలేదు. తనకే సాధ్యమైన ఆటతీరుతో కొకిని మట్టికరిపించాడు. మూడో గేమ్‌లో లక్ష్యసేన్‌కు తిరుగే లేకుండా పోయింది. ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించి సునాయసంగా విజయాన్నందుకున్నాడు. ఈ విజయంతో వతనబైతో ముఖాముఖి పోరును లక్ష్యసేన్ 4–2గా మార్చుకున్నాడు. ఈ విజయంతో లక్ష్యసేన్ వరుసగా రెండు బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టైటిళ్లను గెలిచినట్లు అయ్యింది. ఈ టోర్నీకి ముందు లక్ష్యసేన్ హైలో ఓపెన్ గెలిచిన సంగతి తెలిసిందే. ఈ విజయంతో లక్ష్య సేన్ హాంగ్‌కాంగ్‌లో జరగనున్న బీడబ్ల్యూఎఫ్ వరల్ టూర్ ఫైనల్స్ బెర్త్‌కు చేరువయ్యాడు. తాజా జపాన్ మాస్టర్స్‌కు ముందు 8వ సీడ్ అయిన లక్ష్య



సేన్ 64,890 పాయింట్లతో రేస్ టు ఫైనల్స్ స్టాండింగ్‌సలో 12వ స్థానంలో ఉన్నాడు. ఈ సీజన్ ఫైనల్‌కు అర్హత సాధించాలంటే టాప్8లో నిలవాలి. జపాన్ సూపర్ 500 టోర్నీ గెలవడం ద్వారా లక్ష్య సేన్‌కు 9,200 పాయింట్స్ లభించాయి. దాంతో స్టాండింగ్స్ అప్డేట్ అయినప్పుడు లక్ష్య 74,180 పాయింట్లతో 6వ స్థానంలో నిలిచే అవకాశం ఉంది. నవంబర్ 17–22 మధ్య జరిగే హాంకాంగ్ ఓపెన్ పూర్తయిన తర్వాతే రేస్ టు హాంగజ్ ముగియనుంది.

ఆరోగ్యం

వృద్ధాప్యాన్ని జయించే వ్యాక్సిన్!

వృద్ధాప్యంపై పరిశోధనలు చేస్తున్న జపాన్‌లోని జుంటెండో యూనివర్సిటీ, ఒసాకా యూనివర్సిటీలకు చెందిన సైంటిస్టులు ఒక వినూత్నమైన 'పెప్‌టైడ్' వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. 'నేచర్ ఏజింగ్' జనరల్‌లో ప్రచురితమైన ఈ పరిశోధనా వ్యాసం ప్రకారం, వృద్ధాప్యం కారణంగా దెబ్బతిన్నప్పటికీ చనిపోకుండా శరీరంలో పేరుకుపోయే 'జాంబీ కణాలను' గుర్తించి నాశనం చేసేలా రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇవ్వడం ఈ వ్యాక్సిన్ లక్ష్యం. మనిషి వయసు పెరిగేకొద్దీ శరీరంలోని కొన్ని కణాలు దెబ్బతింటాయి. సాధారణంగా ఇలాంటి కణాలు విభజనను ఆపివేస్తాయి. అయితే, అవి చనిపోకుండా శరీరంలోనే ఉండిపోవచ్చు. ఈ స్థితిని కణ వృద్ధాప్యం (సెల్యులార్ సెనెసెన్స్) అంటారు. ఇలాంటి కణాలను శాస్త్రవేత్తలు అనధికారికంగా 'జాంబీ కణాలు' అని పిలుస్తారు. ఇవి రక్తనాళాలు, కీళ్లు, ఇతర అవయవాల్లో పేరుకుపోయి, వాపును ప్రేరేపించే రసాయన పదార్థాలను విడుదల చేయగలవు. ఈ పదార్థాలు చుట్టుపక్కల ఉన్న ఆరోగ్యకరమైన కణాలను దెబ్బతీయడంతో పాటు, వయస్సుతో సంబంధం ఉన్న కొన్ని వ్యాధులకు దోహదపడవచ్చు. ప్రొఫెసర్ తోహ్రూ మినామినో నేతృత్వంలోని పరిశోధక బృందం 'జిపిఎన్‌ఎంబి' అనే ఉపరితల ప్రొటీన్‌పై దృష్టి సారించింది. వృద్ధాప్యానికి గురైన కొన్ని రక్తనాళాల కణాల్లో, అథెరోస్క్లెరోసిస్ కారణంగా ఏర్పడే ధమనుల ఫలకాలలో ఈ ప్రోటీన్ అధికంగా కనిపించినట్లు పరిశోధకులు గుర్తించారు. అథెరోస్క్లెరోసిస్ అంటే ధమనుల గోడల్లో కొవ్వు పదార్థాలు, కొలెస్ట్రాల్ తదితర పదార్థాలు పేరుకుపోయి ఫలకాలు ఏర్పడే పరిస్థితి. దీనివల్ల రక్తప్రసరణకు ఆటంకం కలగవచ్చు. జిపిఎన్‌ఎంబి ప్రొటీన్‌ను లక్ష్యంగా చేసుకుని పనిచేసేలా రూపొందించిన వ్యాక్సిన్‌ను వయసు మళ్లిన ఎలుకలకు ఇచ్చినప్పుడు, వాటి రోగనిరోధక వ్యవస్థ సంబంధిత ప్రతిరక్షకాలను (యాంటీబాడీస్) ఉత్పత్తి చేసింది. ఈ ప్రతిరక్షకాలు లక్ష్యంగా పెట్టుకున్న కణాలను గుర్తించి తొలగించడానికి సహాయపడ్డాయి. పరిశోధకులు నివేదించిన ప్రయోగాత్మక ఫలితాల ప్రకారం, ఈ విధానం వల్ల ఎలుకల్లో రక్తనాళాల గట్టిపడటం తగ్గింది. జీవక్రియల ఆరోగ్యం మెరుగుపడింది. ఫలితంగా, ఆయుష్షు పెరగడం వంటి ప్రయోజనాలు కనిపించాయి. వృద్ధాప్యంతో సంబంధం ఉన్న వ్యాధులను కేవలం వాటి లక్షణాలకు చికిత్స చేయడం ద్వారా కాకుండా, వాటికి దోహదపడే కణస్థాయి ప్రక్రియలను లక్ష్యంగా చేసుకుని ఎదుర్కోవచ్చా అనే ప్రశ్నకు ఈ పరిశోధన కొత్త దిశను చూపుతోంది. భవిష్యత్తులో ఇటువంటి విధానాలు మనుషుల్లోనూ సురక్షితంగా, ప్రభావవంతంగా పనిచేస్తాయని నిరూపితమైతే, గుండె సంబంధిత వ్యాధులు, జీవక్రియల సమస్యలు, వృద్ధాప్యంతో ముడిపడిన ఇతర ఆరోగ్య సమస్యలపై పరిశోధనలకు కొత్త అవకాశాలు ఏర్పడవచ్చు. అయితే, ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ ఫలితాలు ఎలుకలపై నిర్వహించిన ప్రయోగాలకు సంబంధించినవి. మనుషుల్లోనూ ఇదే ప్రయోజనాలు లభిస్తాయని, ఆయుష్షు పెరుగుతుందని లేదా వృద్ధాప్యాన్ని నిలిపివేయవచ్చని ప్రస్తుతం నిర్ధారించలేం. దానికి మరిన్ని పరిశోధనలు, మరింత తగ్గిం భద్రతా పరీక్షలు, చడం సరైన పరి మానవ క్లినికల్ స్కారం కాదు. రోజుకు 79 ట్రయల్స్ అవసరం. గంటలు నిద్రపోవడం, క్రమం తప్పకుండా నడవడం, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయడం, ప్రోటీన్లు, పీచుపదార్థాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం ప్రయోజనకరం. విశ్రాంతికి సమయం కేటాయించడం, శ్వాసపై దృష్టి పెట్టే సాధనలు చేయడం కూడా ఒత్తిడిని నిర్వహించడంలో సహాయపడతాయి. అయితే, బరువు పెరగడానికి ఒత్తిడి ఒక్కటే కారణం కాదని గుర్తుంచుకోవాలి. థైరాయిడ్ సమస్యలు, కొన్ని మందులు, ఇతర ఆరోగ్య పరిస్థితులు కూడా కారణం కావచ్చు. అకస్మాత్తుగా బరువు పెరిగినా, శరీరంలో వాపు కనిపించినా వైద్యుడిని సంప్రదించాలి.



దీర్ఘకాలిక ఒత్తిడితో అధిక బరువు?

దీర్ఘకాలిక ఒత్తిడి శరీర బరువుపై ప్రభావం చూపుతుంది. తక్కువ ఆహారం తీసుకుంటున్నప్పటికీ బరువు పెరుగుతున్నట్లు అనిపిస్తే, ఆహారం తోపాటు నిద్ర, శారీరక చురుకుదనం, హార్మోన్ల పనితీరును కూడా పరిశీలించాలి. ఒత్తిడిని ఎదుర్కోవడానికి శరీరానికి సహాయపడే హార్మోన్ కార్టిసాల్. ఇది రక్తంలో గ్లూకోజ్‌ను అందుబాటులో ఉంచి, శరీరానికి అవసరమైన శక్తిని సమకూరుస్తుంది. అయితే, దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి వంటి పరిస్థితులు ఈ హార్మోన్ నియంత్రణను ప్రభావితం చేయవచ్చు. కార్టిసాల్ స్థాయిలు ఎక్కువకాలం అధికంగా ఉంటే, ముఖ్యంగా పొత్తికడుపు చుట్టూ కొవ్వు పేరుకునే ప్రమాదం పెరగవచ్చు. ఒత్తిడితో సంబంధం ఉన్న హార్మోన్ల మార్పులు కొంద రిలో శరీర ద్రవాల సమతుల్యతను ప్రభావితం చేయవచ్చు. దీనివల్ల ముఖం ఉబ్బడం, వేళ్లకు ఉంగరాలు బిగుతుగా అనిపించడం, తక్కువ సమయంలో బరువు పెరగడం వంటి లక్షణాలు కనిపించవచ్చు. అయితే, ప్రతి సందర్భం లోనూ దీనికి ఒత్తిడే కారణం కాదు. దీర్ఘకాలిక ఒత్తిడి, నిద్రలేమి, శారీరక శ్రమ తగ్గడం వంటివి రక్తంలో చక్కెర నియంత్రణను, ఇన్సులిన్ సున్నితత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. ఇవి బరువు నిర్వహణను కష్టతరం చేయవచ్చు. తీవ్రమైన



లేదా దీర్ఘకాలిక ఒత్తిడి కండరాల ఆరోగ్యంపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. కేవలం ఆహారాన్ని తగ్గించడం లేదా వ్యాయామాలు చేయడం, ప్రోటీన్లు, పీచుపదార్థాలు సమృద్ధిగా ఉండే సమతుల్య ఆహారం తీసుకోవడం ప్రయోజనకరం. విశ్రాంతికి సమయం కేటాయించడం, శ్వాసపై దృష్టి పెట్టే సాధనలు చేయడం కూడా ఒత్తిడిని నిర్వహించడంలో సహాయపడతాయి. అయితే, బరువు పెరగడానికి ఒత్తిడి ఒక్కటే కారణం కాదని గుర్తుంచుకోవాలి. థైరాయిడ్ సమస్యలు, కొన్ని మందులు, ఇతర ఆరోగ్య పరిస్థితులు కూడా కారణం కావచ్చు. అకస్మాత్తుగా బరువు పెరిగినా, శరీరంలో వాపు కనిపించినా వైద్యుడిని సంప్రదించాలి.

ధరల నియంత్రణకు కఠిన చర్యలు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్
రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
బియ్యం ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ 17న హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు



ప్రజాపక్షం/హనుమకొండ : రాష్ట్రంలో విపరీతంగా పెరిగిన బియ్యం, నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వం తక్షణమే అదుపు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బియ్యం ధరల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని కోరారు. బియ్యం తదితర నిత్యవసర వస్తువులను అక్రమంగా నిలువ చేసిన వ్యాపారస్తులపై పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన హనుమకొండ జిల్లా సమితి, సిపిఐ శాఖ కార్యదర్శుల సమావేశంలో తక్కళ్లపల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ మార్కెట్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటడంతో సామా న్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల పేద ప్రజల బతుకు భారంగా మారిందన్నారు. బియ్యం ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హనుమకొండ జిల్లావ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలపై ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రజా పంపిణీ వ్యవస్థ, రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు పప్పు లు, వంట నూనె, చక్కెర తదితర అన్ని రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీపై సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తక్కళ్లపల్లి హెచ్చరించారు. సమావేశానికి సిపిఐ నాయకులు నేదునూరి రాజమౌళి అధ్యక్షత వహించగా సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కరె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అధరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులు కరె లక్ష్మణ్, బత్తిని సదానందం, డాక్టర్ పల్లేరు వీరాస్వామి, వివిధ మండలాల, పట్టణ శాఖ కార్యదర్శులు అశోక్ స్టాలిన్, మాలోతు శంకర్, దుప్పటి సాంబయ్య, కొట్టెపాక రవి, జక్కు రాజు గౌడ్, వేల్పుల సారంగపాణిలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలపై

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హనుమకొండ : విద్యారంగ సంస్కరణలపై ఏకపక్ష నిర్ణయాలు సరికాదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఎఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా సమితి సమావేశం బాలసముద్రంలోని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా పుట్ట లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై విద్యారంగంలో తీసుకువస్తున్న సంస్కరణలపై విద్యాశాఖ మంత్రి, సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ చేయాలన్నారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోను, ఎన్నికల మ్యానిఫెస్టోలో మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి నేడు ఇంటర్‌బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యా గందరగోళంగా ఉందని, సరిపడ తరగతి గదులు, మౌలిక సదుపాయాలు లేవని, ఇప్పుడు పాఠశాల విద్యలో ఇంటర్‌ను విలీనం చేయడం వల్ల సమస్యలు పెరిగే అవకాశం ఉందన్నారు. ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం ద్వారా ఉన్న ప్రభుత్వ కళాశాల భవనాలల్లో ఏ విద్య ఉంటుంది? ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధంగా ఇంటర్ తరగతుల నిర్వహణ చేస్తారు? ఒకే చోట 1నుండి 12వ తరగతి వరకు తరగతుల నిర్వహణ, బోధన సిబ్బంది అర్హతలపై వివరాలు వెల్లడించాలన్నారు. హడావుడి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ వారికి మేలు జరుగుతుంది తప్పా విద్యార్థులకు, ప్రభుత్వ విద్యకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ, బడ్జెట్‌లో విద్యకు అధిక నిధులు, ప్రభుత్వ విద్య బలోపేతం వంటి అంశాలపై విద్యా కమిషన్ రిపోర్ట్ ఇచ్చినా, ప్రభుత్వం ఆ రిపోర్ట్‌ను పెండింగ్‌లో పెట్టి నిరక్ష్యం చేస్తుందని ఆరోపించారు. మూడేళ్లుగా విద్యాశాఖను తన వద్ద పెట్టుకున్న సిఎం ఒక్కరోజు కూడా విద్యార్థి సంఘాలతో చర్చించలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం, ప్రైవేట్ విద్యను అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి భాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, కొండ చరణ్ జిల్లా సహాయకార్యదర్శిలు సాయి గౌడ్, పంశీ, నాగరాజ్, శ్రీహర్ష, సభ్యులు రామ్ చరణ్, రణధీర్, సునీల్, హర్ష, తోపాటు వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



అసైన్డ్ భూములపై దళితులకు హక్కులు కల్పించాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్

ప్రజాపక్షం/ఖమ్మం : అసైన్డ్ భూములపై దళితులకు హక్కులు కల్పించాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిహెచ్‌పిఎస్ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లి ఏసు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏసురత్నం మాట్లాడుతూ గతంలో పంచిన అసైన్డ్ భూములను రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని, అసైన్డ్ భూములకు పూర్తి స్థాయి హక్కులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో దళితులను బెదిరించి కొందరు పారిశ్రామికవేత్తలు, వ్యాపారవర్గాలు అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్నారని, లేదా కొద్దో గొప్పో ముట్టజెప్పి తమ పరం చేసుకున్నారని, అటువంటి భూములను సర్వే చేయించి తిరిగి దళితులకు అప్పగించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కేవలం సాగు చేసుకునే హక్కు కాకుండా ఆ భూమిపై రుణాలు పొందే అవకాశాన్ని దళితులకు ప్రభుత్వం కల్పించాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు తప్పుదారిపడుతున్నాయని, ఆ నిధులను ఆయావర్గాల అభ్యున్నతికి కేటాయించి ఖర్చు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అట్టడుగువర్గాల అభ్యున్నతి కోసం దళిత హక్కుల పోరాట సమితి అనేక పోరాటాలు చేసిందని ఆయన తెలిపారు. దళిత వర్గాలను చైతన్యం చేసే ప్రధాన లక్ష్యంతో దళిత హక్కుల పోరాట సమితి 2006 అక్టోబర్‌లో విశాఖపట్నంలో ఆవిర్భవించిందన్నారు. ఈనెల 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే డిహెచ్‌పిఎస్ 20వ వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి హాజరు కాగా డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యదర్శి యంగల ఆనందరావు, నాయకులు యమాల గోపాలరావు, తడికమళ్ల ఏసోబు, నారపోగు వసంతరావు, మామిడాల కిరణ్, జిల్లా లింగయ్య, తోటపల్లి సీతారాములు, సృజన, వరదా నర్సింహారావు, ప్రకాశరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



శ్రమకు తగ్గ ఫలితం చెల్లించాలి

ఓబి కార్మికుల సమ్మెపై సింగరేణి కార్మికశాఖ జోక్యం చేసుకోవాలి
సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కష్టపడి పని చేసే కార్మికుల శ్రమకు తగ్గ ఫలితం చెల్లించాలని, వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వెంకటేష్ ఖని కోల్‌మైన్ (వికెసిఎం) ఓపెన్‌కాస్ట్‌లో ఓవర్ బర్డెన్ (మట్టిపని) తీసే కాంట్రాక్టు కార్మికులు కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్షా శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన 20శాతం బోనస్ చెల్లించాలని ఇతర ఓబి కంపెనీల తరహాలో రోజుకు రూ.950 చొప్పున 26 రోజుల వేతనం, ఆదివారం డబుల్ మస్టర్ చట్టబద్ధ హక్కులు కల్పించాలని కోరారు. సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం మొండిగా వ్యవహరించడం తగదని, సమ్మెను విచ్చినం చేసే చర్యలకు పాల్పడటం సరైంది కాదని హితవు పలికారు. సమ్మె చేస్తున్న కారణంతో నలుగురు కార్మికులను విధుల నుండి తొలగించడం చట్ట విరుద్ధమని ఇలాంటి చర్యలను యాజమాన్యం మానుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే సింగరేణి యాజమాన్యం, కార్మికశాఖ చొరవతీసుకుని కార్మిక సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సాబీర్‌పాషా కోరారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు సలిగంటి శ్రీనివాస్ సలిగంటి శ్రీనివాస్,జి.వీరస్వామి. గట్టయ్య, మార్ష ల్ శ్రీను, మోహన్, సత్తార్, కట్టా ఉదయ్‌తో పాటు జెఎసి నాయకులు పాల్గొన్నారు.



'కార్పొరేషన్'లో పోటీ చేస్తాం

సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

ప్రజాపక్షం/జవహర్ నగర్ : రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సిపిఐ అభ్యర్థులు బరిలో ఉంటారని, కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి నడుం బిగించాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పిలుపునిచ్చారు. కాప్రా మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి ఉమామహేష్ హాజరై మాట్లాడారు. జవహర్ నగర్ అభివృద్ధిలో సిపిఐదే కీలక పాత్ర అన్నారు. జవహర్ నగర్‌లో అనేక బస్తీలను స్థాపించిన ఘనత పార్టీకే దక్కుతుందన్నారు. గతంలో ఇక్కడి ప్రజలు పార్టీని ఆదరించి ఎంపిటిసిలుగా, వార్డు మెంబర్లుగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు. ఆ చరిత్రను మరోసారి పునరావృతం చేయాలంటే కార్యకర్తలు స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీకి, తెలంగాణ పబ్లిక్ స్కూల్ సాధన కమిటీకి సిపిఐ కన్వీనర్‌గా ఉంటూ చురుగ్గా ఉద్యమాలను నిర్వహిస్తోందని ఆ

పుల్లెంలో ఉచిత వైద్య శిబిరం

200 మందికి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు




ప్రజాపక్షం/చండూరు : రవీత హాస్పిటల్ ఆధ్వర్యంలో చండూరు మండలం పుల్లెంల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 200మందికి ఉచితంగా వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. హాస్పిటల్ ప్రముఖ వైద్యులు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగిళ్ల రవితేజ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ హైమలత నేతృత్వంలో వైద్య బృందం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించింది. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వ్యాధి లక్షణాలను వివరించి ,తగిన సూచనలు చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్ ఎండి డాక్టర్ నాగిళ్ళ నర్సింహ్మా తెలిపారు. పుల్లెంల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన రవీత హాస్పిటల్ యాజమాన్యానికి గ్రామ సర్పంచ్ ముక్కాంల వెంకన్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండి డాక్టర్ నాగిళ్ల నర్సింహ్మా, సర్పంచ్ ముక్కాంల వెంకన్న , ఉప సర్పంచ్ సిహెచ్ ఊషయ్య , మాజీ ఎఫ్ఎస్సిఎస్ చైర్మన్ బొబ్బల శ్రీనివాస్ రెడ్డి, బొడ్డు సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

స్వర్ణగిరిలో కార్తీక సత్యనారాయణ వ్రతం



ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం స్వామివారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవ, మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవ, సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణ గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలోని అష్టలక్ష్మి మంటపంలో కార్తీక దామోదర హవనం అదేవిదంగా కార్తీకమాసం పురస్కరించుకుని వైభవ మంటపంలో శ్రీసత్య నారాయణస్వామి వ్రతం నిర్వహించారు. స్వామివారి నిత్యకళ్యాణోత్సవం అనంతరం సాయంత్రం సంధ్య వేళ ఆలయ ధ్వజస్తంభమునకు మోక్ష నారాయణ దీపాన్ని వెలిగించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు. భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

మురుగు కాలువలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



ప్రజాపక్షం/కోదాడ రూరల్ (చిలుకూరు) : చిలుకూరు మండలం ఆర్ల గూడెం గ్రామంలోని ఐదో వార్డులో మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ మురుగు కాల్వలో లీకేజీ కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. మురుగు కాల్వలో పైపులైన్ లీకేజీతో నీరు వృధా అవుతుండటంతో పాటు తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పథకాన్ని అమలు చేస్తుంది కానీ వార్డులో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీని అరికట్టడంతోపాటు పైపులైన్‌ను పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేయాలన్నారు. తాగునీటి నమూనాలను పరీక్షించి నీటి నాణ్యతపై ప్రజలకు భరోసా కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

హోరాహోరీగా కురుమ సంఘం ఎన్నిక



ప్రజాపక్షం/గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో మల్లికార్జున కురుమ సంఘం ఎన్నిక హోరాహోరీగా జరిగింది. గ్రామంలో కురుమ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో జరిగిన ఈ ఎన్నికల్లో అరిగే లక్ష్మయ్య భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అరిగే లక్ష్మయ్య మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి గెలిపించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కుల సంఘానికి నా వంతు న్యాయం చేస్తానని, సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి ఎల్లప్పుడు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘంలోని పెద్దల సలహాలతో, యువత సహకారంతో ముందుకు వెళ్తానని అన్నారు. అనంతరం బీరప్ప ఆల యం వద్ద కురుమ సంఘం నాయకులు రాష్ట్ర కురుమ సంఘం యువ చైతన్య కమిటి ఉపాధ్యక్షుడు కేమిడి ఉపేందర్‌ను శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో కురుమ సంఘం పెద్దలు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

ప్రజాపక్షం/నల్లగొండ(నార్కట్‌పల్లి): మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లకు సంబంధించిన మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఉమేష్ కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.నార్కట్ పల్లి,గోపలాయిపల్లి,ఏపీ లింగోటం, యెడవల్లి,పొతినేనిపల్లి గ్రామ పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత గ్రామాల లబ్ధిదారులందరూ నిర్ణీత సమయానికి కార్యక్రమానికి హాజరై పెన్షన్ మంజూరు పత్రాలను స్వీకరించాలని ఎంపీడీవో కోరారు.

కదలని ఎల్ఆర్ఎస్ ఫైల్స్

మున్సిపల్ కార్యాలయం చుట్టూ దరఖాస్తుదారుల ప్రదక్షిణ

అందుబాటులో ఉండని ఇన్‌చార్జి టిపిఒ

బిఐలను అడిగితే టిపిఒ లాగిన్‌లో పెండింగ్ అంటూ సమాధానం

సింగిల్‌విండో ఫైల్స్‌కే అధిక ప్రాధాన్యత



ప్రజాపక్షం/సూర్యాపేట : ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా వారికి ప్లాట్లు అమ్మకాలు జరపడంతో ఇండ్ల నిర్మాణానికి అనుమతులు రాకపోవడంతో ఏండ్ల తరబడి నుండి ఇబ్బందిపడుతున్నారు. ఇలాంటి వారి కోసం ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) తీసుకరావడమే కాకుండా 25 శాతం రుసుము తగ్గింపు చేసింది. దీనితో అనేక మంది తమ ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ముందుగా రూ.1000ల చాలానతో దాదాపు 35వేలకు పైగా దరఖాస్తులు చేసుకున్న వారు ఉన్నారు. ఈ ప్లాట్ల రెగ్యులరైజేషన్ గడువు నెల 30వ తేదీతో ముగుస్తుంది. కానీ సూర్యాపేట మున్సిపాలిటిలో నేటికి 6 నుండి 7వేల లోపు దరఖాస్తులను మాత్రమే టౌన్ ప్లానింగ్ అధికారులు పరిశీలించి రెగ్యులరైజ్ చేయగా మిగతా దరఖాస్తులన్ని పెండింగ్‌లోనే ఉన్నట్లు సమాచారం. రెగ్యులరైజేషన్ అయిన దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.20కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. మిగతా పెండింగ్‌లో ఉన్న 23వేలకు పైగా దరఖాస్తులను పరిష్కరిస్తే వచ్చిన ఆదాయానికన్నా మూడు రెట్లు అధికంగా వచ్చే అవకాశం ఉందని అధికారులే చెబుతున్నారు. దరఖాస్తుల క్లియరెన్స్‌కు రెండు లెవల్స్‌ను ప్రభుత్వం పెట్టగా ఎల్.1 బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ (బిఐ), ఎల్.2 టౌన్ ప్లానింగ్ అధికారి (టిపిఒ) ఉండగా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ప్లాట్ ఉన్న ప్రదేశానికి వెళ్ళి పరిశీలించిన తరువాత అన్ని పత్రాలను పరిశీలించి క్లియరెన్స్ ఇస్తూ ఎల్.2 టిపిఒ లాగిన్‌కు పంపడం జరుగుతుంది.

ఎల్ఆర్ఎస్ ఫైల్స్ ముందుకు కదలకపోవడంతో దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి (టిపిఒ) అందుబాటులో లేకపోవడం వల్లే పెండింగ్‌లో ఉన్నట్లు ఆ విభాగంలోని సిబ్బంది చెప్పకొస్తున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఇక్కడ పనిచేసిన టిపిఒ గత మూడు నెలల క్రితం ఏసిబికి పట్టుపడగ నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న మరొకరికి ఇంచార్జి బాధ్యతలను అప్పగించారు. వారంలో రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్న పరిస్థితి. ఈ విషయమై బిఐలను అడుగుతే తమ వద్ద ఫైల్స్ పెండింగ్‌లో ఏమి లేవని టిపిఒ లాగిన్‌లోనే పెండింగ్‌లో ఉన్నాయంటూ సమాధానం చెబుతున్నారు. అధికారులను నేరుగా కలిసి అంతో ఇంతో ముట్టచెబుతేనే తమ ఎల్ఆర్ఎస్ ఫైల్ క్లియర్ చేస్తున్నారని దరఖాస్తుదారులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మేము ఏమి ఇవ్వలేము ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఫీజు చెల్లిస్తామని అని చెబితే వినకుండా పెండింగ్‌లో పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎల్ఆర్ఎస్ ఫైల్స్‌ను పెండింగ్ లేకుండా క్లియర్ చేయాల్సి ఉన్నా వాటిని పక్కకు పెట్టి భవన నిర్మాణాలు, లేఅవుట్‌లు, ఇతర అనుమతులు (సింగిల్‌విండో ఫైల్స్‌కే) ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు క్లియర్ చేస్తే జి ప్లస్1కు రూ.10వేలు, జి ప్లస్2కు రూ.20వేల నుండి రూ.50వేలు అక్రమ ఆదాయం తమ జేబులకు వస్తుండడంతో వాటికే ప్రాధాన్యాత ఇస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు. సూర్యాపేట మున్సిపాలిటిలో పనిచేస్తున్న ఇద్దరు బిఐలు ఇద్దరూ కొత్తగా ఉద్యోగాల్లో చేరడంతో వారి సర్వీసు కూడా నేటికి రెగ్యులర్ కాలేదు. దీంతో వారికి పనిపై అంత పట్టులేదు. పైగా పైసా వసూళ్ళకే అన్న విధంగా వ్యవహరిస్తున్నట్లు ఉన్నతాధికారులకు అనేక ఫిర్యాదులు అందిన సందర్భాలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ ఎల్ఆర్ఎస్ పెండింగ్ ఫైల్స్‌ను క్లియర్ చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఎల్ఆర్ఎస్ ఫైల్స్ పెండింగ్ వాస్తవమే మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి



మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమేనని సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి చెప్పారు. ఫైల్స్ క్లియరెన్స్‌కు ఎవరైనా అక్రమంగా డబ్బులు అడిగితే తనకు నేరుగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ఫైల్స్ పెండింగ్, టౌన్ ప్లానింగ్ అధికారుల అక్రమ వసూళ్ళపై వస్తున్న ఆరోపణలపై ఆయనను వివరణ కోరగా పై విధంగా స్పందించారు. ఇక్కడ పనిచేసిన టౌన్ ప్లానింగ్ అధికారి మూడు నెలల క్రితం ఎసిబికి పట్టుపడడంతో ఆ పోస్టు ఖాళీగా ఉందన్నారు. నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్‌లో పనిచేస్తున్న ఒకరికి ఇంచార్జిగా ప్రభుత్వం అపాయింట్ చేయడంతో వారంలో రెండు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్‌కు గడువు తక్కువగా ఉన్నందున త్వరగా ఫైల్స్ క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.



ఆర్థిక భద్రతకు భరోసా పిఎన్‌బి మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ఆర్థిక భద్రతకు భరోసాగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ దోహదపడుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ సర్టిఫైడ్ ఫైనాన్స్ ఇమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ప్రస్తుతం నిత్య జీవితంలో ఇన్సూరెన్స్ భీమా అనేది వ్యక్తి ఆపదలు, ఆరోగ్య సమస్యలు కుటుంబాన్ని కాపాడే రక్షణ కవచమన్నారు. ఆర్థిక భద్రతకు స్థిరమైన కెరీర్ అని ఇన్సూరెన్స్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని అది మనకెంతో ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర సమయంలో ఇతరులపై ఆధారపడకుండా, కుటుంబానికి అండగా ఆర్థికంగా దోహదపడుతుందన్నారు. పిఎన్‌బి మెట్ లైఫ్ సర్టిఫైడ్ ఫినాన్స్ ఇమ్మడి రమేష్ మాట్లాడుతూ 12 సంవత్సరాలు పాలసీ కట్టిన వారికి రూ.60లక్షలు వస్తాయని, 37 సంవత్సరాల నాటికి రూ.2కోట్ల 83లక్షలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వై. వెంకటేశ్వర్లు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర్ రావు, బండారు రాజా, యామా ప్రభాకర్, తప్సీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

దక్షిణాది అణగారిన వర్గాల చరిత్రకు పరిశోధనల ద్వారా సముచిత స్థానం

ఆధారాలు,హేతుబద్ధ పరిశీలనతోనే చరిత్ర రచన :ఆచార్య భాంగ్యా భూక్యా

45వ దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్‌కు 838 మంది ప్రతినిధులు..705 పరిశోధన పత్రాల సమర్పణ



ప్రజాపక్షం/నల్లగొండ: భారతదేశ చరిత్ర అంటే ఉత్తర భారతదేశంలో జరిగిన పరిణామాలే అన్నట్లుగా కొనసాగుతున్న ధోరణిని అధిగమించాలని, దక్షిణ భారతదేశ చరిత్రతోపాటు అణగారిన వర్గాలు,స్థానిక సమాజాల చారిత్రక అనుభవాలకు పరిశోధనల ద్వారా సముచిత స్థానం కల్పించాలని ఆచార్య భాంగ్యా భూక్యా అన్నారు.చరిత్ర రచన అనేది కేవలం గత సంఘటనలను కథనాలుగా చెప్పడం కాదని,విశ్వసనీయ ఆధారాలు, శాస్త్రీయ పద్ధతులు,హేతుబద్ధమైన విమర్శనాత్మక పరిశీలనతో వాస్తవాలను వెలికితీసే జ్ఞాన ప్రక్రియ అని స్పష్టం చేశారు.
నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 45వ దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్‌లో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత చరిత్ర పరిశోధనలో అనుసరించాల్సిన విధానాలు,ఇప్పటివరకు వెలుగులోకి రాని సామాజిక వర్గాల చారిత్రక పాత్రలు, పరిశోధనల ఆవశ్యకతను వివరించారు.దక్షిణ భారత చరిత్రను కేవలం రాజులు,రాజవంశాలు,యుద్ధాలకే పరిమితం చేయకుండా సముద్ర వాణిజ్యం, వర్తక సంఘాలు,విదేశీ సంబంధాలు, విదేశాల్లో ఆలయాల నిర్మాణానికి అందించిన సహకారం వంటి అంశాలను కూడా పరిశోధనల్లో భాగం చేయాలని అన్నారు.ఆయా చారిత్రక పరిణామాల్లో వర్తకులు,శిల్పులు,చేతివృత్తిదారులు,శ్రామిక వర్గాల పాత్రలను వెలికితీయాల్సిన బాధ్యత పరిశోధకులపై ఉందన్నారు.
హేతుబద్ధ చరిత్ర రచనకు యువ పరిశోధకులు ప్రాధాన్యం ఇవ్వాలి
దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆచార్య విక్టర్‌బాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల చరిత్రలను వెలికితీసేందుకు పరిశోధకులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు.యువ పరిశోధకులు ఆధారపూర్వకమైన,హేతుబద్ధమైన చరిత్ర రచనపై దృష్టి సారించాలని సూచించారు. అధ్యాపకులు, పరిశోధకులు,చరిత్రకారుల మధ్య జ్ఞాన మార్పిడి,పరస్పర సహకారం బలోపేతం కావాలన్నారు.స్థానిక చరిత్రలు, విభిన్న సామాజిక అనుభవాలు, సాంస్కృతిక పరిణామాలపై పరిశోధనలకు దక్షిణ భారత దేశం విస్తృత అవకాశాలను అందిస్తోందని పేర్కొన్నారు.
838 మంది ప్రతినిధులు..407 మంది మహిళలు
45వ దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్‌కు మొత్తం 838 మంది ప్రతినిధులు నమోదు చేసుకున్నారని ఆచార్య విక్టర్‌బాబు, స్థానిక కార్యదర్శి డాక్టర్ పనస రామకృష్ణ వెల్లడించారు. వీరిలో తెలంగాణ నుంచి 86 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 752 మంది పాల్గొన్నారని తెలిపారు.మొత్తం ప్రతినిధుల్లో 407 మంది మహిళలు, ఐదుగురు దివ్యాంగులు ఉండటం విశేషమన్నారు. పీజీ విద్యార్థులు,పీహెచ్‌డీ పరిశోధకులు,అధ్యాపకులు కలిపి మొత్తం 705 పరిశోధన పత్రాలు సమర్పించినట్లు వివరించారు.డాక్టర్ అరుణ ప్రియ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య అంజిరెడ్డి,ఆచార్య ఆకుల రవి,ఆచార్య అలువాల రవి, ఆచార్య విక్టర్‌బాబు,ఆచార్య సదాశివన్,దక్షిణ భారత చరిత్ర కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు,కార్యదర్శులు పాల్గొన్నారుచరిత్ర విభాగానికి చెందిన డాక్టర్ పనస రామకృష్ణ,డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ షరీఫ్, వివేక్‌తోపాటు వివిధ విభాగాల అధ్యాపకులు,పరిశోధకులు, విద్యార్థులు హాజరయ్యారు.

'నేడు' కలెక్టరేట్‌లో బాలల ప్రజావాణి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల 16న(నేడు) సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో పిల్లల ప్రజావాణి నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సాధారణ ప్రజావాణి ప్రాంగణంలో పిల్లల కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. బాలల హక్కులపై సమాజంలో అవగాహన పెంపొందించడంతో పాటు పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడమే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఆరోగ్య సేవలు, వైద్య సదుపాయాలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా సమస్యలు, గ్రామాలు, కాలనీల్లో పిల్లలకు అవసరమైన సదుపాయాలు, పాఠశాలలకు రవాణా సౌకర్యం వంటి అంశాలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పౌష్టికాహారం, మధ్యాహ్న భోజనం, బాలల భద్రత, సంరక్షణ, రక్షణకు సంబంధించిన సమస్యలతోపాటు ఇతర అవసరాలపై పిల్లలు నేరుగా అధికారులకు వినతిపత్రాలు అందజేయవచ్చని తెలిపారు. పిల్లల గొంతుకను జిల్లా స్థాయి అధికారులకు వినిపించి, వారి సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ సకాలంలో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అందించే హక్కులు, సేవలు, సంక్షేమ పథకాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ప్రజలు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పాల్గొని పిల్లల ప్రజావాణిని విజయవంతం చేయాలని కోరారు.

పుస్తకాలతోనే జ్ఞానాభివృద్ధికి మార్గం

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శ



ప్రజాపక్షం/యాదాద్రిభువనగిరి: 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భువనగిరి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవేస్ చిస్తీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి, టీజీవో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్, జిల్లా జేఏసీ చైర్మన్ మందడి ఉపేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయారు. ఈ సందర్భంగా మందడి ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకాలె జ్ఞానాభివృద్ధికి మార్గమనిఅన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు ఎండి అవేస్ చిస్తీ మాట్లాడుతూ పాఠకుల కోసం వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. నేటి డిజిటల్ యుగంలో యువత , విద్యార్థులు కేవలం మొబైల్ ఫోన్లకే పరిమితం కాకుండా, పుస్తక పఠనాన్ని ఒక అలవాటుగా మార్చుకొని జ్ఞానాభివృద్ధి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను అధ్యక్షులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు బ్రై జహంగీర్, ఎనబోయిన ఆంజనేయులు, బీజేపీ పట్టణ అధ్యక్షులు రత్నపురం బలరాం, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఏవి కిరణ్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, బీజేపీ సీనియర్ నాయకులు చందా మహేందర్ గుప్తా, డీసీసీ జనరల్ సెక్రటరీ ఎండి మజహర్, మాజీ కౌన్సిలర్ రెడ్డికాడి భగత్, సీపీఐ జనరల్ సెక్రటరీ శోభన్, ఇమ్రాన్, సీనియర్ సిటిజన్లు జంపాల అంజయ్య, బాలేశ్వర్, గ్రంథాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్వయంగా మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల ఆర్థిక వికాసానికి పెద్దపీట వేస్తూ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని అన్నారు.సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూనే, గత పాలకులు రాష్ట్రంపై మోపిన భారీ ఆర్థిక భారాన్ని సమర్థవంతంగా అధిగమిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, మున్సిపల్ కమిషనర్ (శ్రీజా రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, నూతన పింఛన్ల లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ సీనియర్ నాయకుడు మారయ్య మృతి



ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్): ధర్వేశిపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు సింగం మారయ్య మృతి చెందడం పట్ల పార్టీ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళుల ర్పించిన వారిలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి చిలక రాజు రాములు, సీనియర్ నాయకులు సూరయ్య,జినుకుంట్ల లింగయ్య,శాఖ కార్యదర్శి గట్టిగుండ్ల చిన్న నరసింహ,మురళి ఎల్లయ్య, జినుకుంట్ల అంజనేయులు ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

సూర్యాపేట జిల్లా ఎస్పి కె. నరసింహ



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పరీక్షల పట్ల ఉన్న ఒత్తిడిని తగ్గించుకొని ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పి కె. నరసింహ సూచించారు. ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు సూర్యాపేట జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో 400 మంది అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్ర

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే దొంతి



ప్రజాపక్షం/ఖానాపురం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఖానాపురం మండల కేంద్రంలో ఆదివారం నూతనంగా మంజూరైన చేయూత పెన్షన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని 509 మంది లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 4900 పెన్షన్లు మంజూరయ్యాయని, మరో 400 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు.

గూడూరులో 17 ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం

ప్రజాపక్షం/గూడూరు; వివధ కేసుల్లో పట్టుబడి ఎక్సైజ్ శాఖ ఆధీనంలో ఉన్న 17 ద్విచక్ర వాహనాలను మహిరంగ వేలం వేయనున్నట్లు గూడూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ సిఐ మమత వెల్లండిచారు. ఈనెల 17 వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు గూడూరు ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ఈ వేలం ప్రక్రియ నిర్వహించనున్నట్లు సిఐ మమత తెలిపారు. మహబూబాబాద్ జిల్లా ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి కరంచంద్ సమక్షంలో వేలం కార్యక్రమం జరగనుంది. వేలంలో పాల్గొనాలనుకునే ఆసక్తిగల వ్యక్తులు తమ ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతితో నిర్ణీత సమయానికి ఎక్సైజ్ స్టేషన్‌కు చేరుకోవాలని సూచించారు.

కలెక్టరేట్‌లో ముగిసిన ఖాళీ పోస్టుల భర్తీ పరీక్షలు



ప్రజాపక్షం/జనగామ: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాల యాల్లోని పది నాన్ టీచింగ్ పోస్టులు, టిజిఐఎఐఎస్‌లోని నాలుగు నాన్ టిచింగ్ పోస్టులకు ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నేలపోగులపిఎం శ్రీ రత్నమాల కేసరి పాఠశాలలో ఇంగ్లీష్, గణిత సబ్జెక్ట్‌లకు, మైనార్టీ సంక్షేమ పాఠశాలలలో స్టాఫ్ నర్స్ పోస్టులకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పరీక్షలు జరిగాయి. మొత్తం 17 పోస్టులకు 188 మంది ధరఖాస్తు చేసుకోగా 157 మంది హాజరయ్యారు. కెజిబివిలలోని 10 పోస్టులకు 121 మంది హాజరు కాగా 19 గైర్హాజర్ అయ్యారు. టిజిఎంఎస్‌లోని నాలుగు పోస్టులకు 28 మంది ధరఖాస్తు చేసుకోగా 19 మంది హాజరయ్యారు. పిఎం శ్రీ రత్నమాల కేసరిలో రెండు పోస్టులకు 8 మంది హాపరయ్యారు. ఇలా వివిధ పోస్టులకు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్వయంగా పరిశీలించారు. పరీక్షల అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ముందస్తు ప్రణాళిక అవసరం

ప్రజాపక్షం/గూడూరు; వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందుస్తు సాగు ప్రణాళికలు రూపొందించుకోవాలని గూడూరు మండల వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్ సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే ముఖ్యంగా అధిక నీటి అవసరమయ్యే వరి వంటి పంటల సాగు రైతులకు ఆర్థిక భారంగా మారే ప్రమాదం ఉందని అందువల్ల పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని తెలిపారు. ఎల్ నినో ప్రభావం ఉంటుందనే అంచనాలతో రైతులు ఆందోళన చెందకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని అబ్దుల్ మాలిక్ పిలుపునిచ్చారు.

పదేళ్లుగా బిఆర్ఎస్ నాయకులకు గుర్తుకు రాని పలుగుల రోడ్డు

ఇప్పుడు పాదయాత్రల పేరుతో విమర్శలా?



ప్రజాపక్షం/మహదేవపూర్; గత పది సంవత్సరాలుగా పలుగుల గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్డు సమస్యలు అప్పటి పాలకులకు గుర్తుకు రాలేదా అని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు.పలుగుల రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు 22 కోట్లు మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టడానికి కృషి చేస్తున్న క్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభిస్తారంటూ బిఆర్ఎస్ నాయకులు పాదయాత్ర చేపట్టడం పలుగుల ప్రజలపై మొసలి కన్నీరు కార్చినట్లుగా ఉందని విమర్శించారు. పలుగుల రోడ్డును పరిశీలించిన మాజీ ఎంపిటిసి,కాళేశ్వరం దేవస్థాన డైరెక్టర్ మంచినీళ్ల దుర్గయ్య, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబును ఏకవచనంతో సంబోదించడం ప్రజా నాయకులుగా మాట్లాడే పద్ధతి కాదని పేర్కొన్నారు.అభివృద్ధిపనులపై విమర్శలు చేసే ముందు గతంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్నపుడు ఈ రోడ్డు సమస్యను ఎందుకు పరిష్కరించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు.

వరి వద్దు..ఆరుతడి పంటలే ముద్దు

ప్రజాపక్షం/నడికూడ : రానున్న యాసంగి2026 సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి,విద్యుత్ సరఫరా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని నడికూడ మండల వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్ సూచిస్తూ,నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగును సాధ్యమైనంత వరకు పూర్తిస్థాయిలో తగ్గించి,తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ వంటి సూక్ష్మ నీటిపారుదల పరికరాలతో పాటు పంట వ్యవసాయ ఇన్‌పుట్స్‌పై అందుబాటులో ఉన్న సబ్సిడీ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు.సబ్సిడీ విత్తనాలు,డ్రిప్, స్ప్రింక్లర్,మల్చింగ్,సోలార్ ఫెన్సింగ్ తదితర సౌకర్యాలు పొందాలనుకునే రైతులు వెంటనే తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నిత్యావసర ధరలు పైపైకి

సామాన్యులకు 'చుక్కలు'!

కొండెక్కిన కోడిగుడ్డు.. కన్నీరు పెట్టిస్తున్న ఉల్లిగడ్డ, రూ.8 చేరిన గుడ్డు ధర
కిలో రూ70కి చేరువలో ఉల్లి ధరలు
ఒకవైపు కరువు కష్టాలు.. మరోవైపు ధరల భారం..
సామాన్యుడి బతుకు భారమే





ప్రజాపక్షం/భూపాలపల్లి: ఒకవైపు కరువు కష్టాలు.. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరల మంటలు.. వెరసి సామాన్యుడి బతుకు భారంగా మారుతోంది. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు పేద, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని అతలాకుతలం చేస్తున్నాయి. ఇప్పటికే వ్యవసాయ రంగంలో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, వర్షాభావంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, మార్కెట్లో పెరుగుతున్న కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఒకప్పుడు సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్డు ధర సైతం ఇప్పుడు కొండెక్కింది. పౌష్టికాహారంలో భాగంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా వినియోగించే కోడిగుడ్డు ధర రూ.8 కి చేరడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వంటింట్లో తప్పనిసరిగా వినియోగించే ఉల్లిగడ్డ ధరలు కిలో 70 నుండి 80 చేరువ కావడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

కరువు కష్టాలకు తోడు ధరల సెగ..

ఇప్పటికే వర్షాభావ పరిస్థితులతో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడింది. పంటలు సరిగా పండక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులు తగ్గడంతో కూలీలకు ఉపాధి అవకాశాలు సైతం తగ్గుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం సామాన్య ప్రజలకు మరింత భారంగా పరిణమిస్తోంది. వచ్చిన కొద్దిపాటి ఆదాయం కుటుంబ పోషణకే సరిపోని పరిస్థితి నెలకొంటోంది. బియ్యం, కూరగాయలు, పప్పులు, నూనెలు, కోడిగుడ్లు వంటి వస్తువుల ధరలు పెరుగుతుండటంతో నెలవారీ ఇంటి ఖర్చులు అదుపు తప్పుతున్నాయి.

పేద, మధ్యతరగతి కుటుంబాలపై పెను భారం

రోజువారీ కూలీ పనులు చేసుకునే కుటుంబాలు, చిరు ద్యోగులు, అల్పాదాయ వర్గాల ప్రజలు ధరల పెరుగుదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాల్సిన పాలకులు, సంబంధిత అధికారులు మార్కెట్‌పై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ధరల నియంత్రణకు చర్యలు ఎప్పుడు?

మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు ఇష్టారాజ్యంగా పెరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సామాన్యులు కోరుతున్నారు. కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వ్యాపారులపై నిఘా పెట్టాలని, మార్కెట్‌లో సరుకుల లభ్యతను పెంచేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూనే వినియోగదారులకు అందుబాటు ధరల్లో నిత్యావసర వస్తువులు లభించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అభిప్రాయపడుతున్నారు. కరువు కాటకాలతో రైతన్న కన్నీరు పెడుతుంటే, ధరల భారంతో సామాన్యుడు విలవిల్లాడుతున్నాడు. ఒకవైపు ఆదాయం అంతంతమాత్రం.. మరోవైపు ఖర్చులకు అంతులేకుండా పోవడంతో పేద, మధ్యతరగతి ప్రజల బతుకుబండి ముందుకు సాగడం కష్టంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు ఆశిస్తున్నారు.

మౌలిక సదుపాయాలే లక్ష్యం

మంత్రి సీతక్క



ప్రజాపక్షం/ వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గంలో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా రూ.58.44 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారుల నిర్మాణ పనులకు పంచాయితీ రాజ్ గ్రామీణ అభివృద్ధి,నీటి సరఫరా,మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కెఆర్ నాగరాజు, ఎంపి కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం శంఖుస్థాపన చేశారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఎఎం) ఫేజ్1 కింద టిజిఆర్‌డిపి ద్వారా పిఆర్ఇడి శాఖ ఆధ్వర్యంలో 17 వ ప్యాకేజీ ద్వారా 68.61 కిలోమీటర్ల మేర 41 రహదారుల నిర్మాణ పనులకి మంత్రి చే శంఖుస్థాపన చేశారు. రహదారుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెంట్ కమిటి చైర్మెన్ పులి ప్రియాంక, వర్ధన్నపేట మునిసిపల్ చైర్మెన్ పాలకుర్తి సారంగపాణి, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లో ఉన్నా.. సంక్షేమాన్ని వదలం

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



ప్రజాపక్షం/పరకాల : ప్రభుత్వం ఎన్ని కష్టాలైనా భరించి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆపేది లేదని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన పెన్షన్ దారుల పత్రాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 6 గ్యారంటీలలో ఒకటైన పెన్షన్ మంజూరీని ఇవ్వటం పట్ల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణలోని సబండ వర్ణాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు జరుపుతుందన్నారు. కొద్ది నెలల్లోని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రధానమైన పెన్షన్ పెంపుతో పాటుగా అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతుందని ఎమ్మెల్యే అన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి మహిళకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల కొంత డబ్బును ఇచ్చే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. పరకాల నడి కూడా పట్టణంతోపాటు అర్హులైన వారికి పెన్షన్ పత్రాలను ఆయన అందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ సునీల్ కమిషనర్ పవన్ తో పాటు కౌన్సిలర్లు, పరకాల నడికూడ మండలాలకు చెందిన అధ్యక్షులు పార్టీ కార్యకర్తలు, నాయకులు, లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్ పేరు, ఫొటోతో నకిలీ వాట్సాప్ ఖాతాలు

ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేరు, ఫొటోను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు నకిలీ సామాజిక మాధ్యమ, వాట్సాప్ ఖాతాల ను సృష్టించి డబ్బులు పంపాలంటూ ప లువురు అధికారులు, ప్రజలకు సందేశా లు పంపుతున్న ఘటన కలకలం రేపుతో ంది. ఈ తరహా సైబర్ మోసాల పట్ల ప్ర జలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. 97398 11309 అనే మొబైల్ నంబర్ నుంచి త న పేరు, ఫొటోను ఉపయోగించి పలువురికి సందేశాలు పంపుతూ డబ్బులు అడుగుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సదరు నంబర్‌తో పాటు తన పేరుతో వ చ్చే ఇతర అనుమానాస్పద నంబర్ల నుం చి సందేశాలు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో నూ స్పందించవద్దని స్పష్టం చేశారు. గు ర్తుతెలియని వ్యక్తుల అభ్యర్థనలను న మ్మి ఎవరూ డబ్బులు పంపి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే సైబర్ నేరాల పోలీస్‌లకు ఫి ర్యాదు చేసి కేసు నమోదు చేయాలని స మాచారం అందించినట్లు తెలిపారు. ఇ లాంటి నకిలీ సందేశాలు అందినట్లయి తే వెంటనే సంబంధిత నంబర్‌ను నిలిపివేసి, సైబర్ నేరాల పోలీస్‌లకు సమాచా రం అందించాలని కోరారు. ప్రముఖు లు, ఉ న్నతాధికారుల పేర్లు, ఫొటోలతో వచ్చే నకిలీ ఖాతాల పట్ల అప్రమత్తంగా ఉం డాలని, సందేశం పంపిన వ్యక్తి నిజమైన వారేనని నిర్ధారించుకున్న తర్వాతే స్పం దించాలని కలెక్టర్‌విజ్ఞప్తి చేశారు.

డ్రా పద్ధతిలో ఇండ్ల పంపిణీ



ప్రజాపక్షం/తొర్రూరు : పట్టణ కేంద్రంలోని గోపాలగిరి రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు డ్రా పద్ధతిలో పంపిణీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ఆదివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని అన్నారం రోడ్డులోని బిఆర్ గార్డెన్‌లో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం పూర్తయిన సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కెటాయింపు కార్యక్రమాన్ని లాటరీ పద్ధతి ఎల్2 ద్వారా 280మంది లబ్ధిదారులకు పూర్తిగా పారదర్శకంగా కెటాయించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ స్నేహశబరీష్ పాల్గొని మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లలో అన్ని సౌకర్యాలను ఉండే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, స్థానిక సంస్థలు హౌసింగ్ పిడిపురుషోత్తం, తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్‌కుమార్, వైస్ చైర్మన్ సోమ రజిని, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ, పలు శాఖల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలు అమలు జరపాలి

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



ప్రజాపక్షం/ వరంగల్ : శాసనసభ ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను మూడేళ్లు కావస్తున్న అమలు జరపకుండ ప్రభుత్వం వంచిస్తున్నదని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్‌లో జిల్లా అధ్యక్షురాలు సిలువేరు విజయ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుల విధానాలతో వ్యవసాయ కార్మికుల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ. 12వేలు ఇస్తామని చేసిన వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో భూమిలేని పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రభుత్వ స్థలాలలోగుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ గృహాలు నిర్మించాలన్నారు. వ్యవసాయ కార్మికుల పిల్లలకు కెజి నుండి పిజి వరకు ఉచిత విద్య అందించాలన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నందున కేంద్రం ప్రభుత్వము రాష్ట్రానికి రూ. 30 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని, కరువు నివారణ చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రైతులను కూలీలను ఆదుకోవాలన్నారు. ఉపాధి హామి పనులను అన్ని గ్రామాలలో పకడ్బందీగా నిర్వహించాలని, పని ప్రదేశాలలో కనీన మౌలిక సదుపాయాలు కలిగించాలని, రోజుకు రూ.700లు కూలి ఇవ్వాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కూలీల కుటుంబాలకు రూ. 25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి అన్ని విధాల ఆదుకోవాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల ఎడల పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరశిస్తూ సమస్యల పరిష్కారానికి చైతన్యంతో సంఘటితంగా సమరశీల పోరాటాలు నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపెల్లి రమేష్, ఉపాధ్యక్షులు జాన్ పాల్, యాదగిరి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

'మెడికల్' కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రజాపక్షం/ వరంగల్: న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి ఆధ్వర్యంలో సికెఎం హాస్పిటల్ ఎదుట కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నాల్గవ రోజు ధర్నాలో భాగంగా మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం రూ. 26వేలు చెల్లించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి కార్పొరేషన్ లేదా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు, ప్రతినెల ఒకట వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని, కార్మికులకు సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని, ప్రతి కార్మికునికి ప్లే స్లిప్పులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అధ్యక్ష కార్యదర్శులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దడిగెల సంధ్యారాణి, సక్కుబాయి, లావణ్య, జిల్లా నాయకులు కొండ వీరన్న, వనం రఘు, గద్దె కొమ్మాలు, వరలక్ష్మి , బిందు, జ్యోతి, వంశీ, శ్రీశైలం, కమలాకర్, అమ్మయ్య, రవీందర్, రాము, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


కాజీపేటలోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ

అఖిలపక్షం డిమాండ్



ప్రజాపక్షం/కాజీపేట : తెలంగాణ రైల్వే జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే కమ్యూనిటీహాల్ లో ఆదివారం కొండ్ర నర్సింగారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం రైల్వే జాక్ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ పర్యవేక్షణలో జరిగింది. 2026 డిసెంబర్ నెలలో ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఆర్ఎంయులో భూ నిర్వాసితులతో పాటు రైల్వేలో ఆక్ట్ అప్రెంట్షిప్ పూర్తి చేసిన నిరుద్యోగులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా, కాజీపేట పట్టణ పరిసర గ్రామాల నిరుద్యోగ పిల్లలకు, ఐటిఐ డిప్లొమా, ఇంజినీరింగ్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులకు కాజీపేట్ ఆర్ఎం యులో 80 శాతం స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. వచ్చే జనవరి నెల నుండి కాజీపేట్ ఆర్ఎంయులో రైల్వే కోచ్‌లు తయారీకి రైల్వే అధికారులు అన్నీ సిద్ధం చేస్తున్న క్రమంలో తెలంగాణ రైల్వే జెఏసి డిమాండ్లను పరిగణంలోకి తీసుకొని తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చి కాజీపేట్ ఆర్ఎంయులో 80 శాతం ఉద్యోగాలు ఈ ప్రాంత వాసులకు కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఐ నాయకులు నేదునూరి రాజమౌళి మాట్లాడుతూ అన్ని పార్టీలు ఐక్యమత్యంతో కలిసి ఇఆర్ఎంయులో ఉద్యోగాల కల్పనకు కలిసి కదలాలని అన్నారు. ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి హంసా రెడ్డి మాట్లాడుతూ రైల్వే జాక్ తీసుకునే ఏ పోరాటానికైనా మా సంపూర్ణ మద్దతుగా ఉంటుందని అన్నారు. విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భూ నిర్వావశితులకు, అక్కడి కూలీలకు మొదటినుండి మోసాలు చేస్తున్నాయని, వారికి సరైన న్యాయం కోసం రైల్వే జాక్ తీసుకునే ఎజెండా పోరాటానికి వారితో కలిసి పోరాటం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిబిఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుంచు రాజేందర్, రైల్వే ఒబిసి సికింద్రాబాద్ డివిజనల్ సెక్రెటరీ సంతోష్ కుమార్, వస్కుల రవీందర్, రైల్వే ఆక్ట్ అప్రెంట్షిప్ యుత నాయకుడు ప్రవీణ్, ఎస్సి,ఎస్టిఉపాధ్యాసంఘం జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు,జెఏసి నాయకులు తిరుపతి,మెరుగు రాజయ్య, రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి సుధాకర్ రావు, సభ్యులు నాగేష్, రైల్వే ఒబిసి బెల్లంకొండ రమేష్, డెమోక్రటిక్ స్టూడెంట్ అసోసియేషన్ స్టేట్ కన్వీనర్ శ్రవణ్, పిడిఎస్, మర్రి మహేష్, కారు ఉపేందర్, ఎఐటియుసి ప్రెసిడెంట్ వేల్పుల సారంగపాణి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ పాల్గున్నారు.

బిర్సా ముండా పోరాటం స్ఫూర్తిదాయకం



ప్రజాపక్షం/జనగామ: అన్యాయాన్ని సహించకుండా స్వతంత్ర, సంస్కృతి కోసం పోరాటం చేసిన బిర్సా ముండా 151వ జయంతి వేడుకలు ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా జరిగాయి. భగవాన్ బిర్సా ముండా చిత్ర పటానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని నివాళ్లు అర్పించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ బిర్సా ముండా జీవితం ఆదర్శమని, ఆయన పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. భారత ప్రభుత్వం 2021 సంవత్సరం నుండి భగవాన్ బిర్సా ముండా జయంతి జనజాతీయ గౌరవ దినోత్సవంగా నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. అప్పటి నుండి దేశ వ్యాప్తంగా గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలు, హక్కులు, స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్రను గుర్తు చేసుకునే విధంగా ఈ వేడుకలను ప్రత్యేక ప్రధాన్యతతో జరుపుకోవడం జరుగుతుందన్నారు. అన్యాయాన్ని ఎదిరించడం, తమ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడడం అనే రెండు ప్రధాన అంశాలను జీవన విధానంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ బెన్నాలోమ్, బంజారా కమ్యూనిటి చైర్మన్ డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్, కుల సంఘాల ప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు భగవాన్ బిర్సా ముండా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి హసీన్ బేగం, ఎల్‌హెచ్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోతు అనిత, రాష

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
16-11-2026
www.prajapaksham.in

కొణిదెల పవన్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'జంట'. ఈ చిత్రంలో పాడని కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వసుంధర ఆర్ట్స్ బ్యానర్‌పై రాజేష్ గునిశెట్టి, వీరు యాదవ్ నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఒక యూనిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు రాజశేఖర్ యాదవ్ రూపొందిస్తున్నారు.



జనవరి 1న వస్తున్న 'విసా–వింటారా సరదాగా'

నూతన సంవత్సరానికి వినోదభరితమైన ఆహ్వానం పలుకుతూ యంగ్ హీరో అశోక్ గల్లా, శ్రీ గౌరీ ప్రియ జంటగా నటించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'విసా –వింటారా సరదాగా' ప్రపంచవ్యాప్తంగా జనవరి 1, 2027న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ప్రేమ, స్నేహం, సరదా, యువత జీవితంలోని అనుభవాల సమ్మేళనంగా తెరకెక్కిన ఈ చిత్రం న్యూ ఇయర్ సందర్భంగా ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని అందించనుంది. ఉద్భవ్ రఘు దర్శకత్వం వహించిన ఈ చిత్రం అమెరికా నేపథ్యంలో సాగుతుంది. ఉన్నతమైన కలలను సాకారం చేసుకోవాలనే ఆశయంతో స్వదేశాన్ని విడిచి అమెరికాకు వెళ్లిన తెలుగు విద్యార్థుల జీవితాల చుట్టూ కథనం సాగుతుంది. సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ కూడా ప్రేక్షకుల్లో మంచి బజ్ క్రియేట్ చేస్తున్నాయి. ఇప్పటివరకు విడుదలైన 'అనగా అనగా అమెరికా', 'చింగారి' పాటలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఎస్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌పై సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
'విసా ! వింటారా సరదాగా' గ్రాండ్ వరల్డ్‌కు థియేట్రికల్ రిలీజ్ – జనవరి 1, 2027న రిలీజ్ చేయనున్నారు.

శౌర్య క్రియేషన్స్‌పై 'ప్రేమాంజలి'

శౌర్య క్రియేషన్స్ బ్యానర్‌పై వెబ్ సిరీస్‌లు, సినిమాలు రూపొందించబోతున్నారు. ఈ బ్యానర్‌లో 'ప్రేమాంజలి' అనే వెబ్ సిరీస్ రాబోతోంది. ఈ వెబ్ సిరీస్‌లో బోదాసు నరసింహం హీరోగా నటిస్తుండగా, సభా ఖనన్ హీరోయిన్‌గా నటించనుంది. ఈ వెబ్ సిరీస్ కు నందుటి అశోక్ గౌడ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'తిండిబోతు దెయ్యం' పేరుతో మరో వినూత్న చిత్రం త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో బోదాసు నరసింహం హీరోగా, మౌనిక కథానాయికగా నటిస్తున్నారు. ఈ సినిమాకు బోదాసు నరసింహం దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్ట్స్‌కు ప్రణయ్ కుమార్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సందర్భంగా, డైరెక్టర్, హీరో బోదాసు నరసింహం మాట్లాడుతూ ఈ రోజు మా శౌర్య మీడియా యూట్యూబ్ ఛానెల్ ప్రారంభించాం. వెబ్ సిరీస్‌లు, సినిమాలు రూపొందించి ప్రేక్షకులకు నాణ్యమైన వినోదాన్ని అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మధ్య టైటిల్ ఒకటి, సినిమా మరొకటి ఉంటోంది. కానీ మేము తీసే సినిమాల్లో, వెబ్ సిరీస్ లలో టైటిల్, కథ ఒకటే ఉంటుంది. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నా, ప్రేక్షకుల్ని నవ్వించాలని అనుకుంటున్నాం. చిన్న పిల్లలు కూడా మా మూవీస్, వెబ్ సిరీస్‌లు చూస్తూ నవ్వుకోవాలి. మాకు శుభాకాంక్షలు తెలిపిన అతిథులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు. అన్నారు.





'మణిమ' షూటింగ్ షురూ

శ్రీ ఫిలిమ్స్ & ప్రొడక్షన్స్ పతాకంపై 'మణిమ' సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో ప్రారంభం అయింది. ఈ కార్యక్రమంలో తెలంగాణా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవీన్ నలమాస దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను అమరేష్ చంద్ర సారంగి నిర్మిస్తున్నారు. ఇందులో పృథ్వీ సాయి దండమూడి, జీషు సేన్ గుప్తా, కబీర్ దుహన్ సింగ్, బాబీ మిశ్రా నటిస్తున్నారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క క్లాప్ కొట్టారు. దర్శకుడు భీమనేని శ్రీనివాస్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి షాట్‌కి ప్రముఖ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్ సినిమా నిర్మాత అమరేష్ చంద్ర సారంగి చిత్ర దర్శకుడికి అందించారు.చిత్ర దర్శకుడు నవీన్ నలమాస మాట్లాడుతూ... ఈ సినిమా మైథాలజికల్ యాక్షన్ థ్రిల్లర్ బేస్ తో పూరీ జగన్నాథ్ స్వామి నేపథ్యంలో తెరకెక్కిస్తున్నాం. ఈ చిత్రం రామోజీ ఫిలింసిటీలో ఈనెల 16 నుంచి తొలి షెడ్యూల్ ప్రారంభం అవుతుంది. ఇక్కడ రెండు షెడ్యూలు, ఒరిస్సా ఒకటి చేసి... వచ్చే ఏడాది జులైలో జరిగే పూరీ జగన్నాథ్ రథయాత్ర సమయానికి సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాత అమరేష్ చంద్ర సారంగి మాట్లాడారు. ఈ చిత్రంలో హీరో పృథ్వీ సాయి దండమూడి , జిషు సెంగుప్తా, కబీర్ దుహాన్ సింగ్, బాబీ మిశ్రా తదితరులు పాల్గొన్నారు. ఈచిత్రానికి డిఒపి జగదీష్ చీకటిఎడిటర్ మార్తాండ కె. వెంకటేష్, ప్రొడక్షన్ డిజైనర్ రాజీవ్ నాయర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మురళీ కృష్ణ రోంపల్లి, లైన్ ప్రొడ్యూసర్స్ సార్థక్, అజిత్ కుమార్.

'జంట' టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్



కొణిదెల పవన్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'జంట'. ఈ చిత్రంలో పాడని కుమార్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని వసుంధర ఆర్ట్స్ బ్యానర్‌పై రాజేష్ గునిశెట్టి, వీరు యాదవ్ నిర్మిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్‌లో సాగే ఒక యూనిక్ లవ్ అండ్ యాక్షన్ ఎంటర్ టైనర్‌గా దర్శకుడు రాజశేఖర్ యాదవ్ రూపొందిస్తున్నారు. ఆదివారం ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ లాంచ్ ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ రాజేష్ గునిశెట్టి మాట్లాడుతూ ఈ సినిమా కోసం రెండేళ్లుగా వర్క్ చేసుకుంటున్నాం. మా సినిమా కంటెంట్‌కు తగినట్లు అమలాపురంలోని లొకేషన్స్ యాప్ట్ అవుతాయని అనిపించి ఇక్కడికి వచ్చాం. అమలాపురం నుంచి వచ్చిన ప్రొడ్యూసర్స్‌గా మా సినిమా ఇక్కడ స్థానికంగా షూటింగ్ జరుపుకోవడం సంతోషంగా ఉంది అన్నారు. హీరో యిన్ పాడని కుమార్ మాట్లాడుతూ ఇది నాకు ఫస్ట్ తెలుగు మూవీ. ఈ సినిమాలో అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. సినిమా షూట్ లో జాయిన్ అయ్యేందుకు ఆత్రుతగా వేచి చూస్తున్నా. అన్నారు. హీరో పవన్ తేజ్ కొణిదెల మాట్లాడుతూ మా జంట చిత్రానికి శుభాకాంక్షలు అందజేసిన పెద్దలకు థ్యాంక్స్. మా సినిమాను మొదట్లో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించాలని అనుకున్నాం. ఆంధ్రా వైపు కూడా మన సినిమాల షూటింగ్స్ జరగాలని మేమంతా డిస్కస్ చేసుకుని అమలాపురానికి షిఫ్ట్ అయ్యాం అన్నారు. ఈ చిత్రానికి ఫైట్ మాస్టర్ గౌరిశంకర్ వి.వి, డిఒపి రాహుల్ శ్రీవాస్తవ్, మ్యూజిక్ సుభాష్ ఇషాన్, డైలాగ్ రైటర్ నత్మిక మధు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ కె.ఎస్. రవిబాబు ప్రొడ్యూసర్స్ రాజేష్ గునిశెట్టి, వీరు యాదవ్.

'మాంగళ్యం', 'పరాక్రమం', 'నిర్భంధం'తో అందరినీ మెప్పించిన సరోజ్ కుమార్ ప్రస్తుతం 'ఛప్రి' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. ఈ మూవీకి స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, లిరిక్స్, ఎడిటింగ్, మ్యూజిక్, దర్శకత్వం ఇలా అన్ని బాధ్యతలని సరోజ్ నిర్వర్తించారు. బి ఎస్‌కె మెయిన్ స్ట్రీమ్ బ్యానర్ మీద సరోజ్, ప్రమోద్ పడమటి, పృథ్వీ చౌహాన్ నిర్మించిన ఈ సినిమాలో సరోజ్‌తో పాటుగా ఐశ్వర్య బోరా, దివ్య జ్యోతి, శ్లోకా, ప్రవీన్, మోహన్ ఆర్య, జీవా బాలచందర్, ప్రియాంక సింగ్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. శనివారం నాడు ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన ఈవెంట్‌లో..సరోజ్ కుమార్ మాట్లాడుతూ ఛప్రి' సినిమాని సమ్మర్‌లో రిలీజ్ చేయాలని అనుకున్నాం. ఫిబ్రవరిలో టీజర్ ప్లాన్ చేశాం. కానీ ఈ మగాడు సీన్‌ని ఎవరో జూనియర్ ఆర్టిస్ట్ లీక్ చేశాడు. నేను ఎంతో ట్రామాని అనుభవించాను. అందుకే టీజర్‌ను ఇంత ఫాస్ట్‌గా వదిలాం.
ఈ కథను 700 రోజులు కష్టపడి రాశాను. రివ్యూయర్లను కూడా దృష్టిలో పెట్టుకుని పటిష్టమైన స్క్రీన్ ప్లే రాసుకున్నాను. కథకు తగ్గట్టుగా నాకు మంచి ఆర్టిస్టులు దొరికారు. ఆర్ట్ డైరెక్టర్ నాని నాకు ఎంతో సపోర్ట్ చేశారు. ప్రమోద్ అన్న నాకు అండగా నిలబడ్డారు. సమ్మర్‌లో కలుద్దాం. ఈ సినిమాతో మనమేంటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. ఐశ్వర్య మాట్లాడుతూ .. 'సరోజ్ గారితో వర్క్ చేయడం కొత్త అనుభూతిని ఇచ్చింది. అస్సాం నుంచి ఇక్కడకు వచ్చి ఇలా 'ఛప్రి'లో నటించడం ఆనందంగా ఉంది. మా సినిమా అద్భుతంగా వచ్చింది' అని అన్నారు.



హైదరాబాద్‌లో ఈనెల 25 నుంచి 27 వరకు నిర్వహించనున్న 'నషా ముక్త్ భారత్' కార్యక్రమానికి హాజరు కావాలని డైరెక్టర్ సుకుమార్‌ను ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి.

రిజర్వాయర్లలో సరిపడా నిల్వలు

- వచ్చే వానాకాలం వరకు తాగునీటికి ఇబ్బంది లేదు
- భూగర్భ జలాల పరిరక్షణకు రూ.5 వేల కోట్ల సాయం కోరాం
- యాసంగిలో వరి సాగు చేయొద్దని రైతులకు విజ్ఞప్తి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు తెలంగాణకు రూ.5 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులు, పలు జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న తీరును గణాంకాలతో ప్రధానికి వివరించినట్లు ఉత్తమ్ తెలిపారు. కేంద్ర భూగర్భ జల మండలి 2026 సెప్టెంబర్ నివేదికతో పాటు అన్ని రెవెన్యూ గ్రామాల్లో భూగర్భ జలాలను పెంపొందించి, పరిరక్షించేందుకు రూపొందించిన స్వల్ప, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికను ప్రధానికి అందజేశామని చెప్పారు. ఇందుకు రూ.5 వేల కోట్ల ప్రత్యేక కేంద్ర ఆర్థిక సాయం కోరినట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌కు తాగునీటి కొరత లేదు..

హైదరాబాద్‌లో ప్రస్తుతం తాగునీటి సమస్య లేదని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే వానాకాలం వరకు తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని రిజర్వాయర్లలో నిల్వ ఉంచామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని వచ్చే వేసవిలో తెలంగాణలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలను తాగునీటి అవసరాలకు భద్రపరచడంతో పాటు రైతులు యాసంగిలో వరి సాగును తగ్గించాలని, వీలైతే వరి సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రధాని మోదీ రాష్ట్రం వివరించిన ప్రతి అంశాన్ని ఓపికగా విని, పలు వివరాలను అడిగి తెలుసుకున్నారని, తెలంగాణ విజ్ఞప్తులను పరిశీలిస్తామని సానుకూలంగా స్పందించారని ఉత్తమ్ పేర్కొన్నారు.

ఎల్‌బి స్టేడియంలో సంప్రదాయ క్రీడల ఉత్సవం

ఆటల ప్రత్యక్ష ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: ఆధునిక సాంకేతికత, డిజిటల్ పరికరాల వినియోగంతో బహిరంగ ఆటలకు దూరమవుతున్న చిన్నారులకు సంప్రదాయ గ్రామీణ క్రీడలను పరిచయం చేస్తూ హైదరాబాద్‌లోని ఎల్‌బి స్టేడియంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో భాగమైన సంప్రదాయ ఆటలను భావితరాలకు అందించడంతో పాటు, వాటిపై పిల్లల్లో ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఆదివారం సంప్రదాయ క్రీడల ఉత్సవాన్ని నిర్వహించారు. ఆవసరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా వామన గుంటలు, కర్ర బిళ్లలు, బొంగరం, గోళీ గుండు, కబడ్డీ, ఖోఖో తదితర సంప్రదాయ క్రీడల చరిత్ర, నియమాలు, వాటి సాంస్కృతిక ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వామన గుంటలు, కర్ర బిళ్లలు, బొంగరం ఆటలను ప్రత్యక్షంగా ప్రదర్శించగా, వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల పద్ధతులను తెలుసుకుంటూ వాటిని స్వయంగా ఆడేందుకు ఆసక్తి చూపారు.ఈ సందర్భంగా ఆవసరం ఫౌండేషన్ వాలంటీర్లు మాట్లాడుతూ.. సంప్రదాయ క్రీడలు కేవలం వినోదానికే పరిమితం కావని, పిల్లల్లో శారీరక దృఢత్వం, మానసిక వికాసం, క్రీడాస్ఫూర్తి, సామాజిక నైపుణ్యాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. డిజిటల్ పరికరాల వినియోగాన్ని తగ్గించి బహిరంగ ఆటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రోటేరియన్ బీబో శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాశ్, ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ ద్వారకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఆవసరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రధాన కార్యదర్శి రోటేరియన్ టి. విజయ్‌కాంత్ నేతృత్వంలో, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ అధికారుల సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించడం, చిన్నారులు, యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించడం లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



మహిళా సంఘాలకు సహకారం

(మొదటి పేజీ తరువాయి)

సీతక్క మాట్లాడుతూ.. పేదరికం లేని సమాజాన్ని చూడాలని, పేదరికంతో బాధ పడకూడదు అనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ పేరుతో మహిళా శక్తిని బలోపేతం చేసే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందన్నారు.మహిళలు సంతోషంగా, ఆర్థిక స్వావలంబనతో ఉన్నప్పుడే కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని, తల్లి సంతోషంగా ఉంటేనే పిల్లల భవిష్యత్తు బాగుంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది మహిళలు సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, గత 3 సంవత్సరాల్లో బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి ద్వారా మహిళా సంఘాలకు సుమారు రూ.70 వేల కోట్ల రుణాలు అందించినట్లు వివరించారు. హైదరాబాద్ హైటెక్ సిటీలో మహిళా సంఘాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచితంగా షాపులు కేటాయించారని పేర్కొన్నారు.మహిళా సంఘాల సభ్యుల కుటుంబాలకు భరోసా కల్పించేందుకు బీమా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మండల సమాఖ్యలకు బస్సులు కొనుగోలు చేసేందుకు రూ.30 లక్షల వరకు సహాయం, సబ్సిడీ కల్పిస్తున్నామని, ఒక్కో బస్సు ద్వారా నెలకు రూ.70 వేల వరకు మండల సమాఖ్య ఖాతాలో ఆదాయం జమ అవుతోందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామని, విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గ్రామంలో మ్యారేజ్ హాళ్లు, పాఠశాలలకు ప్రహరీ గోడలు, గ్రంథాలయ భవనాలు, సిసి రోడ్లు, మహిళా భవనాలకు అదనపు షెడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని సర్పంచ్‌కు సూచించామని తెలిపారు. ఎంపి కడియం కావ్య మాట్లాడుతూ...ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ నిరుపేదల కోసం అహర్నిశలు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. శాసనసభ్యులు నాగరాజు మాట్లాడుతూ ప్రజాపాలన వచ్చాక నిరుపేదలకు సన్నబియ్యం, నూతన రేషన్ కార్డు లు, ఉచిత బస్సు సౌకర్యం, నూతన పెన్షన్ లు ఇలా అన్నీ రకాల వర్గాల వారి సంక్షేమం కోసం వివిధ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళా లకు మీటింగ్‌లు పెట్టుకునే విధంగా రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణాలు చేపట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ మేన శ్రీను, సర్పంచ్ లు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు

కేటాయించాలి


(మొదటి పేజీ తరువాయి)

యూనియన్ (ఎఐటియుసి) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం. నరసింహ మాట్లాడుతూ నిరుద్యోగం పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో వేలాది మంది యువత, కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణిని పరిరక్షించడంతోపాటు కొత్త బొగ్గు గనులను ప్రారంభించాలని కోరారు. సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, సంస్థ పరిరక్షణ కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని తెలిపారు.
వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ కొత్త గూడెం జిల్లాలోని కోయగూడెం ఒసి3, మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. 2015లో కేంద్రం తీసుకొచ్చిన ఎంఎండిఆర్ చట్టం కారణంగా తెలంగాణలోని బొగ్గు గనులను కూడా వేలం ద్వారా కేటాయించే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కొత్తగా గుర్తించిన బొగ్గు గనులను సింగరేణికే కేటాయించే విధానం ఉండేదని, ప్రస్తుతం వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ నెల 17న బిడ్లు దాఖలు కానుండగా, డిసెంబర్ 1న వేలం ప్రక్రియ జరగనుందని తెలిపారు. సింగరేణితో పాటు ఎన్‌టిపిసి, తెలంగాణ జెన్‌కో, ఎపి జెన్‌కో, పలు ప్రైవేటు సంస్థలు బిడ్డింగ్ పత్రాలు తీసుకున్నట్లు చెప్పారు. స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంతోపాటు ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలంటే ఈ రెండు బ్లాకులు సింగరేణి ఆధీనంలోనే ఉండాలని స్పష్టం చేశారు.
సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడం వల్ల సంస్థ ఆర్థిక పరిస్థితి దెబ్బతింటోందని, కార్మికులతో కుదిరిన ఒప్పందాలు సకాలంలో అమలు కావడం లేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో బొగ్గు సరఫరా, ఎన్‌టిపిసి విద్యుత్ వినియోగానికి సంబంధించిన బకాయిలు పేరుకుపోయాయని, ప్రస్తుతం మొత్తం బకాయిలు సుమారు రూ.60 వేల కోట్లకు చేరాయని ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలను తక్షణమే చెల్లించాలని, సింగరేణి ప్రాంతాలకు కేటాయించాల్సిన సిఎస్ఆర్, డిఎంఎఫ్‌టి నిధులను ఇతర ప్రాంతాలకు మళ్లించకుండా చూడాలని కోరారు. కె. రాజకుమార్ మాట్లాడుతూ సింగరేణికి కొత్త బొగ్గు ప్రాజెక్టులు కేటాయించకపోతే భవిష్యత్తులో సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. కొత్త ప్రాజెక్టులు రాకపోతే సుమారు 80 వేల మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కోయగూడెం3, శ్రావణపల్లి బ్లాకులు సింగరేణికే దక్కేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేంద్ర కార్యదర్శి ఎండి.అక్బర్ అలీ, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కె.డబ్ల్యు.క్రిస్టోఫర్, వర్కింగ్ ఉమెన్స్ ఫోరమ్ కన్వీనర్ పి. ప్రేమ్ పావని, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ. లింగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట రామాంజనేయులు, రాష్ట్ర సమితి సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అత్యంత కీలకం

(మొదటి పేజీ తరువాయి)

మృణాల్ శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటి నిల్వ మట్టాన్ని పెంచేందుకు చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇప్పటివరకు పూర్తయిన మూడు లేయర్లు, మిగిలిన పనులు, నీటి లీకేజీ నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం వల్ల గోదావరి నదిలో నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. గోదావరి జలాలపై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి అవసరాలను తీర్చడం అత్యంత కీలకమని అన్నారు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేపట్టామన్నారు. అశ్వాపురం నుంచి మిషన్ భగీరథ పథకం ద్వారా మూడు జిల్లాలకు తాగునీటిని సరఫరా చేయాల్సి ఉందని, అందువల్ల దుమ్ముగూడెం వద్ద నీటిని నిల్వ చేసుకోవడం ఎంతో అవసరమని మంత్రి తెలిపారు. నీటి నిల్వకు ఏర్పాటు చేస్తున్న ఇసుక బస్తాల నుంచి నీరు లీకేజీ కాకుండా ప్రత్యేక రక్షణ షీట్లు ఏర్పాటు చేయాలని, నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే దుమ్ముగూడెం వద్ద సుమారు 36 టిఎంసిల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని, దీనివల్ల 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ తదితర జిల్లాలకు గోదావరి జలాలను నిరంతరాయంగా సరఫరా చేసేందుకు వీలవుతుందని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్ద ప్రస్తుత పరిస్థితుల్లో గేట్ల నిర్వహణకు సంబంధించి అనుమతుల సమస్యలు ఉన్నందున అంతటి దుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు గత పది రోజులుగా శ్రమించి మూడు లేయర్ల పనులను విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమని మంత్రి అన్నారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి నీటి నిల్వకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని, సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ అధికారులు నిరంతరం సమన్వయంతో పనిచేస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అమ్మగారి పల్లి సర్పంచ్ కవిత, ఇరిగేషన్ శాఖ ఎస్ఇ మహేశ్వరరావు, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలతోనే బ్రెయిన్ స్ట్రోక్ నివారణ

మధుయాష్కీ గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: బ్రెయిన్ స్ట్రోక్ పట్ల అందరికీ అవగాహన అవసరమని, ముందస్తు జాగ్రత్తలతో స్ట్రోక్ ను నివారించవచ్చని ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్